పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 69 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 20 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 69 PAGES : 12 EDITOR : G. A. RAO (ANAND GANTYADA) PUBLISHED : HYDERABAD TUE 20 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

ఆ ఘటనలు చాలా వరకు మత ప్రమేయం లేనివే

హైదరాబాద్ పెన్ పవర్::గత ఏడాది తమ దేశంలో మైనారిటీలకు సంబంధించిన ఘటనల్లో చాలా వరకు నేరపూరిత స్వభావం కలిగినవారు చేసినవే అని బంగ్లాదేశ్ పేర్కొంది. మతపరమైన ఉద్దేశాలు కారణం కాదని తెలిపింది. కొంతకాలంగా బంగ్లాదేశ్‌లో మైనారి టీలే లక్ష్యంగా జరుగుతున్న దాడులపై చర్యలు తీసుకోవాలంటూ భారత్ ఒత్తిడి తీసుకొచ్చిన వేళ ఈ ప్రకటన వెలువడింది .మైనారిటీలకు సంబంధించి గతేడాది 645 ఘటనలు చోటుచేసుకున్నట్లు బంగ్లాదేశ్ తాత్కాలిక సారథి మహమ్మద్

- మిగతా 2లో...

ఇరవై ఏళ్లుగా చెబుతున్నాం.. ఇప్పుడు టైమొచ్చింది

- గ్రీన్ లాండ్ స్వాధీనంపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు
- తమ సూచనలను డెన్మార్క్ పెడచెవిన పెట్టిందని విమర్శ
- ఇన్నాళ్లుగా వేచి చూశాం.. ఇక తమ నియంత్రణలోకి తీసుకుంటామని వ్యాఖ్య

- మిగతా 2లో...

ఆఫీస్‌లో రాసలీలలు..

డీజీపీ ర్యాంకు అధికారి బాగోతం

- మహిళతో రాసలీలలు... తీవ్ర వివాదంలో కర్ణాటక డీసీఆర్ఈ డీజీపీ రామచంద్రరావు
- డీజీపీ స్థాయి అధికారి రామచంద్రరావు రాసలీలల వీడియోలు వైరల్
- ఆఫీసులోనే మహిళతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు
- అవి మార్ఫింగ్ వీడియోలని ఖండించిన డీజీపీ
- ఘటనపై నివేదిక ఇవ్వాలని ఆదేశించిన సీఎం సిద్దరామయ్య
- గతంలో గోల్డ్ స్మగ్లింగ్ కేసులోనూ డీజీపీపై ఆరోపణలు

- మిగతా 2లో...

మేడారంలో సీఎం పూజలు

- ఆదివాసీ సంప్రదాయంలో ఘన స్వాగతం
- మనవడితో కలిసి 68 కిలోల బంగారం తులాభారం
- పైలాన్ ను అవిష్కరించిన ముఖ్యమంత్రి
- అభిమానులకు కరచాలనం చేస్తూ మున్ముందుకు..

హైదరాబాద్ పెన్ పవర్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉదయం మేడారం సమ్మక్క సారలమ్మ ను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గద్దెల వద్దకు చేరుకున్న సీఎంకు ఆదివాసీ డప్పు వాయిద్యాలతో ఘనస్వాగతం పలికారుఈ క్రమంలో ఆయన మేడారంలో గద్దెలు, ఆలయ ప్రాంగణాన్ని పునఃప్రారం బించారు. అనంతరం తన కుటుంబంతో కలిసి పసదేవ తలు సమ్మక్క సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహిం - చారు. మనవడితో కలిసి నిలువెత్తు బంగారాన్ని సీఎం సమర్పించుకున్నారు.. గద్దెల ప్రాంగణంలో పైలాను సీఎం ఆవిష్కరించారు. అంతకు ముందు తన మన వడితో కలిసి 68 కిలోల నిలువెత్తు బంగారాన్ని సమ ర్పించుకున్నారు. గద్దెల ం గణంలో మంత్రి సీతక్క సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ 2 సభ్యులకు, మంత్రులకు 3 దేవతల ప్రసాదం, చీరె సారె బహుకరించారు. ప్రభుత్వం రూ.251 కోట్లతో మేడారంలో అభివృద్ధి పనులను ప్రారం భించగా... ఆ పసులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఇతర ప్రజాప్రతి నిధులతో కలిసి ఆదివారం సాయంత్రం మేడారం పర్యట నకు వచ్చారు. డిప్యూటీ సీఎం. భట్టి విక్రమార్క, మంత్రివర్గ సహచరులు వివేక్ వెంకట స్వామి. ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ. సీతక్క జూపల్లి కృష్ణారావు తదితర మంత్రి వర్గ సహచ రులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి బస్సులో జంపన్న వాగు సర్వీల్ వరకు ప్రయాణించి, జాతరకు వచ్చే లక్షలాద్. భక్తుల కోసం చేసిన ఏర్పాట్ల మన్వయంగా పరిశీలించారు.

దావోస్ కు సీఎం రేవంత్

- మేడారం నుంచి శంషాబాద్
- అక్కడి నుంచి దావోస్కు ప్రయాణం
- వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సు కోసం..
- పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యం
- ఐదు రోజుల పాటు అక్కడే ముఖ్యమంత్రి

హైదరాబాద్ పెన్ పవర్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డావోస్ పర్యట నకు బయల్దేరి వెళ్లారు. ఉదయం కుటుంబ సమేతంగా వన దేవతలను సందర్శించు కున్నారు. ఆనంతరం నేరుగా హెలికాప్టర్ లో శంషాబాద్ విమానాశ్రయానికి చేరు కున్నారు అక్కడి నుంచి స్విట్జర్ లాండ్ లోని దావోస్ లో జరుగనున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం

- మిగతా 2లో...



ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు నోటీసులు

- ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని సిట్ నోటీసులు
- జూబ్లీహిల్స్‌లోని పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలన్న సిట్
- ప్రస్తుతం సిద్దిపేట పర్యటనలో ఉన్న హరీశ్ రావు

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో బీఆర్ఎస్ అగ్ర నేత, మాజీ మంత్రి హరీష్ రావుకు సిట్ నోటీసులు జారీ చేసింది. 2026, జనవరి 20వ తేదీ ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు రావాలని ఆదేశించింది. ఈ కేసులో ఇతర నిందితులు ఇచ్చిన వివరాల ఆధారంగా సిట్ హరీష్ రావుకు నోటీసులు పంపినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు నోటీసులు ఇవ్వడం స్టేట్ పాలిటిక్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. మరీ సిట్ విచారణకు మంగళవారం (జనవరి 20) హరీష్ రావు హాజరవుతారో లేదో చూడాలి. స్టేట్ పాలిటిక్స్‌ను షేక్ చేసిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సమగ్ర దర్యాప్తు జరిపేందుకు హైదరాబాద్ పోలీస్‌కమిషనర్ సజ్జనార్ నేతృత్వంలో ఇటీవల స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్(సిట్)ను ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సజ్జనార్ పర్యవేక్షణలో 9 మంది సభ్యులను నియమించారు.సిద్దిపేట సీపీ ఎస్ఎమ్ విజయ్‌కుమార్(ఐపీఎస్), రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా(ఐపీఎస్), మాదాపూర్ డీసీపీ

- మిగతా 2లో...

కవిత కొత్త పార్టీ... రంగంలోకి ప్రశాంత్ కిశోర్!

- కొత్త పార్టీ ఏర్పాటు దిశగా కవిత అడుగులు
- వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్‌తో వరుస సమావేశాలు
- తెలంగాణ జాగృతిని రాజకీయ శక్తిగా మారుస్తానని ప్రకటన
- మైనార్టీలు, బీసీలు, యువతకు తన పార్టీలో చేరాలని ఆహ్వానం

హైదరాబాద్ పెన్ పవర్:బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చాక, తన రాజకీయ భవిష్యత్తుపై కల్వకుంట్ల కవిత పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు ప్రయత్నాలను ఆమె ముమ్మరం చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, కార్యాచరణ దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) ఆమెకు సహాయం అందిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ పరిణామం తెలంగాణ రాజకీయాల్లో తీవ్రమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది.గత రెండు నెలల వ్యవధిలో ప్రశాంత్ కిశోర్ రెండుసార్లు హైదరాబాద్ వచ్చి కవితతో రహస్యంగా సమావేశమయ్యారని సమాచారం. ఇటీవల సంక్రాంతి

- మిగతా 2లో...

బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవ ఎన్నిక

- ఉదయం పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నబీన్
- జేపీ నడ్డా పదవీ కాలం ముగియడంతో అనివార్యమైన ఎన్నిక
- గత ఏడాది డిసెంబర్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం

హైదరాబాద్ పెన్ పవర్:భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.దఉదయం 11 గంటలకు ఆయన పార్టీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. నితిన్ నబీన్ ప్రస్తుతం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఈ ఎన్నిక జరిగింది.నితిన్ నబీన్ (46) బీహార్ రాష్ట్రానికి చెందినవారు. ఆయనను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గత ఏడాది డిసెంబర్‌లో బీజేపీ ప్రకటించింది. ఆయనను

- మిగతా 2లో...

హరీశ్ రావును రేవంత్ రెడ్డి ఎదుర్కోలేక కక్ష సాధింపు

- రాజకీయ వేధింపులే కాంగ్రెస్ పార్టీ ఏకైక అజెండాగా మారిపోయిందని విమర్శ
- ఫోన్ ట్యాపింగ్ కేసును సుప్రీం కోర్టు కొట్టి వేసిందని గుర్తు చేసిన కేటీఆర్
- హరీశ్ రావు నిలదీస్తున్నందుకే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం

హైదరాబాద్ పెన్ పవర్:ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు సిట్ నోటీసులు జారీ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. హరీశ్ రావును ఎదుర్కోలేక ఆయనపై తప్పుడు కేసులు పెట్టి నోటీసులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు.రాజకీయ వేధింపులే కాంగ్రెస్ పార్టీ ఏకైక అజెండాగా మారిపోయిందని ఆయన విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎలాంటి పస లేదని, అది కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందని, ఆ కేసును కొట్టివేసిందని ఆయన గుర్తు చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతోనే ఫోన్ ట్యాపింగ్ కేసు డ్రామా ముగిసిపోయిందని, అయినప్పటికీ మళ్లీ హరీశ్ రావుకు నోటీసులు ఇవ్వడం చూస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏ స్థాయికి దిగజారిందో అర్థమవుతోందని ఆయన మండిపడ్డారు.

- మిగతా 2లో...

తొలిరోజే వందేభారత్ ట్రైన్‌లో చెత్త..

- ప్రతీ కోచ్ లో డస్ట్ బిన్ ఏర్పాటు.. అయినా సీటు దగ్గరే చెత్త పడేసిన ప్రయాణికులు
- వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ ఈ తప్పెవరిదంటూ ప్రశ్నించిన ఓ ప్రయాణికుడు
- సివిక్ సెన్స్ లేదంటూ తీవ్రంగా మండిపడుతున్న నెటిజన్లు

హైదరాబాద్ పెన్ పవర్: ప్రభుత్వం కోట్లు ఖర్చు చేసి ప్రపంచ స్థాయి సదుపాయాలు కల్పిస్తుంటే వాటిని సరిగ్గా వాడుకోలేకపో తున్నాం.. కనీస బాధ్యత లేకుండా ప్రవర్తిస్తున్నాం.. అంటూ రైల్వే ప్రయాణికుడు ఒకరు సోషల్ మీడియాలో వాపోయాడు.

వివరాలు 2లో..

ఎడిటర్ వ్యూ

అతిపెద్ద గిరిజన జాతర మేడారం

అలరణ్య సంస్కృతి, గిరిజన సంప్రదాయాలు, ధైర్యం, త్యాగాల గాథలు కలసి రూపుదిద్దుకున్న మహోత్సవమే మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర. ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన ఈ ఉత్సవం, ప్రతి రెండేళ్లకోసారి లక్షలాది భక్తులను అటవీ గర్భంలోకి ఆహ్వానిస్తుంది. విగ్రహాలకన్నా ప్రకృతినే దేవతగా కొలిచే అరుదైన సంప్రదాయానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఈ జాతర, తెలంగాణ గిరిజనుల ఆత్మగౌరవం, చారిత్రక పోరాటాల ప్రతీకగా నేటికీ విశ్వవ్యాప్త గుర్తింపును పొందుతోంది. మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరను 'దక్షిణ భారత కుంభమేళా'గా పిలుస్తారు. ప్రతి రెండేళ్లకోసారి నిర్వహించే ఈ జాతరకు దేశం నలుమూలల నుంచీ దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ అనంతరం 2014లో మేడారం జాతరను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా గుర్తించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం 251 కోట్ల రూపాయల బడ్జెట్‌ను మంజూరు చేసింది. ఈ నెల 28 నుండి 31 వరకు నాలుగు రోజులపాటు సమ్మక్క–సారలమ్మ జాతర నిర్వహించనున్నారు. సమ్మక్క–సారలమ్మలను వనదేవతలుగా పూజించడానికి గల కారణాలను పరిశీలిస్తే ఆసక్తికరమైన చరిత్ర కనిపిస్తుంది. పూర్వం కోయ దొరలు వేట కోసం అడవికి వెళ్లిన సందర్భంలో, పెద్దపులుల కాపలా మధ్య ఓ పసిపాప కనిపించిందట. ఆ శిశువును కోయలు తమ గుడారానికి తీసుకెళ్లి పెంచుకున్నారు. ఆ పాప వారి జీవితంలోకి వచ్చినప్పటి నుంచి కోయలకు శుభాలు కలగడంతో, ఆ పాప కొండదేవత అవతారమేనని వారు నమ్మారు. మాఘ శుద్ధ పౌర్ణమి రోజున ఆ పాపకు సమ్మక్క అని నామకరణం చేశారు. కాకతీయుల కాలంలో ప్రస్తుతం జగిత్యాల జిల్లా ప్రాంతంలోని పొలవాసను గిరిజన దొర మేడరాజు పాలించేవాడు. మేడరాజు సమ్మక్కను పెంచి పెద్దదిగా చేసి, తన మేనల్లుడు మేడారం పాలకుడైన పగిడిద్దరాజుతో వివాహం చేశాడు. సమ్మక్క–పగిడిద్దరాజు దంపతులకు సారలమ్మ, నాగులమ్మ, జంపన్న అనే ముగ్గురు సంతానం కలిగారు. పగిడిద్దరాజు కాకతీయుల సామంతుడిగా ఉండేవాడు. కరవు కాటకాల కారణంగా ప్రజలు కొన్నేళ్లపాటు శిస్తు కట్టలేకపోయారు. శిస్తు చెల్లించకపోవడం, మేడరాజుకు ఆశ్రయం కల్పించడం, కోయ గిరిజనుల్లో తిరుగుబాటు భావాలు నూరిపోస్తున్నాడనే ఆరోపణలతో కాకతీయ సామ్రాజ్యాధినేత ప్రతాపరుద్రుడు పగిడిద్దరాజుపై యుద్ధానికి దిగాడు.. అయితే కాకతీయ సేనల దాడిని తట్టుకోలేక పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజు యుద్ధంలో వీరమరణం పొందారు. ఈ వార్త విన్న జంపన్న అవమానాన్ని తట్టుకోలేక సంపెంగవాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటినుంచి ఆ వాగును జంపన్నవాగుగా పిలుస్తున్నారని చరిత్రకారులు చెబుతారు. తన కుటుంబ సభ్యుల మరణ వార్త విన్న సమ్మక్క యుద్ధరంగానికి వచ్చి కాకతీయ సేనలపై విరుచుకుపడింది. ఆమె వీరత్వాన్ని చూసి ప్రతాపరుద్రుడు ఆశ్చర్యానికి గురయ్యాడు. అయితే ఒక కాకతీయ సైనికుడు దొంగచాటుగా బల్లెంతో వెన్నుపోటు పొడవడంతో తీవ్రంగా గాయపడిన సమ్మక్క మేడారం గ్రామానికి ఈశాన్యంలో ఉన్న చిలకలగుట్టకు వెళ్లి అదృశ్యమైందని చెబుతారు. ఆ తర్వాత ఒక చెట్టుకింద పుట్ట దగ్గర కుంకుమ భరిణి కనిపించిందట. తప్పు గ్రహించిన ప్రతాపరుద్రుడు అనంతరం సమ్మక్క భక్తుడిగా మారి, కోయ రాజులు చెల్లించాల్సిన కప్పాన్ని రద్దు చేసి, రెండేళ్లకోసారి జాతర నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశాడు. అలా ఈ జాతర ప్రారంభమైందని కథనం. జాతర మొదటి రోజు కన్నెపల్లి నుంచి సారలమ్మ గద్దెపైకి వస్తారు. అదే విధంగా కొండాయి నుండి గోవిందరాజును, పూనుగొండ్ల నుండి పగిడిద్దరాజును మేడారానికి తీసుకువచ్చి గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. రెండవ రోజు చిలకలగుట్ట నుండి సమ్మక్క కుంకుమ భరిణి రూపంలో గద్దెపైకి చేరుకుంటుంది. గిరిజన పూజారులు సంప్రదాయబద్ధంగా తల్లిని ఆహ్వానిస్తారు. మూడవ రోజు భక్తులు అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటారు. చివరి రోజు అమ్మవార్లు తిరిగి అడవిలోకి వెళ్లే 'వనప్రవేశం' కార్యక్రమం జరుగుతుంది. దీంతో జాతర ముగుస్తుంది. అయితే జాతరకు ముందే రోజుకు లక్షలాది మంది భక్తులు మేడారానికి చేరుకుంటుండటం విశేషం. ప్రపంచంలోనే ఆదివాసీలు, సంపద సృష్టికర్తలు, ఉత్పాదక శ్రామిక వర్గాలు అత్యధికంగా దర్శించుకునే మహా జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం అభివృద్ధి గత ప్రభుత్వాల కాలంలో అరకొరగానే కొనసాగింది. భారీ స్థాయిలో శాశ్వత అభివృద్ధి పనులను చేపట్టలేదు. ఇప్పుడు చరిత్ర తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నది. భవిష్యత్‌లో ఏ ఇతర మతాలు ఈ జన జాతరను హైజాక్ చేయకుండా, వారి చిహ్నాలు ఇక్కడ కనపడకుండా, ఆదివాసీ చరిత్రకు శాశ్వతత్వాన్ని సంతరింపచేసింది. 2026 జనవరి 28–31 తేదీల మధ్య మహా జాతర నిర్వహణకు మేడారంను సర్వ సన్నద్ధం చేసింది తెలంగాణ ప్రభుత్వం. మేడారం పరిసరాలన్నీ వృక్ష ఔషధ వైవిధ్య వనంగా మారుతున్నాయి. సమ్మక్క–సారలమ్మల జీవితం ధైర్యం, త్యాగం, అన్యాయంపై పోరాటానికి ప్రతీకగా నిలుస్తుంది. కఠిన పరిస్థితుల్లోనూ ప్రజల హక్కుల కోసం నిలబడటం, ప్రకృతిని ఆరాధించడం, సమాజ శ్రేయస్సే లక్ష్యంగా పోరాడటం వారి జీవితాల ద్వారా తెలుస్తుంది. విగ్రహాలకన్నా ప్రకృతిలో భాగమైన పసుపు, కుంకుమ భరిణెల రూపంలో పూజలందుకోవడం మన మూలాలను గుర్తుచేస్తుంది. మేడారం జాతర భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక దృష్టితో ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందాలని ఆశిద్దాం.

ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు నోటీసులు

- మొదటి పేజి తరువాయి

రితిరాజ్(ఐపీఎస్), మహేశ్వరం డీసీపీ కె.నారాయణరెడ్డి(ఐపీఎస్), గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ ఎం. రవీందర్ రెడ్డి, రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ కేఎస్ రావు, ఫోన్ ట్యాపింగ్ కేస్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, టీజీ న్యాబ్ డీఎస్పీ జీహెచ్ శ్రీధర్, హెచ్ఎంఆర్ఎల్ డీఎస్పీ నాగేందర్ రావును సభ్యులుగా నియమించారు. ఉన్నతస్థాయిలో ప్రొఫెషనల్ ఇన్వెస్టిగేషన్ చేసి పటిష్టమైన చార్జిషీట్ దాఖలు చేయాలని ఆదేశించారు.

ఇప్పటికే సేకరించిన ఆధారాలతో..!

ఫోన్‌ట్యాపింగ్‌పై పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన తర్వాత సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఐదుగురు సభ్యులతో స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌గా జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి కేసును దర్యాప్తు చేశారు. ఇటీవల డీజీపీ అధికారికంగా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)ను ఏర్పాటు చేశారు. కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ, ఇతర నిందితుల వాంగ్మూలాలు, సేకరించిన సాంకేతిక ఆధారాలతో సజ్జనార్ సిట్ మరింత లోతుగా దర్యాప్తు చేస్తోంది. ఫోన్ ట్యాపింగ్ వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరనేది ఇప్పటికే స్పెషల్ టీమ్ ప్రాథమిక సమాచారం సేకరించింది. సిటీ టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్ రావు కన్‌ఫెషన్ స్టేట్‌మెంట్‌లో పలువురు కీలక నేతల పేర్లు పరోక్షంగా వెల్లడయ్యాయి.

ఆ నలుగురు.. 10 నెలల రిమాండ్

ఫోన్ ట్యాపింగ్‌లో కీలకంగా వ్యవహరించిన మాజీ పోలీస్ అధికారులు ప్రణీత్‌రావు, రాధాకిషన్ రావు, భుజంగరావు, తిరుపతన్నను ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. 10 నెలలకు పైగా బెయిల్ రాకుండా కీలక ఆధారాలను కోర్టుకు అందించారు. దీంతో ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు అమెరికాలో తలదాచుకున్నాడు. ఆయనను భారత్‌కు రప్పించేందుకు రెడ్ కార్నర్ నోటీసుల ప్రక్రియ సహా అమెరికా నుంచి డిపోర్ట్ చేయించేందుకు పోలీసులు విశ్వప్రయత్నాలు చేశారు. అరెస్ట్ నుంచి తప్పించుకున్న ప్రభాకర్ రావును చివరకు వారం రోజుల పాటు కస్టోడియల్ ఎంక్వైరీ చేశారు. దీంతో పాటు గత ప్రభుత్వ హయాంలో ట్యాపింగ్ ద్వారా నష్టపోయిన బాధితులు, అధికారులు కాల్ డేటా సహా వాట్సాప్, సోషల్‌మీడియా డేటాను పోలీసులు ఇప్పటికే సేకరించారు. వీటి ఆధారంగా సిట్ దర్యాప్తును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా ఇటీవల పలువురికి నోటీసులు ఇచ్చి విచారించింది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, చిరుమర్తి లింగయ్య, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ యాదవ్, అతడి తండ్రిని సిట్ విచారించింది. ఈ క్రమంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అగ్రనేత హరీష్ రావుకు సిట్ నోటీసులు ఇవ్వడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది.

ఇరవై ఏళ్లుగా చెబుతున్నాం.. ఇప్పుడు టైమొచ్చింది

గ్రీన్ లాండ్ విషయంలో గడిచిన ఇరవై సంవత్సరాలుగా డెన్మార్క్ ను నాటో హెచ్చరిస్తూనే ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. రష్యా నుంచి ముప్పు పొంచి ఉందని చెబుతున్నా డెన్మార్క్ పట్టించుకోలేదని ఆరోపించారు. ఇరవై ఏళ్లుగా తాము వేచి చూస్తూనే ఉన్నామని చెబుతూ.. ఇప్పుడు తగిన చర్యలు చేపట్టాల్సిన సమయం వచ్చిందని అన్నారు.

గ్రీన్ లాండ్ స్వాధీనం విషయంలో తన వైఖరిని సమర్థించుకుంటూ ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఓ పోస్ట్ పెట్టారు. గ్రీన్ లాండ్ ను తమ నియంత్రణలోకి తెచ్చుకోవడం ఖాయమని ఆయన తేల్చిచెప్పారు. రష్యాను ఎదుర్కోవడంలో డెన్మార్క్ విఫలం కావడంతో భద్రతా కారణాల దృష్ట్యా తాము ఇప్పుడు చర్యలు తీసుకోవాల్సి వచ్చిందన్నారు. సమయం వచ్చింది కాబట్టే ఈ విషయంలో తాము కల్పించుకున్నామన్నారు. ఎలాగైనా గ్రీన్‌లాండ్ ను స్వాధీనం చేసుకుంటామంటూ ఆదివారం ట్రూత్ సోషల్ లో పోస్ట్ పెట్టారు. కాగా, ఈ విషయంలో తమ వైఖరిని వ్యతిరేకించే దేశాలపై టారిఫ్ లు విధిస్తామని హెచ్చరించిన ట్రంప్.. అన్నట్లుగానే ఈయూ కూటమిలోని 8 దేశాలపై 10 శాతం టారిఫ్ లు విధించారు. ఫిబ్రవరి 1 నుంచి ఈ టారిఫ్ లు అమలులోకి వస్తాయని ట్రంప్ స్పష్టం చేశారు.

తొలిరోజే వందేభారత్ ట్రైన్‌లో చెత్త..

- మొదటి పేజి తరువాయి

వందే భారత్ స్లీపర్ ట్రైన్ లో తొలిరోజు ప్రయాణించిన విశేషాలు చెబుతూ.. ఓ కంపార్ట్ మెంట్లో తోటి ప్రయాణికులు పడేసిన చెత్తను వీడియోలో చూపిస్తూ ఇది ఎవరి తప్పని ప్రశ్నించాడు. కోట్లాది రూపాయల ఖర్చుతో ప్రీమియం స్లీపర్ క్లాస్ ట్రైన్ ను అందుబాటులోకి తీసుకొచ్చిన రైల్వే శాఖదా.. ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించాలని ప్రయత్నించిన ప్రభుత్వానిదా.. అందుబాటులోకి వచ్చిన సదుపాయాన్ని సరిగ్గా వినియోగించుకోలేని మనదా.. ఎవరిది తప్పు? అంటూ నిలదీశాడు.

అసలు ఏం జరిగిందంటే..

హౌరా– గువాహటి మధ్య వందేభారత్ తొలి స్లీపర్ ట్రైన్ ను ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 17న ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలిరోజు అందులో ప్రయాణించిన కొందరు ఐస్ క్రీం తినేసి కప్పులను, వాటర్ బాటిల్, టిష్యూ పేపర్లను సీటు వద్దే పడేశారు. దీంతో కంపార్ట్ మెంట్ చెత్తకుప్పలా మారింది. కొత్త రైలులో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినా వినియోగించుకోవాలనే తెలివి లేకుండా, కనీస బాధ్యత లేకుండా ప్రవర్తించారు.

ప్రతీ కోచ్ లో డస్ట్ బిన్ ఏర్పాటు చేసినా కూడా సీట్లో నుంచి లేచి డస్ట్ బిన్ వద్దకు నడవడానికి బద్దకించారు. సదరు కోచ్ లో ప్రయాణికుల నిర్వాకాన్ని తోటి ప్రయాణికుడు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. వైరల్ గా మారిన ఈ వీడియో చూసిన మనకు సివిక్ సెన్స్ అస్సలు లేదంటూ కామెంట్లు పెడుతున్నారు. పబ్లిక్ ప్రాపర్టీని శుభ్రంగా ఉంచుకోవాలనే కనీస స్పృహ లేదని మరికొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆఫీస్‌లో రాసలీలలు..

డీజీపీ ర్యాంకు అధికారి బాగోతం

కర్ణాటకలో డీజీపీ స్థాయి అధికారి కె.రామచంద్రరావు తీవ్ర వివాదంలో చిక్కుకున్నారు. ఓ మహిళతో రాసలీలల వీడియోలు పెను దుమారం రేపుతున్నాయి. తన కార్యాలయంలోనే ఓ మహిళతో అభ్యంతరకర రీతిలో ప్రవర్తించినట్లు ఆయన ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోమవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే, ఈ ఆరోపణలను రామచంద్రరావు ఖండించారు. అవన్నీ మార్ఫింగ్ చేసిన వీడియోలని స్పష్టం చేశారు. గతంలో గోల్డ్ స్మగ్లింగ్ కేసులోనూ రామచంద్రరావుపై ఆరోపణలు వచ్చాయి. ఈ కేసులో అరెస్టయిన నటి రన్యా రావుకు ఈయన సవతి తండ్రి. ఈ కేసు నేపథ్యంలో 2025 మార్చిలో ప్రభుత్వం ఆయన్ను నిర్బంధ సెలవుపై పంపించి, ఇటీవలే తిరిగి విధుల్లోకి తీసుకుంది. ప్రస్తుతం ఆయన సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఉజ=జు) డీజీపీగా పనిచేస్తున్నారు. కాగా, ఈ వీడియోల వ్యవహారంపై న్యాయవాదిని సంప్రదించి తదుపరి చర్యలు తీసుకుంటానని రామచంద్రరావు మీడియాకు తెలిపారు.

సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఈ వీడియోల్లో డీసీఆర్ఈ డీజీపీ రామచంద్రరావు యూనిఫాంలో ఉండగానే తన అధికారిక ఛాంబర్‌లో ఓ మహిళతో సన్నిహితంగా, అశ్లీల ప్రవర్తనతో కూడిన దృశ్యాలు ఉన్నాయి. ఒక క్లిప్‌లో ఆయన మహిళను ముద్దుపెట్టుకుంటుండగా, మరో వీడియోలో సూట్‌లో ఉండగా భారత జాతీయ పతాకం, పోలీసు శాఖ చిహ్నం ముందు ఇలాంటి ప్రవర్తనే కనబరిచారు. ఈ వీడియోల్లో మహిళ ముఖాన్ని బ్లర్ చేసి, నేపథ్య సంగీతం జోడించి సర్క్యులేట్ చేశారు. ఈ వివాదంపై వివరణ ఇచ్చేందుకు రామచంద్రరావు సోమవారం హోంమంత్రి జి. పరమేశ్వర కార్యాలయానికి వెళ్లారు. అయితే, ఆయనతో భేటీకి మంత్రి నిరాకరించినట్లు సమాచారం. ఈ పరిణామంపై ముఖ్యమంత్రి సిద్దరామయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారని, ఘటనపై పూర్తి నివేదిక సమర్పించాలని హోం శాఖను ఆదేశించారని తెలిసింది. ఈ వీడియోలను ఏడాది క్రితమే చిత్రీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, వీటిని ఇప్పుడు ఎందుకు విడుదల చేశారనే దానిపై స్పష్టత లేదు. ఈ ఘటనపై మాజీ హోంమంత్రి అరగ జ్ఞానేంద్ర స్పందిస్తూ.. సీనియర్ అధికారి ఈ స్థాయికి దిగజారడం సిగ్గుచేటని, ఆయన పోలీసు శాఖను అవమానించారని, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హరీశ్ రావును రేవంత్ రెడ్డి ఎదుర్కోలేక కక్ష సాధింపు

- మొదటి పేజి తరువాయి

రేవంత్ రెడ్డి బావమరిది సుజన్ రెడ్డికి బొగ్గు గనుల కేటాయింపు కుంభకోణాన్ని బయటపెట్టినందుకే, దాని నుంచి ప్రజల దృష్టిని మళ్లించే 'డైవర్షన్ పాలిటిక్స్'కు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. హరీశ్ రావు తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు ప్రజల కష్టాల్లో తోడున్న నాయకుడని ఆయన కొనియాడారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో కానీ, క్షేత్రస్థాయిలో ప్రజల పక్షాన నిలబడటంలో కానీ ఆయన చూపిస్తున్న చొరవను చూసి రేవంత్ రెడ్డికి వణుకు పుడుతోందని ఆయన అన్నారు. అందుకే రాజకీయంగా ఎదుర్కోలేక, ఇలాంటి తప్పుడు కేసులతో ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని అన్నారు. గత 24 నెలలుగా రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఈ దారుణమైన పాలనను నిలదీస్తున్నందుకే హరీశ్ రావును లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. తమకు

చట్టంపై, న్యాయస్థానాలపై పూర్తి గౌరవం ఉందని, అందుకే ఏ విచారణకైనా సిద్ధంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు. కానీ విచారణల పేరుతో,

నోటీసులతో ప్రతిపక్ష గొంతు నొక్కాలని భావిస్తే అది భ్రమే అవుతుందని అన్నారు. ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా, ఎన్ని వేధింపులకు గురిచేసినా ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని తెలిపారు. ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని, అడుగడుగునా ప్రశ్నిస్తుంటామని అన్నారు. ఇలాంటి చౌకబారు బెదిరింపులకు తమ పార్టీ భయపడదని ఆయన స్పష్టం చేశారు.

బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా నితిన్ నబీన్ ఏకగ్రీవ ఎన్నిక

- మొదటి పేజి తరువాయి

పార్టీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు అప్పుడే వార్తలు వెలువడ్డాయి. నబీన్‌కు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపూర్ నుంచి నబిన్ నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు.

కవిత కొత్త పార్టీ... రంగంలోకి ప్రశాంత్ కిశోర్!

- మొదటి పేజి తరువాయి

పండుగ సందర్భంగా కూడా వీరి మధ్య భేటీ జరిగినట్లు తెలుస్తోంది. కొత్త పార్టీని ప్రకటిస్తే రాజకీయ పరిస్థితులు ఎలా ఉంటాయి, పార్టీని ప్రజల్లోకి ఎలా తీసుకెళ్లాలి, అనుసరించాల్సిన వ్యూహాలు వంటి కీలక అంశాలపై వీరిద్దరి మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ సమావేశాలపై కవిత గానీ, తెలంగాణ జాగృతి ప్రతినిధులు గానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం. మరోవైపు తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేందుకే కొత్త పార్టీ అవసరమని కవిత బలంగా వాదిస్తున్నారు. తన సారథ్యంలోని 'తెలంగాణ జాగృతి'ని రాజకీయ శక్తిగా మార్చి, 2029 ఎన్నికల్లో ప్రజల పక్షాన పోటీ చేస్తామని ఆమె ఇప్పటికే స్పష్టం చేశారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో పార్టీ విధివిధానాల రూపకల్పనకు దాదాపు 50 కమిటీలతో అధ్యయనం చేయిస్తున్నారు. అదే సమయంలో మైనార్టీలు, బీసీలు, యువత తనతో కలిసి రావాలని, తన 'తెలంగాణ సెక్యులర్ పార్టీ'కి మద్దతివ్వాలని పిలుపునిస్తున్నారు. గతంలో ఏపీలో వైఎస్ జగన్‌కు, 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్‌కు, వ్యూహకర్తగా పనిచేశారు. తమిళనాడులో నటుడు విజయ్ పార్టీకి కూడా సేవలు అందిస్తున్నారు. ఇప్పుడు కవితతో జతకట్టడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు కవిత క్షేత్రస్థాయి సన్నాహాలు, మరోవైపు పీకే వ్యూహాత్మక మార్గదర్శకత్వంతో త్వరలోనే కొత్త పార్టీ ప్రకటన ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ కొత్త రాజకీయ ప్రయోగం తెలంగాణలో ఎలాంటి ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

ఆ ఘటనలు చాలా వరకు మత ప్రమేయం లేనివే

- మొదటి పేజి తరువాయి

యూనస్ కార్యాలయం వెల్లడించింది. వాటిలో 71 ఘటనల్లో మతపరమైన కోణాలు ఉన్నట్లు పేర్కొంది. ఆలయాలపై దాడులకు సంబంధించి 38 ఘటనలు నమోదైనట్లు చెప్పింది. 71లో 50 ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేశారని, అంతే సంఖ్యలో నిందితులను అరెస్టు చేశారని వెల్లడించింది. మరో 21 ఘటనల్లో తగు చర్యలు తీసుకున్నారని తెలిపింది. అన్ని నేరాలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు బంగ్లాదేశ్ పేర్కొంది.

బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యాపారి హత్య

బంగ్లాదేశ్ గణాంకాలను బంగ్లాదేశ్ హిందూ బుద్దిస్ట్ క్రిస్టియన్ యూనిటీ కౌన్సిల్ (బీహెచ్‌బీసీయూసీ) ఖండించింది. ఇలాంటి ప్రకటనలు నేరస్థులను ప్రోత్సహించి, వారికి శిక్ష పడదనే భావనను కలిగిస్తాయని హెచ్చరించింది. బంగ్లాదేశ్‌లో మైనారిటీలే లక్ష్యంగా దాడులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ ఏడాదిలో మూడు వారాల వ్యవధిలోనే 10 మందికిపైగా హిందువులు హత్యకు గురయ్యారు. దీంతో అక్కడ హిందువుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.

దావోస్ కు సీఎం రేవంత్

- మొదటి పేజి తరువాయి

మీటింగ్ శు బయల్దేరారు. ఈ పర్యటనలో పలువురు గోబల్ సీఈఓలు, పారిశ్రామికవేత్తలతో కీలక సమావేశాల్లో, పాల్గొననున్నారు. ఐదు రోజుల పాటు సాగే ఈ టూర్ షెడ్యూల్లో తెలంగాణాలో పెట్టుబడులకు ఉన్న అవకా శాలను రేవంత్ రెడ్డి వివరించనున్నారు. ముఖ్యంగా. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో కొత్త పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంట బటీ. పరిశ్రమల శాఖ మంత్రి ముద్దిళ్ల శ్రీధర్ బాబు, ఇతర ఉన్న తాధికారులు కూడా వెళ్లారు.

ఘట్‌ఎకేసర్‌ఎలో ప్రభుత్వ భూమిలో లేఔట్.. వందల కోట్ల ఆస్తిని కాపాడిన హైడ్రా

హైదరాబాద్ పెన్ పవర్: ఆక్రమణలపై హైడ్రా మరోసారి పంజా విసిరింది. ప్రభుత్వ భూమిని ఆక్రమించి వేసిన లేఔట్లను తొలగించి వందల కోట్ల విలువైన స్థలాన్ని కాపాడింది. సోమవారం (జనవరి 19) మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఘట్ కేసర్ మండలంలో ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేసింది. ఏడాది క్రితం అడ్డు గోడలు తొలగించిన అదే ప్రాంతంలో లేఔట్లు వేయటంతో యాక్షన్ లోకి దిగిన హైడ్రా.. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుంది. ఘట్ కేసర్ మండలం కాచవాణి సింగారం గ్రామంలోని దివ్యానగర్ లే ఔట్‌లో 6.12 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడారు హైడ్రా అధికారులు. నల్లమల్లారెడ్డి భూ అక్రమాలపై -4 లో

పెన్ పవర్ తెలంగాణ రౌండప్

- రూ.45 లక్షలతో 900 మంది మైనారిటీ నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ..
- మూడు చింతలపల్లిలో ఎమ్మార్వో కార్యాలయం నూతన భవనం ప్రారంభం..
- మహిళలు రాజకీయంగా ముందుకు రావాలని ప్రభుత్వ చీఫ్ విప్ పిలుపు..

మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి శుక్రవారం స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఒకవైపు వేలాది మంది మహిళలకు నేరుగా లబ్ధి చేకూర్చే సంక్షేమ పథకాలు,మరోవైపు కోట్ల రూపాయల వ్యయంతో మౌలిక వసతుల కల్పనకు అభివృద్ధి.. రెండింటినీ సమాంతరంగా ముందుకు తీసుకెళ్లారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 19:

మేడ్చల్ జిల్లాలో అభివృద్ధి సంక్షేమాల జోరు..!

అలియాబాద్‌లో నిర్వహించిన ఇందిరమ్మ శ్రీశక్తి, ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ శ్రీశక్తి సంఘాలకు చెందిన 18,506 మంది మహిళలకు చీరలను ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పంపిణీ చేశారు. అలియాబాద్‌లో 5,258 మంది, ఎంసీ పల్లిలో 6,592 మంది, ఎల్లంపల్లిలో 6,656 మంది మహిళలు ఈ సంక్షేమ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందారు.. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, గతంలో అలియాబాద్ మున్సిపల్ పరిధిలో మహిళలకు రూ.2 కోట్ల 33 లక్షల వడ్డీ లేని రుణాలు అందించినట్లు గుర్తు చేశారు. మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందిస్తున్నామని స్పష్టం చేశారు. రానున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు తమకు కల్పించిన రిజర్వేషన్ అవకాశాలను వినియోగించుకొని రాజకీయంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళా శక్తి రాజకీయ నిర్ణయాల్లో కీలకంగా మారాల్సిన అవసరం ఉందన్నారు..

రూ.40 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..
18,506 మంది మహిళలకు చీరల పంపిణీ..

సంక్షేమ పథకాలకు మైనారిటీలకు ప్రాధాన్యత..

మేడ్చల్ జిల్లాలో మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఆయన వెల్లడించారు. ఈ క్రమంలో రూ.45 లక్షల నిధులతో 900 మంది మైనారిటీ నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. పేదలు, మైనార్టీలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు.అనంతరం మేడ్చల్ నియోజకవర్గంలో మొత్తం రూ.40 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఎల్లంపేట మున్సిపాలిటీలో రూ.9 కోట్ల 43 లక్షలు, అలియాబాద్‌లో రూ.15 కోట్లు, మూడు చింతలపల్లిలో రూ.15 కోట్ల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు అధికారికంగా ప్రారంభించారు.. అలాగే మూడు చింతలపల్లిలో స్వచ్ఛంద సంస్థ నిర్మించిన ఎమ్మార్వో కార్యాలయ నూతన భవనాన్ని, మేడ్చల్ మండల తాసిల్దార్ కార్యాలయం మరియు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యాలయాలు ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందించనున్నాయని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, కీసర ఆర్డీవో రాజేష్, డిప్యూటీ కలెక్టర్ మోక్షిత, ఎమ్మార్వోలు, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు



తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు

- తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సుప్రీంకోర్టు నోటీసు జారీ
- స్పీకర్‌పై కోర్టు ధిక్కరణ వ్యాజ్యం దాఖలు చేసిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి
- పార్టీ ఫిరాయింపులపై తీర్పును అమలు చేయలేదని ఆరోపణ

-4 లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

నీతులు చెప్పే డీజీపీ ఖాకీ బుక్ ఎక్కడకు వెళ్లింది?

- ఖాకీ బుక్‌ను కాకి ఎత్తుకుపోయిందా? అన్న హరీశ్ రావు
- కాంగ్రెస్ నేతలపై వస్తున్న ఆరోపణలపై మౌనం వహిస్తున్నారని విమర్శ
- జర్నలిస్టులు, బీఆర్ఎస్ నేతలపై మాత్రం సిట్ లు వేస్తున్నారని మండిపాటు

హైదరాబాద్ పెన్ పవర్: కాంగ్రెస్ నేతలపై వస్తున్న ఆరోపణలపై పోలీసులు మౌనం పాటించడాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు తీవ్రంగా తప్పుబట్టారు. చట్టం అందరికీ సమానమని చెబుతూ నీతులు చెప్పే డీజీపీ శివధర్‌రెడ్డి ఖాకీ బుక్ ఇప్పుడు ఎక్కడికెళ్లిందని ఎద్దేవా చేశారు. "ఖాకీ బుక్‌ను కాకి ఎత్తుకుపోయిందా?" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.అలంపూర్‌లో సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితుడైన ఏఐసీసీ నేత, ఎమ్మెల్యే సంపత్‌కుమార్ కాంట్రాక్టర్లను రూ. 8 కోట్లు ఇవ్వాలని బెదిరించాడని ఆరోపించారు. ఈ వ్యవహారంలో స్వయంగా బాధిత కాంట్రాక్టరే ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎందుకు అరెస్ట్ చేయలేదని ప్రశ్నించారు. ఈ కేసులో సిట్ ఎందుకు వేయలేదని నిలదీశారు. జర్నలిస్టులు, బీఆర్ఎస్ నేతలపై మాత్రం సిట్‌లు, కమిషన్లు వేస్తారని, కాంగ్రెస్ నేతల విషయంలో ఎందుకు నిబంధనలు మారతాయని హరీశ్‌రావు మండిపడ్డారు.జర్నలిస్టుల కేసులో సిట్ ఏర్పాటు సీఎం రేవంత్ రెడ్డికి తెలియదని చెబుతున్నారని, అదే నిజమైతే ఆయన ముఖ్యమంత్రిగా పూర్తిగా విఫలమైనట్టే అని వ్యాఖ్యానించారు. రాష్ట్ర పరిపాలన బాధ్యత వహించే సీఎం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. చట్టాన్ని రాజకీయాల కోసం వాడితే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హరీశ్‌రావు హెచ్చరించారు.

హైదరాబాద్‌లో 137 ప్లాట్లను వేలం వేయనున్న
'రాజీవ్ స్వగృహ'

- తొర్రూర్, కుర్మల్‌గూడ, బహదూర్‌పల్లిలో 137 ప్లాట్ల వేలం
- ఫిబ్రవరి 7, 8 తేదీల్లో వేలం వేయనున్నట్లు కార్పొరేషన్ ఎండీ వెల్లడి
- బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధర నిర్ణయం

హైదరాబాద్ పెన్ పవర్: గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 137 ఓపెన్ ప్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ నిర్ణయించింది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లాలోని తొర్రూర్ (105 ప్లాట్లు), కుర్మల్‌గూడ (20 ప్లాట్లు), మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని బహదూర్‌పల్లిలో (12 ప్లాట్లు) గల మొత్తం 137 ప్లాట్లను వేలం వేయనున్నట్లు రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు.ఫిబ్రవరి 7, 8 తేదీల్లో వేలం ప్రక్రియ ఉంటుందని ఆయన వెల్లడించారు. బహిరంగ మార్కెట్ ధరల కంటే తక్కువగా, చదరపు గజానికి రూ.20 వేల నుంచి రూ.30 వేల మధ్య ధరలను -4 లో

తెలుగుదేశం పార్టీ వారికి రేవంత్ రెడ్డి అలా చెప్పడం రౌడీ మాదిరిగా పిలుపునివ్వడమే!: దాసోజు శ్రవణ్

- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య వైషమ్యాలకు దారితీస్తున్నాయని ఆగ్రహం
- కేసీఆర్‌ను 100 మీటర్ల లోతున బొంద పెడతానంటే కేసు పెట్టవద్దా అని ప్రశ్న
- రాహుల్ గాంధీ పుణ్యమా అని రేవంత్ రెడ్డి తెలంగాణ పాలిట శాపంగా మారాడని ఆగ్రహం

హైదరాబాద్ పెన్ పవర్: బీఆర్ఎస్ దిమ్మెలను కూల్చివేయాలంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు పిలుపునివ్వడం రెండు పార్టీల మధ్య వైషమ్యాలకు దారితీస్తోందని బీఆర్ఎస్ సీనియర్ నేత దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాలో చేసిన వ్యాఖ్యలపై ఆయన అడిషనల్ డీజీపీ మహేశ్ భగవత్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారని అన్నారు. రేవంత్ రెడ్డిపై కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని పోలీసులను కోరినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య గొడవలకు, వైషమ్యాలకు దారి తీస్తాయని అన్నారు. ముక్కలు అవుతారని అన్నందుకే తలసాని శ్రీనివాస్ యాదవ్‌పై కేసు పెట్టారని, మరి కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను బొంద పెట్టాలన్న రేవంత్ రెడ్డిపై కేసు పెట్టకూడదా అని ప్రశ్నించారు. నిన్న ఖమ్మం జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేలా మాట్లాడారని మండిపడ్డారు. నిరంతర పోరాటంతో తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను, తెలంగాణ సాధన కోసమే పుట్టిన బీఆర్ఎస్ ను 100 మీటర్ల లోతున బొంద పెట్టాలని పిలుపునివ్వడం విడ్డూరమని అన్నారు. తెలంగాణకు ద్రోహం చేసిన, 1,200 మంది ఉద్యమకారులను బలితీసుకున్న తెలుగుదేశం పార్టీ ఇక్కడ బతికి బట్టకట్టాలని ఆయన కోరుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం పుట్టిన బీఆర్ఎస్, కేసీఆర్ ఉండకూడదా అని నిలదీశారు. రేవంత్ రెడ్డి మాట్లాడింది మనుషులు మాట్లాడే భాషనా, రాక్షసుల భాషనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాజంలో అశాంతి రెచ్చగొట్టేలా మాట్లాడిన రేవంత్ రెడ్డిపై సుమోటోగా కేసు పెట్టాలని కోరామని అన్నారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై తెలంగాణ సమాజం ఆలోచన చేయాలని అన్నారు. "బీఆర్ఎస్ పార్టీ దిమ్మెలను తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు కలిసి తొలగించాలని ఒక రౌడీ మాదిరిగా పిలుపునిచ్చారు. అలా పిలుపునివ్వడం ద్వారా బీఆర్ఎస్, టీడీపీల మధ్య, ఇరు పార్టీల కార్యకర్తల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా, హింసాయుత వాతావరణం ప్రేరేపించేలా కలుషితమైన తెలంగాణ సమాజాన్ని తయారు చేయడం కోసం ఆయన మాట్లాడిన మాటలు దారుణం. కంచె చేను మేసినట్లుగా ఆయన అలా మాట్లాడటం దుర్మార్గం, శోచనీయం. ఒక ముఖ్యమంత్రి ముఠా నాయకుడిలా మాట్లాడటం భారతదేశంలో ఎవరూ మాట్లాడి ఉండకపోవచ్చు. కానీ రాహుల్ గాంధీ పుణ్యమా అని తెలంగాణ పాలిట శాపంగా రేవంత్ రెడ్డి మారారు. తన నోటికి అడ్డూ అదుపు లేకుండా మాట్లాడుతున్నారు" అని తీవ్రంగా విమర్శించారు.

2,500 మందితో 'వందేమాతరం' ప్రదర్శన... కీరవాణిని అభినందించిన బండి సంజయ్

- వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా రిపబ్లిక్ డే పరేడ్ ప్రత్యేక ప్రదర్శన
- సంగీతం అందిస్తున్న ఎం.ఎం. కీరవాణి
- దేశవ్యాప్తంగా 2500 మంది కళాకారులతో భారీ కార్యక్రమం
- కీరవాణి కృషిని కొనియాడిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహణ

హైదరాబాద్ పెన్ పవర్: ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణికి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ అభినందనలు తెలిపారు. గణతంత్ర దినోత్సవ పరేడ్ కోసం కీరవాణి స్వరాలు సమకూర్చడం ఒక చరిత్రాత్మక ఘట్టమని ఆయన అభివర్ణించారు. వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 2,500 మంది కళాకారులతో ఈ ప్రదర్శన ఏర్పాటు చేస్తుండడం నిజంగా అద్భుతమని బండి సంజయ్ కొనియాడారు. సంగీతం, జాతీయ స్ఫూర్తి, ప్రతిష్ఠ అన్నీ కలగలిసిన ఈ కార్యక్రమం దేశానికి ఒక చారిత్రక నివాళి అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈనెల 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో భాగంగా, కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక ప్రదర్శన జరగనుంది. భారత స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిల్చిన 'వందేమాతరం' గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 2,500 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొననుండగా, దీనికి కీరవాణి సంగీతాన్ని సమకూర్చారు. ఈ అరుదైన అవకాశంపై కీరవాణి కూడా స్పందించారు. "వందేమాతరం! చరిత్రాత్మక గీతం 150వ వార్షికోత్సవం సందర్భంగా, జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు సంగీతం సమకూర్చే గౌరవం నాకు దక్కింది. ఇది నాకెంతో సంతోషాన్ని కలిగిస్తోంది. దేశ స్ఫూర్తిని చాటే ఈ కార్యక్రమాన్ని అందరూ వీక్షించాలి" అని ఆయన తన సోషల్ మీడియాలో తెలిపారు. ఈ అపురూప ఘట్టం కోసం దేశవ్యాప్తంగా సంగీత ప్రియులు, ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

మేడారం జాతరకు ఏఐ సొబగులు.. డ్రోన్లు, జియో ట్యాగ్‌లతో హైటెక్ నిఘా

హైదరాబాద్ పెన్ పవర్: దక్షిణ భారత కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతర ఈసారి ఆధునిక సాంకేతిక హంగులతో జరగనుంది. ఈ నెల 28 నుంచి 31 వరకు జరిగే ఈ చారిత్రక ఘట్టానికి తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ మునుపెన్నడూ లేనివిధంగా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాయి. జాతర ఏర్పాట్లపై సీఎం రేవంత్ రెడ్డి నిన్న ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా భద్రతా వ్యవస్థ పనితీరును పరిశీలించారు.

జాతర భద్రత కోసం 'మేడారం 2.0' పేరుతో అత్యాధునిక సాంకేతికతను ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా 'టీజీ-క్వెస్ట్' అనే ఏఐ డ్రోన్ వ్యవస్థను వినియోగిస్తున్నారు. ఇవి దాదాపు 30 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతం, జంపన్నవాగు, రద్దీ మార్గాలపై గగనతలం నుంచి నిరంతరం నిఘా ఉంచుతాయి. వీటితో పాటు ఆకాశంలో ఎగిరే హీలియం బెలూన్లకు పాన్-టిల్ట్-జూమ్ కెమెరాలను అమర్చారు. ఇవి అత్యంత ఎత్తు నుంచి జనసమూహాన్ని విశ్లేషించి, తొక్కిసలాట జరిగే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి కంట్రోల్ రూమ్‌ను అప్రమత్తం చేస్తాయి. ఈ హైటెక్ నిఘా నీడలో సుమారు 13 వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వర్తించనున్నారు.

పిల్లలు, వృద్ధులకు ప్రత్యేక జియో ట్యాగ్‌లు

గత జాతరలో వేలాది మంది తప్పిపోయిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ఈసారి వొడాఫోన్-ఐడియా సహకారంతో 'జియోట్యాగ్ బేస్డ్ మిస్సింగ్ పర్సన్స్ ట్రాకింగ్' విధానాన్ని అమలు చేస్తున్నారు. పస్రా, తాడ్వాయి మార్గాల్లోని కౌంటర్ల వద్ద వృద్ధులు, పిల్లల వివరాలు నమోదు చేసి, వారికి క్యూఆర్ కోడ్ ఉండే జియోట్యాగ్‌ను చేతికి కడతారు. ఒకవేళ వారు తప్పిపోతే, ఈ ట్యాగ్‌ను స్కాన్ చేయడం ద్వారా వారి వివరాలు సులభంగా తెలుసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించవచ్చు. శబరిమలలో విజయవంతమైన ఈ విధానాన్ని ఇప్పుడు మేడారంలోనూ అమలు చేస్తున్నారు.

నేరగాళ్లను గుర్తించేందుకు 'ఫేస్ రికగ్నిషన్' టెక్నాలజీ

జాతరలో నేరగాళ్లను గుర్తించేందుకు ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీని కూడా వాడుతున్నారు. ఆసుపత్రి, పార్కింగ్ స్థలాల వంటి కీలక ప్రదేశాల్లో పాత నేరస్థుల కదలికలను ఈ సాంకేతికత ద్వారా పసిగడతారు. అనుమానాస్పద వస్తువులను గుర్తించేందుకు రియల్-టైమ్ అలర్ట్ సిస్టమ్ సైతం పనిచేస్తుంది. భక్తుల సౌకర్యం కోసం 2,000 ఎకరాల్లో 37 పార్కింగ్ ప్రదేశాలు, 50కి పైగా అనౌన్స్‌మెంట్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

కిషన్ రెడ్డికి, రేవంత్ రెడ్డికి మధ్య చీకటి ఒప్పందం..

హైదరాబాద్, జనవరి 19, పెన్ పవర్: నైనీ కోల్ బ్లాక్ విషయంలో వాటాల పంచాయతీ తేలక రోడ్డు మీద పడ్డారంటూ తెలంగాణ మాజీ మంత్రి హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి బంధువు కనుసన్నల్లోనే పలు ప్రాజెక్టుల టెండర్లు ఖరారు చేస్తున్నారని ఆరోపించారు. నిజాయితీ, దమ్ముంటే సీబీఐ విచారణకు ఆదేశించాలని సీఎం రేవంత్ రెడ్డిని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఛాలెంజ్ చేశారు. అన్ని సాక్ష్యాలను సీబీఐకి అందించేందుకు తాను సిద్ధమని హరీష్ రావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన నైనీ కోల్ బ్లాక్ టెండర్ల వివాదంపై తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన హరీష్ రావు.. అటు కేంద్రానికి, ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య చీకటి ఒప్పందం లేకపోతే సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో కేంద్రానికి సైతం వాటా ఉంది. కిషన్ రెడ్డికి, రేవంత్ రెడ్డికి చీకటి ఒప్పందం లేకపోతే దీనిపై సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డి కేంద్ర బొగ్గుశాఖ మంత్రిగా ఉండి కూడా ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. తాను మాట్లాడిన ప్రతి విషయంపై ఆధారాలను సీబీఐకి ఇచ్చేందుకు తాను సిద్ధమన్నారు. రెండేళ్లుగా సింగరేణికి సీఎండీ లేకుండా పనులు చేపిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని హరీష్ ఆరోపించారు. కేవలం తమ వ్యక్తులను ఇంచార్జులుగా నియమించి అడ్డగోలుగా దోచుకుంటున్నారని, సైట్ విజిట్ సర్టిఫికేట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ సైట్ విజిట్ అనేది భారతదేశంలో ఎక్కడా లేదని, నైనీ బొగ్గు బ్లాక్ విషయంలో కొత్తగా ప్రవేశపెట్టారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2024లో సైట్ విజిట్ ప్రవేశపెట్టిన తరువాత బెనిఫిట్ జరిగిన తొలి వ్యక్తి ఆయన బామ్మర్ది సుజన్ రెడ్డి. ఆయన కంపెనీ శోదా కంపెనీకి సైట్ విజిట్ సర్టిఫికెట్ వచ్చిన తరువాత టెండర్ దక్కిందని ఆరోపించారు. సింగరేణిలో 6 టెండర్లు జరిగితే తమకు కావాల్సిన వారికే వాటిని కట్టబెట్టారని హరీష్ రావు అన్నారు. కోల్ బ్లాక్ టెండర్లు -10 నుంచి మైనస్ 22 శాతం వరకు కాంట్రాక్టర్లకు పోతుంది. బీఆర్ఎస్ హయాంలోనూ మైనస్ 7 నుంచి మైనస్ 20 వరకు కాంట్రాక్టర్లకు పోయింది. కానీ తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక సైట్ విజిట్ అని వచ్చాక ప్లస్ 7 నుంచి ప్లస్ 10 శాతం కాంట్రాక్టర్లకు పోతుందన్నారు. వివాదాస్పదమైన నైనీ కోల్ బ్లాక్ టెండర్లను మాత్రమే రద్దు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కానీ మిగతా అన్ని టెండర్లకు ఇదే విధానాన్ని అమలు చేశారు. వాటిని ఎందుకు రద్దు చేయడం లేదని హరీష్ రావు ప్రశ్నించారు. 'సైట్ విజిట్ సర్టిఫికెట్ అనేది కేవలం తెలంగాణలో ఉంది. అది రేవంత్ ప్రభుత్వం తెచ్చింది. గతంలో దేశ వ్యాప్తంగా ఎవరైనా టెండర్ వేసేవారు. ఇప్పుడు సైట్ విజిట్ సర్టిఫికెట్ వచ్చాక, కాంట్రాక్టర్లు సైట్ విజిట్ చేసి సర్టిఫికెట్ తీసుకోవాలి. అప్పుడు ఏ కాంట్రాక్టర్ టెండర్ వేశాడో తెలుసుకుని, వారి నుంచి కమీషన్లు తీసుకోవడమో.. లేక వారిని బెదిరించి టెండర్ వెనక్కి తీసుకునేలా చేసి తమకు కావాల్సిన వారి కంపెనీలకు కట్టబెట్టేందుకు ప్రక్రియ తేలిక అవుతుంది' అని హరీష్ రావు వివరించారు. గతంలో ఉన్నట్లు మైనస్ 10 నుంచి మైనస్ 22 కాకుండా ప్లస్ 7 శాతం ఇస్తే.. తక్కువలో తక్కువగా 17 శాతం కమీషన్ ఎక్కువ వస్తుందన్నారు. కమీషన్లు కొల్లగొట్టేందుకు ఈ పద్ధతి తీసుకొచ్చారని హరీష్ రావు ఆరోపించారు. గతంలో వెంకటేష్ కని అనే టెండర్ మైనస్ శాతానికి ఇచ్చాం. ఇప్పుడు దానికి రీటెండర్ చేసి ప్లస్ శాతానికి అప్పగించారు. ఎస్ఆర్పీ ఓసీ2 శ్రీరాంపూర్ టెండర్ రద్దు చేసి మళ్లీ టెండర్ చేసి ప్లస్ శాతానికి తమ మనుషులకు టెండర్ అప్పగించి కమీషన్లు కొల్లగొట్టారు. ఓ టెండర్ మూడుసార్లు రద్దు చేసి, తిరిగి తమ అనుయాయులకు అప్పగించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆరోపించారు. గతంలో సింగరేణి డీజిల్ ఐఓసీ నుంచి తీసుకుని కాంట్రాక్టర్లకు ఇచ్చి పని మాత్రమే చేపించుకునే వారు. కానీ ఇప్పుడు డీజిల్ కూడా కాంట్రాక్టర్ల ఖాతాలో వేశారు. రూ.50 కోట్ల పని వంద కోట్లు అవుతుంది. సింగరేణి ఇచ్చే డీజిల్ విధానాన్ని రద్దు చేసి దాన్ని కాంట్రాక్టర్ల ఖాతాలో వేస్తే ఎక్కువ కమీషన్లు కొల్లగొడుతున్నారు. గతంలో 50 కోట్ల పనులకు కాంట్రాక్టర్లకు 18 శాతం జీఎస్టీ బిల్లులు కడితే, ఇప్పుడు 100 కోట్ల మీద జీఎస్టీ కడితే సింగరేణికి ఎంత నష్టం జరుగుతుందో రాష్ట్ర ప్రజలు గమనించాలని హరీష్ రావు అన్నారు. ఇదంతా సీఎం రేవంత్ రెడ్డి సన్నిహితుడు, సమీప బంధువు కనుసన్నల్లోనే జరుగుతుందని ఆరోపించారు.

హైదరాబాద్‌లో 137 ప్లాట్లను వేలం వేయనున్న 'రాజీవ్ స్వగృహ'

- 3 పేజి తరువాయి

నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల కొనుగోలుదారులు మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ యంత్రాంగమే ఈ ప్లాట్లను అభివృద్ధి చేయడం వల్ల కొనుగోలుకు మంచి డిమాండ్ ఉంటుందని ఆయన అన్నారు. ఈ వేలం ప్రక్రియ మరియు ప్లాట్ల వివరాలకు సంబంధించిన పూర్తి సమాచారం కోసం రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ అధికారిక వెబ్‌సైట్‌ను (https://www.swagruha.telangana.gov.in/ais/) సందర్శించవచ్చని ఆయన తెలిపారు.

ఘట్‌ఎకేసర్‌ఎలో ప్రభుత్వ భూమిలో లేఔట్.. వందల కోట్ల ఆస్తిని కాపాడిన హైడ్రా

- 3 పేజి తరువాయి

మరోసారి చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ భూమిలో అనుమతి లేని లేఔట్ వేసి ప్లాటింగ్ చేసినట్టు ఆరోపణలు రావటంతో హైడ్రా రంగంలోకి దిగింది. అక్రమంగా ప్లాట్లుగా మార్చి విక్రయించిన వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకుంది.

సర్వే నంబర్లు 66/2, 66/3, 66/4, 66/5లో మొత్తం 6.12 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడి ఫెన్సింగ్ వేశారు అధికారులు. ప్రభుత్వ భూమిలోకి చొరబడి దాదాపు 50 వరకు ప్లాట్లు వేసినట్టు గుర్తించారు. స్థానికుల ఫిర్యాదులతో హైడ్రా అధికారులు ఆక్రమణలను పరిశీలించారు. సర్వే ల్యాండ్ రికార్డుల విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు హైడ్రా అధికారులు. నోటీసులు ఇవ్వలేదంటూ నల్లమల్లారెడ్డి చేసిన అభ్యంతరాలు విఫలమయ్యాయి. ఫెన్సింగ్‌తో పాటు ప్రభుత్వ భూమిగా హైడ్రా బోర్డులను ఏర్పాటు చేశారు.

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు సుప్రీంకోర్టు నోటీసులు





హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో గతంలో సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును స్పీకర్ అమలు చేయడం లేదని ఆరోపిస్తూ బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ సంజయ్ కరోల్ ధర్మాసనం విచారణ చేపట్టింది. మహేశ్వర్‌రెడ్డి చేసిన ఆరోపణలపై సమాధానం ఇవ్వాలని స్పీకర్‌ను ఆదేశిస్తూ నోటీసులు ఇచ్చింది. అనంతరం ఈ వ్యాజ్యాన్ని ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి, కేటీఆర్‌ల పిటిషన్లతో జత చేసింది. ఈ పిటిషన్లన్నింటిపైనా కలిపి ఫిబ్రవరి 6న విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టం చేస్తూ, తదుపరి విచారణను వాయిదా వేసింది.

బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఎక్కడా అభివృద్ధి జరగలే: మంత్రి వివేక్

హైదరాబాద్ పెన్ పవర్: గత బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో గ్రామాలు, పట్టణాలు ఎక్కడ అభివృద్ధి జరగలేదని మంత్రి వివేక్ వెంకటస్వామి విమర్శించారు. కేవలం కమీషన్ల కోసం ప్రాజెక్టులు, భారీ నిర్మాణాలు చేపట్టారని ఆరోపించారు. సోమవారం (జనవరి 19) చెన్నూరు నియోజకవర్గంలోని క్యాతనపల్లి మున్సిపాలిటి పరిధిలో ఇందిరా మహిళా శక్తి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్ పాల్గొని స్వయం సహాయక మహిళ సంఘాల మహిళలకు 1.71కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించేలా మహిళ స్వయం సహాయ సంఘాల మహిళల అభివృద్ధి కోసం వడ్డీ లేని రుణాలు, పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత క్యాతనపల్లి మున్సిపల్‌లో రూ.35 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. క్యాతనపల్లిలో 16 వందల కొత్త రేషన్ కార్డులు జారీ చేశామని చెప్పారు. అర్హులైన పేదలకు 150 ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామన్నారు.

పాదయాత్ర ప్రారంభించిన బండ్ల గణేష్

హైదరాబాద్, జనవరి 19: పెన్ పవర్: నటుడు, ప్రముఖ నిర్మాత బండ్ల గణేష్ మహా సంకల్పయాత్ర ప్రారంభమైంది. తొలుత వెంకటేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించిన ఆయన షాద్ నగర్‌లో ఆయన నివాసం నుంచి తిరుపతి వరకూ పాదయాత్ర ప్రారంభించారు. ఆయన సన్నిహితులు, పలువురు సినీ ప్రముఖులు ఆయన వెంట నడిచారు. ఏపీ సీఎం చంద్రబాబుపై అభిమానంతో ఆయన ఈ పాదయాత్ర చేస్తున్నారు. ఏపీ సీఎం చంద్రబాబుపై అభిమానంతో బండ్ల గణేష్ ఈ సంకల్ప యాత్ర చేపట్టారు. స్కిల్ కేసులో అవినీతి జరిగిందనే ఆరోపణలతో వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబును అరెస్ట్ చేశారు. ఆ టైంలో బండ్ల గణేష్ తీవ్ర ఆవేదన చెందారు. పలు కార్యక్రమాల్లో చంద్రబాబు అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఆయన ఎలాంటి మచ్చ లేకుండా తిరిగి వస్తే కాలినడకన శ్రీవారి సన్నిధికి వస్తానని మొక్కుకున్నారు. ఇప్పుడు అది నెరవేరడంతో మొక్కు చెల్లించుకుంటున్నారు. అంతకు ముందు నిర్వహించిన కార్యక్రమంలో ఆయనతో పాటు హీరో శివాజీ మాట్లాడారు. తాను చేపట్టే సంకల్పయాత్ర రాజకీయ యాత్ర కాదని... దేవుడి మొక్కు అని తెలిపారు బండ్ల గణేష్. 'భగవంతుడు నేను అనుకున్నది నెరవేర్చినందుకు ఆయన మొక్కు చెల్లించుకుంటున్నా. చంద్రబాబుపై అభిమానంతో వెంకన్న కొండకు నడిచివెళ్తున్నా. ఓ రోజు ఉదయాన్నే లేచి చూస్తే చంద్రబాబు అరెస్ట్ వార్త విని షాకయ్యా. రోజులు గడుస్తున్నా సార్ బయటకు రాలేదు. ఆయనకు పదవి రావాలనో లేదంటే అధికారంలోకి రావాలనో నేను ఆ వెంకటేశున్ని మొక్కుకోలేదు. ప్రాణాలతో ఆయన బయటకు వస్తే నా గడప నుంచీ నీ గడప వరకూ పాదయాత్రగా వచ్చి నీ మొక్కు చెల్లించుకుంటానని వెంకటేశుని ప్రార్థించా. ఆ ఏడుకొండల వాడి ఆశీస్సులతో చంద్రబాబు బయటకు వచ్చారు. జూలు విడిచిన సింహంలా ఆయన బయటకు వచ్చారు. ఈ యాత్రకు రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదు. ప్రతీ అభిమాని అడుగు ఇది. కోట్లాది మంది తెలుగు ప్రజల అడుగు ఇది.' అని తెలిపారు. బండ్ల గణేష్ అంటే ఓ శక్తి అని సీనియర్ హీరో శివాజీ అన్నారు. 'బండ్ల గణేష్ అంటే ఓ బ్రాండ్. పరిశ్రమలో నాకు ఫస్ట్ సహాయం చేసింది గణేష్ అన్న. ఆయన ఇండస్ట్రీలో ఎంతోమందికి సహాయం చేశారు. పార్టీలతో సంబంధం లేకుండా ఆయన అందరివాడు. ప్రజల మనిషి చంద్రబాబు బయటకు రావాలని కోరుకున్నారు. అది నెరవేరడంతో ఇచ్చిన మాట ప్రకారం షాద్ నగర్ నుంచి వెంకన్న సన్నిధి వరకూ పాదయాత్ర చేపట్టారు.' అని అన్నారు

వీధి కుక్కలను చంపడంపై తీవ్రస్థాయిలో స్పందించిన రేణు దేశాయ్



హైదరాబాద్ పెన్ పవర్: వీధి కుక్కలను చంపడంపై సినీనటి జంతు ప్రేమికురాలు రేణు దేశాయ్ తీవ్రస్థాయిలో స్పందించారు. కేవలం కుక్కల వల్ల మృతి చెందిన వాటినే ప్రాణాలుగా పరిగణిస్తూ రోడ్డు ప్రమాదాలు దోమలతో చనిపోయిన వారివి ప్రాణాలు కాదా అని ప్రశ్నించారు. 100 కుక్కల లో ఐదు కుక్కలు మాత్రమే అగ్రెసివ్ స్వభావం కలిగి ఉంటాయని అన్నారు. అలాంటి ఐదు కుక్కల కోసం మిగిలిన 95 కుక్కలను చంపుతారా అంటూ ప్రశ్నించారు. ఈ భూమిపై ప్రతి జీవికి జీవించే హక్కు ఉందని నిస్సహాయతతో ఉన్న కుక్కలను దారుణంగా చంపడం దారుణమని అన్నారు.

కాలభైరవుడిగా పూజలు అందుకుంటున్న శునకాలను ఎలా హత్య చేయాలనిపిస్తుంది అని ప్రశ్నించారు. ప్రభుత్వాల వైఫల్యాల వల్లనే వీధి కుక్కల ప్రమాదాలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏ బి సి, వ్యాక్సినేషన్స్ వేస్తే పరిష్కారమయ్యే సమస్యను జటిలం చేసి కుక్కలు మరణాలకు కారణం అవుతున్నారని మండిపడ్డారు. దేశంలో ప్రతినిత్యం రోడ్డు ప్రమాదాలు, దోమ కాటుతో మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాలు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు ఎన్నో, మానవత్వం వీడి కుటుంబ సభ్యులనే హతమరుస్తున్న సంఘటనలో లక్షలాది ప్రాణాలు పోతున్నాయని అన్నారు.

వాటన్నిటినీ వదిలిపెట్టి కేవలం కుక్కల వల్ల చనిపోయిన ప్రాణాలను మాత్రమే ప్రాణాలుగా పరిగణిస్తే ఎలా అని నిలదీశారు. తనకు 45 సంవత్సరాలు వచ్చాయని ఇప్పటివరకు ఏ వీధి కుక్క తనపై దాడికి పాల్పడలేదని చెప్పారు. దేశ అత్యున్నత న్యాయస్థానం ఒక రకమైన తీర్పులను వెలువడిస్తే వాటిని మరోరకంగా అర్థం చేసుకొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తప్పుడు విధానాలతో కుక్కలను పూర్తిగా సంహరించే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయి అని మండిపడ్డారు. భారత దేశంలో వేస్ట్ మేనేజ్మెంట్ సక్రమంగా నిర్వహించకపోవడంతోనే కుక్కలు పిల్లలకు జన్మదిస్తూ అధికమవుతున్నాయని అన్నారు. ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలు సక్రమంగా తీసుకోకపోవడం వల్ల ఎదురయ్యే సమస్యను కుక్కలను చంపడంతో పరిష్కరిద్దాం అనుకోవడం మంచిది కాదని సూచించారు.

ప్రభుత్వాలైనా, వ్యక్తులైన అన్యాయంగా శునకాలను హత్య చేసే కార్యక్రమాలకు తక్షణమే ముగింపు పలకాలని డిమాండ్ చేశారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

క్షుద్రపూజల కలకలం

భద్రాద్రి కొత్తగూడెం: పెన్ పవర్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం నారంవారి గూడెంలో అర్ధరాత్రి క్షుద్ర పూజలు కలకలం రేపాయి. అల్లాడి పద్మ అనే మహిళ ఇంటి వరండాలో పసుపు, కుంకుమ, నిమ్మకాయలు, జంతు పుర్రెతో పూజలు చేసినట్లు గుర్తించారు. నిన్న అమావాస్య కావడంతో ఎవరో క్షుద్ర పూజలు చేశారని గ్రామస్తులు భయభ్రాంతులకు గురై పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

మున్సిపల్ ఎన్నికలకు ఇన్-చార్జ్‌ల నియామకం

మున్సిపల్ ఎన్నికలకు ఇన్-చార్జ్‌లు.. భువనగిరికి సీతక్క... ఖమ్మంకు సురేఖ

హైదరాబాద్ జనవరి 19: పెన్ పవర్: మున్సిపల్ ఎన్నికలకు ఇన్చార్జ్‌లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియమించారు. పార్లమెంట్ నియోజకవర్గాలవారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. 1. ఆదిలాబాద్ – సుదర్శన్ రెడ్డి 2. నిజామాబాద్ – ఉత్తమ్‌కుమార్ రెడ్డి 3. మల్కాజ్‌గిరి – కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 4. చేవెళ్ల – శ్రీధర్‌బాబు 5. మెదక్ – వివేక్ 6. కరీంనగర్ – తుమ్మల నాగేశ్వరరావు 7. పెద్దపల్లి – జూపల్లి కృష్ణారావు 8. నల్గొండ – అడ్లూరి లక్ష్మణ్ 9. భువనగిరి – సీతక్క 10. వరంగల్ – పొంగులేటి 11. మహబూబ్‌నగర్ – పొన్నం ప్రభాకర్ 12. మహబూబ్‌నగర్ – దామోదర రాజనర్సింహా 13. జహీరాబాద్ – అజహరుద్దీన్ 14. నాగర్‌కర్నూల్ – వాకిటి శ్రీహరి 15. ఖమ్మం – కొండా సురేఖ

సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం వెనుక కుట్ర: మాజీ మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్ జనవరి 19 పెన్ పవర్: రాష్ట్రంలో కొద్ది రోజులుగా సింగరేణి స్కాంలు, మంత్రుల మధ్య వాటాల పంచాయితీ చూస్తున్నామని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు తెలిపారు. సైట్ విజిట్ విధానంపై దేశ వ్యాప్తంగా అనేక ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అసలు సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం గతంలో లేదని, 2024లోనే సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానాన్ని తీసుకువచ్చారని తెలియజేశారు. నైనీ బ్లాక్ కాంట్రాక్ట్ రద్దు చేశామని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క చెబుతున్నారని, సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం వెనుక కుట్ర ఉందని విమర్శించారు. ప్రస్తుత నిబంధనలతో టెండర్ ఎవరు వేస్తున్నారో ముందే తెలిసిపోతుందని పేర్కొన్నారు. సిఎం రేవంత్ రెడ్డికి దమ్ముంటే నిజాయితీ ఉంటే దీనిపై విచారణ చేయించు అని సూచించారు.

కాంగ్రెస్ తో బిజెపి కుమ్మక్కు కాకపోతే.. వెంటనే ఈ అంశంపై సిబిఐ విచారణకు ఆదేశించాలని, గతంలో జరిగిన టెండర్లు రద్దు చేసి తమ అనయాయులకు దక్కేవిధంగా చూస్తున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. సిబిఐ ఎంక్వైరీకి ఆదేశిస్తే.. తాను అన్ని ఆధారాలు సమర్పించేందుకు సిద్ధం అని సవాల్ విసిరారు. సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానాన్ని సింగరేణిలో శాశ్వతంగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నానని, బిఆర్ఎస్ దిమ్మెల జోలికొస్తే.. దుమ్ము దుమ్మయిపోతావ్.. అని మండిపడ్డారు. ఆయనకు తెలియకుండా సిట్ ఎలా వేస్తారు? అని అసలు సిఎం కు తెలియకుండా సిట్ వస్తుందా? అని ప్రశ్నించారు. అదే నిజమైతే సిఎంగా ఆయన ఫెయిల్ అయినట్టే అని సిఎంకు తెలియకుండా సిట్ వేశారంటే అది అడ్మినిస్ట్రేషన్ మీద నీకు పట్టు లేదని అర్థమైందని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డే హోం మినిస్టర్, రేవంత్ రెడ్డే సిఎం అని హరీశ్ రావు దుయ్యబట్టారు.

సిద్దిపేట జిల్లా కేంద్రంలో దారుణం

భార్య గొంతు కోసి కూతురును రోకలి బండతో దాడి చేసి భర్త ఆత్మహత్యాయత్నం

సిద్దిపెట్ జనవరి 19: పెన్ పవర్: సిద్దిపేట జిల్లా కేంద్రంలో దారుణం జరిగింది. భర్త తన భార్య గొంతు కోసి కూతురును రోకలి బండతో దాడి చేసి అతడు ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదర్శనగర్‌లో ఎల్లయ్య, శ్రీలత(40) అనే దంపతులు నివసిస్తున్నారు. ఈ దంపతులకు ఒక కుమార్తె ఉంది. గత కొన్ని రోజుల దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఘర్షణలు తారాస్థాయికి చేరుకోవడంతో భర కత్తి తీసుకొని భార్య గొంతు కోశాడు. అనంతరం కుమార్తెను రోకలి బండతో దాడి చేసి అనంతరం కత్తితో గొంతుకోసుకున్నాడు. ఇంట్లో నుంచి అరుపులు కేకలు వినపడడంతో వెంటనే ముగ్గురిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే భార్య మృతి చెందగా ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

మేడారం టిక్కెట్స్ ఫిక్స్...

వరంగల్, జనవరి 19, పెన్ పవర్:

మేడారం సమ్మక్కసారక్క జాతరకు వెళ్లే భక్తుల కోసం తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి వెళ్లే టిక్కెట్ చార్జీలను ఖరారు చేసింది. హైదరాబాద్ నుంచి రూ.600 నుంచి రూ.1,110 వరకు.. వరంగల్ నుంచి రూ.250 నుంచి రూ.500 వరకు చార్జీలు నిర్ణయించింది. అలాగే భూపాలపల్లి, ఖమ్మం, గోదావరిఖని, కొత్తగూడెం వంటి ప్రాంతాల నుంచి కూడా ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కొనసాగుతుందని ఆర్టీసీ స్పష్టం చేసింది.మేడారం సమ్మక్కసారక్క జాతరకు వెళ్లే భక్తుల కోసం తెలంగాణ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ మహా జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని తగ్గించడంతో పాటు సౌకర్యవంతమైన ప్రయాణం కల్పించేందుకు ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ఇప్పటికే వివిధ ప్రాంతాల వేల సంఖ్యలో బస్సులను మేడారానికి తరలించగా.. తాజాగా దీనికి అనుగుణంగా వివిధ ప్రాంతాల నుంచి మేడారానికి వెళ్లే బస్సుల టిక్కెట్ చార్జీలను ఖరారు చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.హైదరాబాద్, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, భూపాలపల్లి, ఏటూరునాగారం, ఖమ్మం, గోదావరిఖని, కొత్తగూడెం వంటి ప్రాంతాల నుంచి మేడారానికి ప్రత్యేక సర్వీసులు అందుబాటులోకి తీసుకువచ్చింది. బస్సుల రకాన్ని బట్టి చార్జీలు నిర్ణయించారు. హైదరాబాద్ నుంచి ప్రయాణించే వారికి సూపర్ లగ్జరీ, రాజధాని, డీలక్స్, ఎక్స్‌ప్రెస్, సాధారణ, గరుడ ప్లస్ బస్సులు నడపనున్నారు. వీటికి టిక్కెట్ ధరలు రూ.600 నుంచి రూ.1,110 వరకు ఉంటాయి.అలాగే వరంగల్, హనుమకొండ ప్రాంతాల నుంచి ఎక్కువ మంది భక్తులు మేడారానికి వెళ్తుండటంతో అక్కడి నుంచి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వరంగల్, హన్మకొండ నుంచి టిక్కెట్ చార్జీ రూ.250 నుంచి రూ.500 వరకు నిర్ణయించారు. భూపాలపల్లి నుంచి రూ.230 నుంచి రూ.300 వరకు, మహబూబాబాద్ నుంచి రూ.360 నుంచి రూ.410 వరకు చార్జీలు ఉంటాయి. ఖమ్మం నుంచి రూ.480, గోదావరిఖని నుంచి రూ.400, కొత్తగూడెం నుంచి రూ.350 చార్జీగా నిర్ణయించారు. కరీంనగర్ నుంచి మేడారానికి వెళ్లే బస్సుకు రూ.390గా నిర్ణయించారు.ముఖ్యంగా 'మహాలక్ష్మి' పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణ సౌకర్యం కొనసాగుతుందని తెలంగాణ ఆర్టీసీ స్పష్టం చేసింది. భక్తుల సౌకర్యార్థం అదనపు బస్సులు, ప్రత్యేక సిబ్బంది, భద్రతా చర్యలు కూడా చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. జాతరకు వెళ్లే భక్తులు ముందస్తుగా ప్రణాళిక చేసుకొని ప్రయాణించాలని సూచించారు.

మహిళల శక్తితో మేడారం

సమ్మక్క సారక్క దేవతల జాతరకు వేళయింది..ఈసారి జాతర చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా చిత్ర విచిత్రాలు ఆశ్చర్య పరుస్తున్నాయి.. ఈసారి జాతర పూర్తిగా నారీమణుల పెత్తనంలోనే సాగనుంది.. పూర్తిగా మహిళల చేత ట్రస్ట్ బోర్డ్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేశారు.. మంత్రి సీతక్క వినూత్న ఆలోచనతో పూర్తిగా అతివల చేత అమ్మల జాతర జరిపించేందుకు సిద్ధమయ్యారు.. చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, 11 మంది డైరెక్టర్లు 1 ఎక్స్ అఫీషియ సభ్యులతో కలిసి మొత్తం 14 మందితో మేడారం ఉత్సవ కమిటీ చేత ప్రమాణ స్వీకారం చేయించారు..ఓరుగల్లు పేరు చెప్పగానే రాని రుద్రమదేవి పౌరుషం గుర్తుకొస్తుంది.. నారీమణుల నవశాఖానికి ఓరుగల్లు ఆడబిడ్డల పౌరుషాన్ని చిహ్నంగా భావిస్తారు.. సమ్మక్క సారక్క దేవతలను వీరవనితలుగా.. ధీరత్వానికి.. పౌరుషానికి.. ప్రతీకలుగా కొలుస్తారు.. పాలకుల ప్రయోగంతో ఓరుగల్లు స్త్రీ శక్తికి చిహ్నంగా నిలుస్తుంది.. ఇప్పటికే వరంగల్ ఉమ్మడి జిల్లా అంతా అతివల పాలనలోనే కొనసాగుతుంది.. తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ లో ఇద్దరు మహిళా మంత్రులు ఉండగా ఆ ఇద్దరు కొండా సురేఖ, సీతక్క వరంగల్ ఉమ్మడి జిల్లాకు చెందినవారే కావడం విశేషంవీళ్ళిద్దరు మాత్రమే కాదు.. వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు గా డాక్టర్ కడియం కావ్య, వరంగల్ మేయర్ గా గుండు సుధారాణి ప్రజా ప్రతినిధులుగా కొనసాగుతున్నారు.. వరంగల్ కలెక్టర్ గా

సత్యశారదాదేవి, హనుమకొండ కలెక్టర్ గా స్నేహ శబరిష్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ గా చాహత్ వాజ్ పాయ్, వరంగల్ సెంట్రల్ జోన్ పోలీస్ కమిషనర్ గా సరిత స్త్రీ శక్తిని చాటుతున్నారు.తాజాగా నవశకానికి నాంది పలికిన మంత్రి సీతక్క మేడారం జాతరలో ఓ వినూత్న ప్రయత్నం చేశారు.. మేడారం జాతర ఉత్సవ కమిటీ పగ్గాలు మహిళలకే కట్ట బెట్టారు.. చైర్ పర్సన్ గా ఇరుప స్వరూపతో పాటు మరో 12 మంది మహిళా డైరెక్టర్లు, ఒకరు ఎక్స్ అఫీషియా సభ్యుడి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అతివల బాధ్యతల స్వీకరణ ప్రమాణస్వీకారం కార్యక్రమంలో మంత్రి సీతక్క పాల్గొన్నారు.. ధీరత్వానికి ప్రతీకగా కొలబడే సమ్మక్క సారక్క దేవతలే నారీమణులకు స్ఫూర్తి అంటున్న మంత్రి సీతక్క.. ఈసారి పూర్తిగా మహిళల చేతుల మీదుగా జాతర బాధ్యతలు నిర్వహించడం ఓ వరంగా భావిస్తున్నారు.. సమ్మక్క సారక్క దేవతల స్ఫూర్తితో జాతర నిర్వహణలో స్త్రీ శక్తిని చాటుతామన్నారు..రాష్ట్రంలో ఎక్కడా.. ఎప్పుడు కని విని ఎరుగని విధంగా పూర్తిగా మహిళలకే పరిపాలన పగ్గాలు అప్పచెప్పి..ఇంత పెద్ద జాతర నిర్వహణ వారి భుజస్కందాలపై పెట్టడం చర్చగా మారింది.. శ్రీ శక్తిని నిరూపించుకునే గొప్ప అవకాశం లభించిందని తమకు లభించిందనీ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీ చైర్ పర్సన్ తో సహా డైరెక్టర్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు..మేడారం జాతర చరిత్రలో ఇప్పటికే అనేక అద్భుతాలు అబ్బుర పరుస్తుండగా.. తాజాగా నారీమణుల చేతికి పరిపాలన పగ్గాలు అప్ప చెప్పడం మరింత చర్చగా మారింది.. ఇంతపెద్ద జాతర నిర్వహణ బాధ్యతలు వారి భుజాలపై వేసుకున్న అతివలు సమ్మక్క సారక్క స్ఫూర్తితో సక్సెస్ చేస్తారని ఆశిద్దాం.

ప్రత్యేక అధికారులు ప్రతి పాఠశాలను సందర్శించాలి



కరీంనగర్: పెన్ పవర్: ప్రత్యేక అధికారులు జిల్లాలోని ప్రతి పాఠశాలను సందర్శించి అక్కడి మౌలిక వసతులు సహా పలు అంశాలపై నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.

సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమానంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ఈ నెలాఖరులోపు జిల్లాలోని ప్రతి పాఠశాలను ప్రత్యేక అధికారులు సందర్శించాలని ఆదేశించారు. పదవ తరగతి పరీక్షల సన్నద్ధత, ప్రత్యేక తరగతులు, ఎల్పిజి గ్యాస్ కనెక్షన్లు, విటమిన్ గార్డెన్ నిర్వహణ, ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు, నిర్వహణ తదితర అంశాలపై నివేదిక సమర్పించాలని అన్నారు. ఎల్పిజి గ్యాస్ కనెక్షన్లు వినియోగిస్తున్నది లేనిది పరిశీలించాలని, మధ్యాహ్న భోజనం నాణ్యతను తనిఖీ చేయాలని ఆదేశించారు. టాయిలెట్, తాగునీరు తదితర మౌలిక వసతులను పరిశీలించి ఏవైనా అవసరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. జల్ సంచయ్ జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వర్షపు నీటిని ఒడిసిపట్టే నిర్మాణాలు ఎక్కడెక్కడ జరిగాయో వాటికి సంబంధించిన ఫోటోలను జిపిఎస్ ద్వారా నిర్దిష్ట వెబ్సైట్లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు.

అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున సిలబస్ పూర్తి చేయాలని, నిర్దిష్టమైన పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. విటమిన్ గార్డెన్ల నిర్వహణ, సాయంకాలం తరగతులను ప్రత్యేక అధికారులు పరిశీలించాలని అన్నారు. ప్రతి పాఠశాలలో ఐదు క్లబ్బులు ఏర్పాటు చేశామని, వాటి పనితీరును తెలుసుకోవాలని అన్నారు.

ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

ప్రజావాణి కి 250 దరఖాస్తులు:

ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యమిచ్చి వెను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి నిర్వహించగా అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి దరఖాస్తులు స్వీకరించారు. కొన్ని దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నింటిని అధికారులకు బదిలీ చేశారు. మొత్తం 250 దరఖాస్తులు వచ్చాయి.

ప్రారంభమైన పులుల లెక్కలు...

మహబూబ్ నగర్, జనవరి 19, పెన్ పవర్:
పులుల లెక్క, మొత్తం అటవీ జీవవైవిధ్యాన్ని అంచనా వేయడానికి అటవీ శాఖ సిద్ధమైంది. ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ 2026ను నిర్వహించడానికి సన్నాహాలు పూర్తి చేసింది. రాష్ట్రంలో పులులు, వాటి ఆహారమైన శాఖాహార జంతువులను కూడా లెక్కిస్తారు. ఈ కార్యక్రమంలో భాగంగా 25 వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న 3,053 అటవీ ప్రాంతాలలో క్షేత్రస్థాయి డేటా సేకరణ జరుగుతుంది. ఈ సర్వేలో టైగర్ రిజర్వ్ ఫారెస్ట్, వన్యప్రాణుల అభయారణ్యాలు, అభయారణ్యాలు, ఇతర అటవీ ప్రాంతాలు ఉంటాయి. తెలిసిన పులుల కదలిక జోన్‌లపై మాత్రమే కాకుండా.. వాటి ఆవాసాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తారు. నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ, వైల్డ్ లైఫ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఈ లెక్కింపు జరుగుతుంది. శిక్షణ పొందిన అటవీ శాఖ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు ట్రాన్సెక్ట్ లైన్లు వేయడం ద్వారా, టైగర్ పగ్‌మార్క్‌లు, స్కాట్ నమూనాలు, స్క్రాచ్ మార్క్‌లు వంటి సంకేతాలను నమోదు చేయడం ద్వారా క్షేత్రస్థాయి సర్వేలను నిర్వహిస్తారు. అటవీ నివాస పరిస్థితులు, మానవ కార్యకలాపాల ప్రభావంపై డేటాను కూడా మొబైల్ అప్లికేషన్‌లను ఉపయోగించి సేకరిస్తారు. ఈ కార్యక్రమంలో 1,129 మంది వాలంటీర్లు నమోదు చేసుకున్నారని అధికారులు తెలిపారు. ఔఔఖీ, ఎమి×జూూ, యానిమల్ వారియర్స్, డెక్కన్ బర్డర్స్, ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్స్ సొసైటీ వంటి ప్రభుత్వేతర సంస్థలు దాదాపు 430 మంది శిక్షణ పొందిన సభ్యులతో ఈ కార్యక్రమానికి మద్దతు ఇస్తున్నాయి. అటవీ విభాగాల అవసరాల ఆధారంగా జిల్లా వారీగా వాలంటీర్లను నియమించారు. శాఖాపరమైన పర్యవేక్షణలో డేటా సేకరణలో సహాయం చేస్తారు. సేకరించిన డేటాను కెమెరా ట్రాపింగ్, శాస్త్రీయ విశ్లేషణతో కూడిన తదుపరి దశలలో పులుల సంఖ్య, ఇతర వన్యప్రాణుల స్థితిని సమగ్రంగా అంచనా వేయడానికి ఉపయోగిస్తారు. పులి అడుగులు, చెట్లకు గోకే గుర్తులు, మలం ఆధారంగా వాటి ఆచూకీ తెలుసుకుంటారు. ఇందుకోసం టెక్నాలజీని వాడుతారు. ఇప్పటిదాకా పులుల సంఖ్యపై కచ్చితమైన సమాచారం లేదు. దీంతో వాటి సంరక్షణ చర్యలు ఇబ్బందులు అయ్యేవి. తాజాగా పులుల గణనతో ఆ సమస్య తీరనుంది.

రాబందును పట్టించిన జీపీఎస్

మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం బహిరన్ దిబ్బ గ్రామ శివారులో ఒక రాబందు కనిపించింది. నిజానికి రాబందులు కనిపించడం అరుదు కదా. దీంతో గ్రామస్థుల్లో భయం మెదలైంది. ఆకాశం నుంచి అకస్మాత్తుగా వచ్చిన ఈ పక్షిని చూసిన జనాలు ఆలోచనల్లో పడ్డారు. ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఇక ఆ పక్షి కాళ్లకు స్టిక్కర్లు, నంబర్లు, చిన్న పరికరాలు ఉండటంతో ఆశ్చర్యంగా చూశారు. అయితే కొందరు యువకులు పరికరాలను చూసి ఏదైనా గూఢచారి పక్షి కావొచ్చు అని అనుమానం వ్యక్తం చేశారు. మరికొందరైతే గ్రామానికి ఏదైనా కీడు జరుగుతుందని కూడా మాట్లాడుకున్నారు. ఈ రాబందుకు సంబంధించిన విషయం సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. ఈ విషయం అటవీ శాఖ అధికారులకు కూడా తెలిసింది. దీంతో వారు రంగంలోకి దిగారు.
దీనిపై ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వికాస్ క్లారిటీ ఇచ్చారు. దేశంలో అంతరించిపోతున్న రాబందుల జాతిని కాపాడేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంరక్షణ ప్రాజెక్టును అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే.. రాబందుల కదలికలు, నివాస ప్రాంతాలు, ఆహార లభ్యత లాంటి అంశాలను అధ్యయనం చేసేందుకు వాటి కాళ్లకు జీపీఎస్ ట్రాకర్లు, గుర్తింపు ట్యాగులు అమర్చుతున్నారన్నారు. ఈ రాబందులు దేశవ్యాప్తంగా ఎక్కడ తిరిగినా.. వాటి లోకేషన్‌ను వైల్డ్ లైఫ్ అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. ఈ టెక్నాలజీ ద్వారా రాబందుల సంఖ్యను పెంచేందుకు అవసరమైన శాస్త్రీస సమాచారం సేకరిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. రాబందుల రక్షణ అందరి బాధ్యత అని చెప్పారు. ఈ పక్షులకు హాని కలిగించినా.., పట్టుకునేందుకు ప్రయత్నించినా.. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామస్థులు ఎలాంటి భయం లేకుండా రాబందును పట్టించుకోకుండా వెళ్లాలని చెప్పారు.

అటు ఎండ ఇటు చలి

హైదరాబాద్, జనవరి 19, పెన్ పవర్:
తెలంగాణలో వింత వాతావరణం నెలకొంది. పగటిపూట ఎండలు మండిపోతుంటే.. రాత్రిళ్లు చలి వణికిస్తోంది. ఆదిలాబాద్‌లో 34.3 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు.. తిర్యాణిలో 7 డిగ్రీలకు పడిపోయాయి. రానున్న మూడు రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ విభిన్న వాతావరణంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సూచన. తెలంగాణ రాష్ట్రంలో వింత వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు పగటిపూట భానుడు తన ప్రతాపాన్ని చూపుతుంటే.. మరోవైపు రాత్రి సమయాల్లో చలి పులి పంజా విసురుతోంది. గత రెండు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే గణనీయంగా పెరిగాయి. ముఖ్యంగా ఆదిలాబాద్ జిల్లాలో సూర్యుడు సుర్రుమంటున్నాడు. ఇక్కడ సాధారణం కంటే 4.2 డిగ్రీలు అధికంగా నమోదై.. 34.3 డిగ్రీల సెల్సియస్‌కు చేరుకుంది. ఖమ్మం, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో కూడా పగటి పూట ఎండ తీవ్రత సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు పెరగడం విశేషం. జనవరి మూడవ వారంలోనే ఈ స్థాయిలో ఎండలు ఉండటం చూస్తుంటే.. రాబోయే వేసవి కాలం ఎంత తీవ్రంగా ఉండబోతుందోనన్న ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. పగటిపూట ఎండలు మండిపోతుంటే.. రాత్రి నుంచి ఉదయం వరకు మాత్రం చలి వణికిస్తోంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు భారీగా పడిపోయాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణిలో అత్యల్పంగా 7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే ఆదిలాబాద్‌లోని భీంపూర్, సంగారెడ్డి జిల్లా కోహీర్, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం వంటి ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 10 డిగ్రీల కంటే తక్కువగానే నమోదయ్యాయి. రాష్ట్రంలోని దాదాపు 13 జిల్లాల్లో చలి తీవ్రత పెరిగి ఉష్ణోగ్రతలు 2 నుంచి 5.4 డిగ్రీల వరకు తగ్గుముఖం పట్టాయి. వాతావరణ శాఖ సూచనల ప్రకారం.. రానున్న మూడు రోజుల్లో రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గుతాయని అంచనా వేస్తున్నారు. అయితే పగటిపూట ఆకాశం నిర్మలంగా ఉండటం వల్ల సూర్యరశ్మి నేరుగా భూమిని తాకి పగటి ఉష్ణోగ్రతలు పెరగడానికి కారణమవుతోంది. రాత్రిపూట గాలిలోని తేమ శాతం తగ్గడం వల్ల చలి తీవ్రత అధికంగా ఉంటోంది. ఈ భిన్న వాతావరణం వల్ల ప్రజలు ఆరోగ్య సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో రెండో జాతీయ రహదారి

ఖమ్మం, జనవరి 19, పెన్ పవర్:
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మరో జాతీయ రహదారి మంజూరైంది. ఈ రహదారి అందుబాటులోకి వస్తే కొత్తగూడెం నుండి హైదరాబాద్‌కు ప్రయాణ దూరం 40 కిలోమీటర్లు తగ్గుతుంది. ఇల్లెందు, మహబూబాబాద్, తొర్రూరు మీదుగా గౌరెల్లి జంక్షన్ వరకు ఈ రహదారిని నిర్మించనున్నారు. ఇందుకోసం ఇల్లెందు, టేకులపల్లి, లక్ష్మీదేవిపల్లి మండలాల్లోని సుమారు 4.85 హెక్టార్ల భూసేకరణకు కేంద్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ప్రస్తుతం ఉన్న రెండు వరుసల రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసులకు రవాణా రంగంలో ఒక గొప్ప శుభవార్త అందుతోంది. జిల్లా మీదుగా మరో సరికొత్త జాతీయ రహదారి రాబోతోంది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను పారిశ్రామిక కేంద్రమైన కొత్తగూడెంతో అనుసంధానించే జాతీయ రహదారి 930పీ నిర్మాణ పనుల్లో ఇప్పుడు కీలక ముందడుగు పడింది. ఈ ప్రాజెక్టు కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తూ కేంద్ర జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ తాజాగా గెజిట్ (3డీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇది జిల్లా ప్రగతికి సరికొత్త బాటలు వేయనుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండా వెళ్లే రెండో జాతీయ రహదారిగా ఇది నిలవనుంది. ఇల్లెందు మరియు కొత్తగూడెం మధ్య ఉన్న మూడు మండలాల్లోని సుమారు 4.85 హెక్టార్ల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇల్లెందు మండలంలోని సుదిమళ్ల, టేకులపల్లి మండలంలోని బేతంపూడి, గొల్లపల్లి మరియు



లక్ష్మీదేవిపల్లి మండలంలోని కారుకొండ వంటి గ్రామాల్లో భూసేకరణ జరగనుంది. ఈ భూములకు సంబంధించి మార్కెట్ విలువ ప్రకారం రైతులకు త్వరలోనే నష్టపరిహారం చెల్లించనున్నారు. ప్రస్తుతం కొత్తగూడెం నుంచి హైదరాబాద్ వెళ్లాలంటే ఖమ్మం లేదా సూర్యాపేట మీదుగా వెళ్లాల్సి వస్తోంది. కానీ ఈ కొత్త జాతీయ రహదారి 930పీ అందుబాటులోకి వస్తే.. ఇల్లెందు, మహబూబాబాద్, తొర్రూరు, వలిగొండ మీదుగా నేరుగా హైదరాబాద్‌లోని గౌరెల్లి జంక్షన్‌ను చేరుకోవచ్చు. దీనివల్ల దాదాపు 40 కిలోమీటర్ల దూరం తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా గణనీయంగా ఆదా అవుతుంది. ఈ రహదారి కేవలం ప్రయాణికులకే కాకుండా.. పారిశ్రామిక రవాణాకు వెన్నెముకగా మారుతుంది. జిల్లాలో ఉన్న మైనింగ్, యంత్రాల రవాణా సులభతరమవుతుంది. అలాగే, హైదరాబాద్ నుండి భద్రాచలం వెళ్లే భక్తులకు కూడా ఇది సులభమైన ప్రత్యామ్నాయ మార్గంగా నిలుస్తుంది. అత్యవసర వైద్య సేవల కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన వారికి ఈ రోడ్డు ఒక వరప్రదాయినిలా మారనుంది. ప్రమాదాలను తగ్గించేలా ప్రస్తుతం ఉన్న రెండు వరుసల రోడ్డును నాలుగు వరుసలుగా విస్తరిస్తుండటం విశేషం.

150 మందితో శాఖాహార ర్యాలీ

హైదరాబాద్ పెన్ పవర్: పిరామిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో మైహిదిపట్నం, దత్తాత్రేయ కాలనీ, మురాద్ నగర్, ఆసిఫ్ నగర్ ప్రాంతాల్లో సుమారు 150 మందితో శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సొసైటీ సభ్యులు, సాధకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ, మనిషికి శాఖాహారమే సరైన ఆహారమని, ఇది మానసిక సమతుల్యతకు, బుద్ధి వికాసానికి దోహదపడుతుందని తెలిపారు. శాఖాహారం తీసుకోవడం ద్వారా సకల జంతువుల పట్ల కరుణ, దయ, ప్రేమ భావాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ శాఖాహారాన్ని అవలంబించడమే సకల ప్రాణుల పట్ల పరమ ధర్మంతో వ్యవహరించడమని వారు అభిప్రాయపడ్డారు. అలాగే శ్వాసపై ధ్యాస పెట్టి ధ్యానం చేయాలని సూచించారు. ధ్యానం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, సంకల్పశక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన పెంచేందుకు దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు.

దేవాలయాల భద్రతకు చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ భజరంగ్ సేన ఆధ్వర్యంలో కాచిగూడలోని జాతీయ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా ప్రతిభావంతుడైన యువకుడు ఈషాన్ గణేష్ యెల్దేను భజరంగ్ సేన నేతలు ఘనంగా సత్కరించారు. ఔరోరా యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఈషాన్, "మిస్టర్ టీన్ ఆఫ్ సౌత్ ఇండియా ఫస్ట్ రన్నర్ అప్" అవార్డు సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన సందర్భంగా భజరంగ్ సేన నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ పాల్గొని క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన లక్ష్మణ్, రాష్ట్రవ్యాప్తంగా హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాలయాల భద్రతకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ సేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెళ్లి ప్రయాణీకుల బస్సు బోల్తా.. ఐదుగురు మృతి, 85 మందికి గాయాలు

హైదరాబాద్ పెన్ పవర్: జార్ఖండ్ రాష్ట్రం లతహార్ జిల్లా మహువాడండ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓర్సా వ్యాలీ ప్రాంతంలో బస్సు బోల్తా పడింది. ఈ దుర్ఘటనలో ఐదుగురు చనిపోగా.. 85మంది గాయపడ్డారు. గాయపడిన వారిని మహువాడండ్ లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బస్సులోని ప్రయాణికులు ఛత్తీస్ గఢ్ లోని బలరాంపూర్ నుంచి లోధ్ ఫాల్ కు స్కూల్ బస్సులో వెళ్తున్నట్లు సమాచారం. వీరంతా పెళ్లి కార్యక్రమానికి వెళ్తున్నారు. ప్రమాదాన్ని చూసిన వెంటనే స్థానికులు, సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో బస్సులో 90 మందికి పైగా ప్రయాణిస్తున్నారని అధికారులు తెలిపారు. ఇప్పటివరకూ బస్సు కింద చిక్కుకుని ప్రాణాలు కోల్పోయిన ఐదుగురు మహిళల మృతదేహాలను వెలికితీశారు. బస్సు కింద మరిన్ని మృతదేహాలు కనిపించే అవకాశం ఉందని భావిస్తున్నారు.
బస్సులోని ప్రయాణీకులు ఛత్తీస్ఘడ్ లోని బలరంపూర్ జిల్లా నుంచి లేట్హార్లోని మహువాదండ్లో జరిగిన వివాహానికి వెళ్లినట్టు సమాచారం. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసు సూపరింటెండెంట్ కుమార్ గౌరవ్ తెలిపారు.

150 మందితో శాఖాహార ర్యాలీ

హైదరాబాద్: పెన్ పవర్: పిరామిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో మైహిదిపట్నం, దత్తాత్రేయ కాలనీ, మురాద్ నగర్, ఆసిఫ్ నగర్ ప్రాంతాల్లో సుమారు 150 మందితో శాఖాహార ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సొసైటీ సభ్యులు, సాధకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సొసైటీ ప్రతినిధులు మాట్లాడుతూ, మనిషికి శాఖాహారమే సరైన ఆహారమని, ఇది మానసిక సమతుల్యతకు, బుద్ధి వికాసానికి దోహదపడుతుందని తెలిపారు. శాఖాహారం తీసుకోవడం ద్వారా సకల జంతువుల పట్ల కరుణ, దయ, ప్రేమ భావాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ శాఖాహారాన్ని అవలంబించడమే సకల ప్రాణుల పట్ల పరమ ధర్మంతో వ్యవహరించడమని వారు అభిప్రాయపడ్డారు. అలాగే శ్వాసపై ధ్యాస పెట్టి ధ్యానం చేయాలని సూచించారు. ధ్యానం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, సంకల్పశక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్యకర జీవన విధానంపై అవగాహన పెంచేందుకు దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు.

దేవాలయాల భద్రతకు చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్: పెన్ పవర్: తెలంగాణ భజరంగ్ సేన ఆధ్వర్యంలో కాచిగూడలోని జాతీయ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా ప్రతిభావంతుడైన యువకుడు ఈషాన్ గణేష్ యెల్దేను భజరంగ్ సేన నేతలు ఘనంగా సత్కరించారు. ఔరోరా యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఈషాన్, "మిస్టర్ టీన్ ఆఫ్ సౌత్ ఇండియా ఫస్ట్ రన్నర్ అప్" అవార్డు సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన సందర్భంగా భజరంగ్ సేన నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ పాల్గొని క్యాలెండర్ను ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన లక్ష్మణ్, రాష్ట్రవ్యాప్తంగా హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాలయాల భద్రతకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ సేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్ట్ చేరుకున్న విదేశీ నిపుణుల బృందం

పోలవరం, జనవరి 19: పెన్ పవర్: పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పురోగతిని పరిశీలించేందుకు విదేశీనిపుణుల బృందం ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతానికి సోమవారం చేరుకుంది. బృందంలో విదేశీ నిపుణులు సీన్ హించిబెర్గర్ , డేవిడ్ బి పాల్ , జియాన్ ఫ్రాంకో డి సీకో ఉన్నారు. వీరు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతంలో ఆరో విడత పర్యటిస్తున్నారు. వీరి వెంట కేంద్ర జల సంఘంలోని వివిధ విభాగాల అధికారులు సరబ్జిత్ సింగ్ బక్షి , మనీష్ రాథోర్, గౌరవ్ తివారి, హేమంత్ గౌతమ్, సిఎస్ఎంఆర్ఎస్ అధికారులు మనీష్ గుప్తా , రవి అగర్వాల్ , సీడబ్ల్యూపీఆర్ఎస్ ప్రతినిధి వి ఎస్ రామారావు, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎం రఘురాం, డైరెక్టర్ కె శంకర్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ సలహాదారు ఎం వెంకటేశ్వర రావు, ఎన్ ఐ ఆర్ ఎం డైరెక్టర్ అజయ్ కుమార్ నైతాని ,సీడీఓ చీఫ్ ఇంజనీర్ ఉన్నారు. వీరికి జలవనరుల శాఖ ఈ ఎన్ సి కె నరసింహమూర్తి , పోలవరం ఎస్ ఈ రామచంద్ర రావు, ఏం ఈ ఐ ఎల్ జనరల్ మేనేజర్ గంగాధర్,.డి జి ఎం మురళి పమ్మి స్వాగతం పలికారు.

ఫ్యాన్స్ కలెక్షన్ వార్...

హైదరాబాద్, జనవరి 19, పెన్ పవర్: సినిమా అనేది చాలా మంది ఓ వ్యసనం. తెలుగు వారికి ఇంకా ఎక్కువ. యువతలోనూ సినిమాలపై ఆసక్తి ఉంటుంది. అయితే మంచి వినోదం ఆస్వాదించడానికి ఈ సినిమా పిచ్చి రావడం లేదుం సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ఫ్యాన్ వార్స్ చేసుకోవడానికి, కలెక్షన్ల లెక్కల పంచాయతీలు పెట్టుకోవడానికి సినిమాను చూస్తున్నారు. సినిమాను కేవలం వినోదంగా చూడటం మానేసి, దానిని ఒక వ్యక్తిగత యుద్ధంగా మార్చుకోవడం ప్రమాదకరంగా మారుతోంది.సోషల్ మీడియాలో ఏ చిన్న హీరో సినిమా విడుదలైనా, కలెక్షన్ల పోస్టర్ల మీద పెద్ద ఎత్తున యుద్ధం మొదలవుతోంది. తమ అభిమాన హీరోకి వంద కోట్లు వచ్చాయంటే, కాదు కాదు రెండొందల కోట్లు వచ్చాయంటూ ఫేక్ డేటాతో పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. ఈ కలెక్షన్ల వల్ల నిజంగా లాభపడేది నదరు హీరోలు, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు మాత్రమే. సినిమా హిట్టయితే హీరో రెమ్యూనరేషన్ పెరుగుతుంది, నిర్మాత లాభాల బాట పడతాడు. కానీ, గొంతు చించుకుని సోషల్ మీడియాలో పోరాడే అభిమానికి, ఆ కలెక్షన్ల నుండి ఒక్క రూపాయి కూడా రాదు సరి, వారి వ్యక్తిగత జీవితానికి ఇది ఏ రకంగానూ ఉపయోగపడదు.సినిమా రంగం అనేది వేల కోట్ల రూపాయల వ్యాపారం. ఇక్కడ హీరోలు, దర్శకులు ఒక ప్రాజెక్ట్ తర్వాత మరో ప్రాజెక్ట్ చేసుకుంటూ తమ కెరీర్‌ను నిర్మించుకుంటారు. హీరోలందరూ ఎంతో స్నేహంగా మెలుగుతుంటే, బయట వారి అభిమానులు మాత్రం కుల, మత, ప్రాంతాల వారీగా చీలిపోయి బూతులు తిట్టుకోవడం అత్యంత దౌర్భాగ్యం. ఒక హీరోను ఇష్టపడటంలో తప్పు లేదు, కానీ ఆ ఇష్టం ఇతర హీరోలను ద్వేషించే స్థాయికి చేరడం మానసిక వైకల్యమే అవుతుంది. వినోదం కోసం కేటాయించాల్సిన సమయాన్ని, ఈ అర్థం లేని గొడవలకు కేటాయించడం వల్ల జీవితంలో అత్యంత కీలకమైన యువతరం సమయం వృథా అవుతోంది.యువత గుర్తించాల్సిన ప్రాథమిక సూత్రం ఒకటే జీవితం అనేది సినిమా కంటే చాలా పెద్దది. కెరీర్ నిర్మించుకోవాల్సిన వయసులో, కుటుంబ బాధ్యతలు స్వీకరించాల్సిన సమయంలో, సినిమా కలెక్షన్ల గురించి సోషల్ మీడియాలో పోరాటాలు చేయడం వల్ల భవిష్యత్తు అంధకారమవుతుంది. సినిమాను థియేటర్‌లో చూసి, ఆ వినోదాన్ని అక్కడితో వదిలేయాలి. రికార్డులు, కలెక్షన్ల వేటలో పడి వ్యక్తిత్వాలను దిగజార్చుకోవడం ఆపేయాలి. హీరోలు తమ పని తాము చేసుకుపోతున్నప్పుడు, అభిమానులు కూడా తమ జీవితాలను చక్కదిద్దుకోవడమే నిజమైన స్టార్‌డమ్ అనిపించుకుంటుంది.

300 కోట్ల క్లబ్ లో మనశంకరవరప్రసాద్

హైదరాబాద్, జనవరి 19, పెన్ పవర్: 'మెగాస్టార్ చిరంజీవి 'భోళా శంకర్' ఫ్లాప్ నుంచి బౌన్స్ బ్యాక్ అయ్యారు. సంక్రాంతికి విడుదలైన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో భారీ హిట్ కొట్టారు. బాక్స్ ఆఫీస్ దగ్గర సరికొత్త రికార్డులను ఈ సినిమా క్రియేట్ చేస్తోంది. ఇప్పటి వరకు ఈ సినిమా నాలుగు రికార్డులు క్రియేట్ చేసింది. అవి ఏమిటో చూద్దాం. నార్త్ అమెరికాలో 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమా కలెక్షన్స్ 2.5 మిలియన్ డాలర్స్ దాటాయి. అంతే కాదు మెగాస్టార్ చిరంజీవి కెరీర్లో నార్త్ అమెరికా ఆల్ టైం హైయ్యస్ట్ గ్రాసింగ్ ఫిలిం కింద ఈ సినిమా రికార్డు సృష్టించింది.'మన శంకర వరప్రసాద్ గారు' క్రియేట్ చేసిన మరొక రికార్డు ఏమిటి అంటే... ఈ సినిమా విడుదలైన అన్ని ఏరియాలలో బ్రేక్ ఈవెన్ అయింది. డిస్ట్రిబ్యూటర్లకు కొన్న అమౌంట్ కంటే ఎక్కువ కలెక్షన్స్ రాబట్టి వాళ్లకు లాభాలు అందించడం మొదలు పెట్టింది.ఖైదీ నెంబర్ 150' సినిమాతో మెగాస్టార్ చిరంజీవి రీ ఎంట్రీ ఇచ్చారు. ఆ సినిమా సంక్రాంతికి విడుదల అయ్యి భారీ విజయం సాధించింది. అలాగే బాబీ దర్శకత్వంలో నటించిన 'వాల్తేరు వీరయ్య' కూడా సంక్రాంతి రిలీజ్. ఆ సినిమా కూడా విడుదల విజయం సాధించింది. ఇప్పుడు 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాతో... రీ ఎంట్రీలో సంక్రాంతి బరిలో చిరంజీవి తర్వాత ముచ్చటగా మూడో విజయాన్ని అందుకున్నారు. సంక్రాంతికి విడుదలైన చిరంజీవి మూడు సినిమాలు బాక్స్ ఆఫీస్ దగ్గర 100 కోట్ల షేర్ అందుకున్నాయి. వీటితో పాటు 'సైరా నరసింహా రెడ్డి' కూడా 100 కోట్ల షేర్ అందుకుంది. సంక్రాంతికి రికార్డు ఏమిటంటే... 'మన శంకర్ వరప్రసాద్ గారు' ఐదు రోజులకే 100 కోట్ల షేర్ సాధించడం. ఆరు రోజుల్లో అన్ని ఏరియాల్లో బ్రేక్ ఈవెన్ కావడం. ఆల్రెడీ ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 260 కోట్లకు పైగా గ్రాస్ సాధించింది. ఆ ఫుంత కేవలం ఆరు రోజుల్లో చేరుకుంది. లాంగ్ రన్ కంప్లీట్ అయ్యేసరికి 500 కోట్లు వసూలు చేసే అవకాశం ఉందని సమాచారం.

ఇక ఇండియాలనే రాఫెల్స్..

ముంబై జనవరి 19, పెన్ పవర్: భారత్ మరోసారి ఫ్రాన్స్‌తో రక్షణ ఒప్పందం కుదుర్చుకునే దిశగా అడుగులు వేస్తోంది. రక్షణ మంత్రిత్వ శాఖ మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం కింద భారత వైమానిక దళం కోసం 114 రాఫెల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీకి ఆమోదం తెలిపింది. దాదాపు రూ. 3.24 లక్షల కోట్ల అంచనా వ్యయంతో కూడిన ఈ ఒప్పందం ప్రపంచంలోనే అతిపెద్ద ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ తయారీ ఒప్పందాలలో ఒకటిగా నిలవనుంది. ఈ క్రమంలో రాఫెల్ ఫైటర్ జెట్‌లు భారతదేశంలో తయారైతే, వాటిని ఇతర దేశాలకు విక్రయించవచ్చుతాజా నివేదిక ప్రకారం, ఫ్రాన్స్‌లోని డసాల్ట్ ఏవియేషన్ తర్వాత రాఫెల్ ఫైటర్ జెట్‌ల కోసం భారత్‌ను రెండవ గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా మార్చాలని భావిస్తోంది. అంటే, భారతదేశంలో తయారు చేసే ఫైటర్ జెట్స్ భారత వైమానిక దళం అవసరాలకు మాత్రమే పరిమితం కావు. ఇక్కడ తయారు చేసిన యుద్ధ విమానాలను అంతర్జాతీయ ఎగుమతి ఆర్డర్‌లను పూర్తి చేయడానికి కూడా ఉపయోగించవచ్చు.మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లోని మిహాన్‌లోని ప్రత్యేక ఆర్థిక జోన్ (ఎస్‌ఈజెడ్)లో ప్రత్యేక రాఫెల్ ఫైనల్ అసెంబ్లీ లైన్ ఏర్పాటు చేయనుంది. ఈ సౌకర్యం సంవత్సరానికి 24 ఫైటర్ జెట్‌లను తయారు చేస్తుందని ప్రస్తుతానికి భావిస్తున్నారు. పూర్తి యుద్ధ విమానాల ఎగుమతితో నియంత్రణ లేదా దౌత్యపరమైన అడ్డంకులు ఎదురైనా భారతదేశం నిర్వహణ, మరమ్మత్తు, ఓవరాల్ ఎగుమతుల ద్వారా ప్రయోజనం పొందనుంది. రాఫెల్ ఫైటర్ జెట్స్ ఉపయోగించే దేశాలకు భారతదేశం ప్రాంతీయ వీసా హబ్‌గా అభివృద్ధి కానుంది.భారతదేశంలో రాఫెల్ ఫైటర్ జెట్‌లను తయారు చేయడంలో అతిపెద్ద ప్రయోజనం స్వదేశీ ఆయుధాలు, మన వ్యవస్థలను అనుసంధానం చేయడం. భారతదేశంలో తయారు చేసిన రాఫెల్‌లో భారత క్షిపణులు, అంటే ఎక్స్‌ట్రా బియాండ్ విజువల్ రేంజ్ ఎయిర్ టు ఎయిర్ మిస్సైల్స్ వంటివి అమర్చుతారు. ఇది ఒక ప్రత్యేకమైన ఇండియన్ రాఫెల్ వేరియంట్‌ను సృష్టిస్తుంది. రాఫెల్ ఫైటర్ జెట్ ప్రధాన మేధో సంపత్తి హక్కులు ఫ్రాన్స్ వద్దే ఉంటాయని మీకు తెలుసా. మేక్ ఇన్ ఇండియా ఫ్రేమ్‌వర్క్ కింద భారత రాఫెల్ ప్రోగ్రామ్‌లో దాదాపు 60% స్వదేశీకరణను ఆశిస్తున్నారు. ఈ చర్య తరువాత, రాఫెల్ తయారీ భారతదేశాన్ని ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను ఎగుమతి చేసే దేశాల ఎలైట్ క్లబ్‌లో చేర్చుతుందని కేంద్రం ప్లాన్ చేసింది. ఇది భారతదేశ రక్షణ దౌత్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది, వేలాది మందికి ఉపాధిని కూడా అందిస్తుంది.

జూబ్లీ హిల్స్లో 'లేయర్స్ ఫైవ్' క్లినిక్ ను ప్రారంభించిన మిథాలీ రాజ్

హైదరాబాద్: పెన్ పవర్: డైటింగ్ పేరిట ఆహారానికి దూరంగా ఉండటం కంటే, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడాన్నే తాను నమ్ముతానని భారత మహిళా క్రికెట్ మాజీ సారథి మిథా లీరాజ్ అన్నారు. సుప్రసిద్ధ చర్మ, కేశ, సౌందర్య క్లినిక్ బ్రాండ్ అయిన లేయర్స్ క్లినిక్స్, జూబ్లీహిల్స్ లో లేయర్స్ ఫైవ్ క్లినిక్ ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా తనను కలిసిన క్రీడాభిమానులతో ముచ్చటించారు. ఏ రంగంలో విజయం సాధించాలన్నా క్రమశిక్షణ చాలా ముఖ్యమన్నారు. స్ట్రెంగ్ ట్రెనింగ్ వంటి వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యంగా ఉంటే అది అవసరమైన ఆత్మవి శ్వాసం ఇస్తుందని ఆమె యువతులకు సూచించారు. చర్మ, ఆరోగ్య సంరక్షణలో భాగంగా తాను పాటించే జాగ్రత్తలను మిథాలీరాజ్ వివరించారు.

షాద్ నగర్ నుండి తిరుమలకు పాదయాత్ర ప్రారంభించిన బండ్ల గణేష్

షాద్ నగర్: పెన్ పవర్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో నిర్మాత బండ్ల గణేష్ సంకల్ప యాత్ర పేరుతో షాద్ నగర్ పట్టణంలోని తన సినిమా థియేటర్ నుండి తిరుమల తిరుపతి వెంకన్న సన్నిధికి పాదయాత్రను ప్రారంభించారు. బండ్ల గణేష్ మీడియాతో మాట్లాడుతూ.... వైసిపి ప్రభుత్వం లో చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టడంతో మనస్థాపంతో తిరుమల వెంకటేశ్వర స్వామి కి మొక్కుకున్నని స్వామి దయతోనే చంద్రబాబు నాయుడు జైలు నుండి విడుదలవడమే కాకుండా ఆంధ్రప్రదేశ్లోని గత ఎన్నికల్లో అత్యద్భుతమైన మెజారిటీతో గెలుపొంది ప్రభుత్వాన్ని నెలకొల్పారన్నారు. ఈ సంకల్పయాత్ర కేవలం తన మొక్కు కోసమేనని రాజకీయ లబ్ధి కోసం కాదని తెలిపారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేల రివర్స్ ఫిరాయింపులు

హైదరాబాద్, జనవరి 19, పెన్ పవర్: తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇందులో మెజారిటీ ఎమ్మెల్యేలు తాము ఇప్పటికీ బీఆర్ఎస్ సభ్యులమేనని స్పీకర్‌కు నివేదించడం, చట్టపరమైన చిక్కుల నుంచి తప్పించుకోవడానికి కేవలం సాంకేతికంగానే కాకుండా, క్షేత్రస్థాయిలో మారుతున్న రాజకీయ సమీకరణాలకు కూడా అద్దం పడుతోంది. కేవలం సాంకేతికంగానే కాకుండా, రాజకీయంగా కూడా వీరు కాంగ్రెస్ వైఖరితో విసిగిపోయి మళ్లీ సొంత గూటికి చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నట్లు కనిపిస్తోంది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాంగ్రెస్‌లో చేరడం తాను చేసిన ఒక తప్పటడుగు అని ఆయన బహిరంగంగానే పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తన నియోజకవర్గానికి గానీ, వ్యక్తిగతంగా తనకు గానీ కనీసం వెంట్రుక వాసి కూడా ప్రయోజనం కలగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మూడుసార్లు తనను ఎమ్మెల్యేగా గెలిపించిన గులాబీ జెండా పట్ల కృతజ్ఞతగా ఉండాలని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆయన తన అనుచరులకు పిలుపునివ్వడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది.మరోవైపు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కూడా ఇదే తరహా ధోరణిని ప్రదర్శిస్తున్నారు. గతంలోనే ఆయన కాంగ్రెస్‌లో చేరిన కొద్ది రోజులకే తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరినట్లుగా ప్రచారం చేయించుకున్నారు. తాను ఎప్పుడూ బీఆర్ఎస్‌ను వీడలేదని, కేవలం అభివృద్ధి పనుల నిమిత్తమే ముఖ్యమంత్రిని కలిశానని ఆయన స్పష్టం చేస్తున్నారు. స్పీకర్ ముందు కూడా తాము పార్టీ మారలేదని వాదించడం ద్వారా, అనర్హత వేటు నుంచి తప్పించుకోవడమే కాకుండా, కాంగ్రెస్ పార్టీలో తమకు దక్కుతున్న ప్రాధాన్యతపై అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలు మళ్లీ బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారనేది స్పష్టమవుతోంది.ఈ పరిణామాలు అధికార కాంగ్రెస్ పార్టీకి మింగుడుపడని అంశాలుగా మారాయి. చేర్చుకున్న ఎమ్మెల్యేలు గోడ మీద పిల్లి వాటంగా వ్యవహరిస్తుండటం, ముఖ్యంగా మున్సిపల్ ఎన్నికల ముందు బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని పిలుపునివ్వడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారింది. స్పీకర్ నిర్ణయం ఎలా ఉన్నా, ప్రజల్లో ఈ ఎమ్మెల్యేల విశ్వసనీయత ప్రశ్నార్థకమవుతున్నప్పటికీ, వీరు మళ్లీ బీఆర్ఎస్‌కు దగ్గరవ్వడం ఆ పార్టీ క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. కానీ వారిని మళ్లీ పార్టీలోకి తీసుకోవద్దన్న డిమాండ్ కూడా వినిపిస్తోంది.

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి'

93948 55244

షరతులు వర్తిస్తాయి

అంతస్థులు దాటితే అంతే

హైదరాబాద్, జనవరి 19, పెన్ పవర్: హైదరాబాద్ నగరాభివృద్ధి దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రియల్ ఎస్టేట్ రంగాన్ని నేరుగా ప్రభావితం చేసేలా టీడీఆర్ విధానంలో కీలక మార్పులు చేస్తూ పురపాలక శాఖ జీవో నెం. 16ను విడుదల చేసింది. చెరువులు, నదుల పరిరక్షణతో పాటు భూసేకరణను వేగవంతం చేయడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సవరించిన నిబంధనలు ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరించిన తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో అమలులోకి రానున్నాయి. ఈ పరిధిలోని 300 డివిజన్లలో ఇకపై జరిగే నిర్మాణాలు కొత్త టీడీఆర్ నిబంధనలకు లోబడి ఉండాల్సి ఉంటుంది. నగరంలో హైరైజ్ భవనాల నిర్మాణాన్ని నియంత్రించేలా ప్రభుత్వం కీలక షరతును విధించింది. ఇకపై 10 అంతస్తులు దాటే ప్రతి భవనానికి టీడీఆర్ తప్పనిసరి కానుంది. 11వ అంతస్తు నుంచి పై అంతస్తుల వరకు నిర్మించే మొత్తం విస్తీర్ణంలో 10 శాతానికి సమానమైన టీడీఆర్ సర్టిఫికెట్లు బిల్డర్లు సమర్పించాల్సి ఉంటుంది. దీంతో ఇప్పటివరకు మార్కెట్లో వినియోగం లేక నిల్వగా ఉన్న టీడీఆర్ బాండ్లకు డిమాండ్ పెరగనుంది.భూమిని ప్రభుత్వానికి ఉచితంగా అప్పగించే బిల్డర్లకు ప్రత్యేక రాయితీలు కూడా ఈ జీవోలో పొందుపరిచారు. సెట్‌బ్యాక్ నిబంధనల్లో, భవన ఎత్తు పరిమితుల్లో సడలింపులు కల్పిస్తూ వారిని ప్రోత్సహించనున్నారు. దీని ద్వారా భూసేకరణ ప్రక్రియ సులభతరం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. చెరువులు, నదుల పరిరక్షణకు సంబంధించి భూముల స్వాధీనంపై కూడా ప్రభుత్వం ఆకర్షణీయమైన విధానాన్ని ప్రకటించింది. ఎఫ్‌టీఎల్ పూర్తిస్థాయి నీటి మట్టం పరిధిలో ఉన్న పట్టా భూములకు 200 శాతం టీడీఆర్, చెరువుల బఫర్ జోన్లలో ఉన్న భూములకు 300 శాతం టీడీఆర్, బఫర్ వెలుపల అభివృద్ధి పనుల కోసం భూములు సేకరిస్తే 400 శాతం టీడీఆర్ ఇవ్వాలని నిర్ణయించింది. ఒక ఎకరాకు మించి భూసేకరణ జరిగితే ఆ ప్రతిపాదనను ప్రభుత్వం నేరుగా పరిశీలించనుంది. మూసీ నది పరీవాహక ప్రాంతం, నగరంలోని చెరువుల సుందరీకరణ పనులకు భూ యజమానుల నుంచి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించడమే ఈ విధాన మార్పుల లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది.గతంలో ప్రభుత్వం జారీ చేసిన దాదాపు 10 వేల కోట్ల రూపాయల విలువైన టీడీఆర్ సర్టిఫికెట్లు మార్కెట్లో పేరుకుపోయి వాటి ధర గణనీయంగా పడిపోయింది. దీంతో భూ యజమానులు టీడీఆర్‌కు బదులుగా నగదు పరిహారం కోరుతూ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. ఇప్పుడు పెద్ద భవనాల నిర్మాణానికి టీడీఆర్ తప్పనిసరి చేయడంతో బిల్డర్లు వాటిని కొనుగోలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీంతో టీడీఆర్ మార్కెట్ మళ్లీ కదలికలోకి రావడంతో పాటు, ప్రభుత్వంపై నగదు పరిహారం భారం తగ్గనుంది. ఫలితంగా నిధుల కొరతతో నిలిచిపోయిన రోడ్ల విస్తరణ పనులు, మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులు వేగం అందుకునే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

క్రిషాంక్ కు కలిసి రాని కాలం

హైదరాబాద్, జనవరి 19, పెన్ పవర్: భారత రాష్ట్ర సమితి రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని చలాయించింది. రెండు పర్యాయాలు కూడా ప్రతిపక్షాన్ని తొక్కి అవతలవేసింది. ఇతర పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలను ఆపరేషన్ ఆకర్ష్ ద్వారా చేర్చుకుంది. 2023లో మాత్రం భారత రాష్ట్ర సమితి పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో వ్యతిరేకమైన ఫలితం వచ్చింది. హ్యాట్రిక్ సాధించాలని కలలు గన్న గులాబీ పార్టీకి చుక్కెదురైంది.ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉంది గులాబీ పార్టీ. పార్టీ అధికారం లేకపోయినప్పటికీ.. సోషల్ మీడియా మాత్రం బలంగా ఉంది. గులాబీ పార్టీ సోషల్ మీడియాను ఈ స్థాయిలో బలోపేతం చేసిన వ్యక్తుల్లో క్రిషాంక్ కచ్చితంగా ఉంటారు. ఈయన కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అల్లుడు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిగా తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. అనేక పర్యాయాలు జైలుకు కూడా వెళ్లి వచ్చారు. గులాబీ పార్టీకి కీలకమైన సమాచారం అందించడంలో ఈయన దిట్ట అని చెబుతుంటారు.క్రిషాంక్ కంటోన్మెంట్ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా గెలవాలని భావిస్తున్నారు. 2023లో టికెట్ లభిస్తుందని అనుకున్నప్పటికీ అవకాశం రాలేదు. అప్పుడు గులాబీ పార్టీ సాయన్న కుమార్తెకు అవకాశం ఇచ్చింది. సాయన్న కుమార్తె చనిపోవడంతో.. మళ్లీ క్రిషాంక్ కు టికెట్ ఇస్తారని ప్రచారం జరిగింది. కానీ, ఈసారి కూడా రిక్త హస్తమే మిగిలింది. దీంతో క్రిషాంక్ ఎమ్మెల్యే ఆశలు నెరవేరలేదు.ప్రస్తుతం గులాబీ పార్టీలో సోషల్ మీడియాను ముందుండి నడిపిస్తున్నారు క్రిషాంక్. అయితే ఆయన ఎంతో శ్రమ పడుతున్నప్పటికీ.. గులాబీ పార్టీలో కొంతమంది వ్యక్తులు ఆయనను నాయకుడిగా చూడడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు క్రిషాంక్ కు టికెట్ లభించలేదు. అప్పుడు ఆయన మామ సర్వే సత్యనారాయణకు టికెట్ ఇచ్చారు. దీంతో దానిని కారణంగా చూపి క్రిషాంక్ గులాబీ పార్టీలో చేరారు. అక్కడ కూడా ఆయనకు అవకాశం లభించడం లేదు. సికింద్రాబాద్ నగరానికి సంబంధించి గులాబీ పార్టీని పర్యవేక్షిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్.. కంటోన్మెంట్ ఏరియా కు గులాబీ పార్టీకి సంబంధించి కొత్త బాధ్యులు వస్తారని ప్రకటించారు. ఆ సమావేశానికి క్రిషాంక్ ను పిలవలేదు. క్రిషాంక్ ఆశల మీద తలసాని శ్రీనివాస్ యాదవ్ నీళ్లు చల్లుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్రిషాంక్ పార్టీ కోసం తీవ్రంగా కష్టపడుతున్నారు. అనేక కేసులను ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాలలో దాడులకు కూడా గురయ్యారు. ఈ పరిణామాలు క్రిషాంక్ ను ఆవేదనకు గురి చేస్తున్నాయని అతడి అభిమానులు అంటున్నారు. ఆయన చేస్తున్న పోరాటానికి గుర్తింపు ఏ మాత్రం లభించడం లేదని అభిమానులు వాపోతున్నారు. కేటీఆర్ తో బలమైన బంధం ఉన్నప్పటికీ.. క్రిషాంక్ ను పార్టీ అధిష్టానం ఎందుకు గుర్తించడం లేదో అర్థం కావడం లేదు. కేటీఆర్ మీద సంపూర్ణ విశ్వాసంతో ఉన్నానని అనేక సందర్భాలలో క్రిషాంక్ చెప్పారు. క్రిషాంక్ కు కూడా కేటీఆర్ హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. దీనికి తోడు తలసాని శ్రీనివాస్ యాదవ్ కంటోన్మెంట్ విషయంలో వేలు పెట్టడంతో అసలు క్రిషాంక్ రాజకీయ భవిష్యత్తు ఏమిటో అర్థం కావడం లేదు.

ట్రాఫిక్ చక్ర బంధనం నుంచి బయటకు ఎలా...

హైదరాబాద్, జనవరి 19, పెన్ పవర్: తెలంగాణ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో సైబర్ నేరాలను, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మాదకద్రవ్యాల సరఫరాను ఉక్కుపాదంతో అణచివేయాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రస్తుతం, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టారు. ఆ దిశగా యువ ఐపీఎస్ అధికారులకు ఆ బాధ్యతలను అప్పగించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లతో పాటు కొత్తగా రూపుదిద్దుకుంటున్న 'ఫ్యూచర్ సిటీ' పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ వ్యవస్థను బలోపేతం చేయడం ఈ బదిలీల ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.జిల్లాల్లో అదనపు ఎస్పీలుగా సమర్థవంతంగా పనిచేస్తున్న యువ అధికారులను ఎంపిక చేసి, వారికి నగరంలో ట్రాఫిక్ డిసిపిలుగా పోస్టింగులు ఇచ్చారు. ఈ బదిలీల్లో భాగంగా కొత్తగూడెం ఆపరేషన్స్ అదనపు ఎస్పీగా ఉన్న అవినాష్ కుమార్ ను హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపి-1 (ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లు) గానూ, ఉట్నూరు అదనపు ఎస్పీగా ఉన్న కాజల్ ను హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపి-2 (గోల్కొండ, జూబ్లీహిల్స్ జోన్లు) గానూ నియమించారు. ఆదిలాబాద్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. శేషాద్రిని రెడ్డిని సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపి-2 (కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లు) బాధ్యతల్లోకి తీసుకురాగా, భువనగిరి అదనపు ఎస్పీ కనకాల రాహుల్ రెడ్డికి మల్కాజ్‌గిరి కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ డిసిపి-1 బాధ్యతలు అప్పగించారు.ములుగు జిల్లా ఆపరేషన్స్ అదనపు ఎస్పీగా పనిచేస్తున్న శివం ఉపాధ్యాయను ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ' కమిషనరేట్ ట్రాఫిక్ డిసిపిగా నియమించడం విశేషం. రైల్వేస్ డిఐజి హోదాలో ఉన్న జి. చందనా దీప్తిని ఫ్యూచర్ సిటీ అడ్మిన్ మరియు ట్రాఫిక్ అదనపు సీపీగా నియమించగా, హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపిగా ఉన్న బికే రాహుల్ హెగ్డేను అదే కమిషనరేట్ లో ట్రాఫిక్ డిసిపి-3 (చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్లు) గాను, సైబరాబాద్ ట్రాఫిక్ డిసిపిగా ఉన్న జి. రంజన్ రతన్ కుమార్ ను అక్కడే ట్రాఫిక్ డిసిపి-1 (శేరిలింగంపల్లి జోన్) గాను ప్రభుత్వం బదిలీ చేసింది.అదేవిధంగా, రాష్ట్రవ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా వంటి అక్రమాలను అడ్డుకునేందుకు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్‌లో డిఐజి గా అభిషేక్ మహంతిని నియమించారు. తద్వారా సహజ వనరుల లూటీని అరికట్టడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా కఠిన చర్యలు చేపట్టనున్నారు. మొత్తంగా చూస్తే, తాజా ఐపీఎస్ అధికారుల బదిలీల్లో అటు అనుభవానికి, ఇటు యువత ఉత్సాహానికి సమ ప్రాధాన్యం కల్పిస్తూ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశమైంది.

మద్యం డబ్బులు చెల్లించండి డిస్టలరీస్ వార్నింగ్

హైదరాబాద్, జనవరి 19, పెన్ పవర్: తెలంగాణ ప్రభుత్వం నుంచి రావాల్సిన వేల కోట్ల రూపాయల బకాయిలు ఇప్పుడు రాష్ట్ర పారిశ్రామిక ప్రతిష్టను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వేదిక 2026 దావోస్ సదస్సు మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న నేపథ్యంలో, మద్యం తయారీ పరిశ్రమల సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి గట్టి హెచ్చరికలు జారీ చేశాయి. సుమారు రూ. 3,900 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించకపోతే, రాష్ట్రానికి వచ్చే కొత్త పెట్టుబడులు ఆగిపోవడమే కాకుండా, ప్రస్తుతం ఉన్న ఇన్వెస్టర్ల నమ్మకం కూడా సన్నగిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశాయి.బ్రూవర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ స్పిరిట్స్ అండ్ వైన్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఆల్కహాలిక్ బెవరేజెస్ కంపెనీస్ సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశాయి. తెలంగాణ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ తమకు రూ. 3,900 కోట్లు చెల్లించాల్సి ఉందని, అందులో రూ. 900 కోట్లు ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని వెల్లడించాయి. డియాజియో, పెర్నోడ్ రికార్డ్, యునైటెడ్ బ్రూవరీస్ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులు ఈ బకాయిల అంశంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు."రాష్ట్ర ఖజానాకు మద్యం రంగం భారీగా ఆదాయాన్ని సమకూరుస్తుంది. ఒప్పందం ప్రకారం 45 రోజుల్లో చెల్లింపులు చేయాల్సి ఉండగా, నెలల తరబడి జాప్యం చేయడం వల్ల సరఫరా గొలుసు దెబ్బతింటుంది. ఇది ఉద్యోగాలపై కూడా ప్రభావం చూపుతుంది" అని ఈ మూడు సంఘాలు పేర్కొన్నాయి.తెలంగాణలో పారిశ్రామిక పెట్టుబడులు గత ఏడాదితో పోలిస్తే సగానికి పైగా పడిపోయాయి. 2023-24లో రూ. 28,100 కోట్లుగా ఉన్న పెట్టుబడులు, 2024-25 నాటికి రూ. 13,730 కోట్లకు పడిపోవడం గమనార్హం. బకాయిల చెల్లింపుల్లో జాప్యం కూడా ఇందుకు ఒక కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.మరోవైపు, తెలంగాణ ఎక్సైజ్ ఆదాయం గత పదేళ్లలో నాలుగు రెట్లు పెరిగింది. 2013-14లో రూ. 9,000 కోట్లుగా ఉన్న ఆదాయం, 2023-24 నాటికి రూ. 38,000 కోట్లకు చేరుకుంది. కేవలం అక్టోబర్ 2025లోనే లైసెన్స్ ఫీజుల ద్వారా ప్రభుత్వం రూ. 3,000 కోట్లు వసూలు చేసింది. ఇంత భారీ ఆదాయం వస్తున్నా, సరఫరాదారులకు బకాయిలు ఎందుకు చెల్లించడం లేదని కంపెనీలు ప్రశ్నిస్తున్నాయి."ముఖ్యమంత్రి 2024 జూలైలో కలిసినప్పుడు మూడు నెలల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కళాక్షేత్ర వ్యవస్థాపకుడు... తొలితరం సినిమా నటుడు

హైదరాబాద్ పెన్ పవర్: తెలుగు సినిమాల్లో మొట్టమొదటి కృష్ణ పాత్రధారి రఘురామయ్య (పృధ్వీపుత్ర: 1933; కుచేల: 1935). అయితే రెండో కృష్ణుడు బందా కనక లింగేశ్వరరావు (ద్రౌపదీ మానసంరక్షణం: 1936). నాటి నటులకు ముఖ్యమైన అర్హత చక్కని కంఠంతోపాటు పాట, పద్యం పాడడం. బందా రంగస్థలం మీద ఎన్నో పాత్రలు ధరించి పేరు తెచ్చుకొన్నా- 'కృష్ణ పాత్ర ఆయన అభిమాన పాత్ర' అని చెప్పుకొనే వారు. 'చిత్ర నళీయం' నాటకంలో బాహుకుడి పాత్రను అద్భుతంగా నటించేవారని పేరు. పలు రసాల రాగాల్లో పద్యాలు చదివేవారు. బందావారు ధరించిన పాత్రల్లో ముఖ్యంగా చెప్పుకునేవిగా శ్రీక్రష్ణుడు, కాళిదాసు, బిల్వ మంగళుడు, సారంగ ధరుడు, శ్రీరాముడు, కర్ణుడు, నలుడు, బాహుకుడు, ప్రతాప రుద్రుడు, 'కన్యాశుల్కం'లో గిరీశం, సలీమ్, అల్లూరి సీతా రామరాజు, చంద్రగుప్తుడు, విజయ రామరాజు (బొబ్బిలి యుద్ధం) పానుగంటి వారి 'కంఠాభరణం'లో పిచ్చి రామశాస్త్రి, పేరిగాడు మొదలైనవి. రంగస్థల నటుల్లో వైవిధ్యమైన ఇన్ని పాత్రలు ధరించిన వాళ్లు తక్కువ. ఎవరు ఏ పాత్రలో పేరు తెచ్చుకుంటే ఆ పాత్రనే ప్రేక్షకులు ఎక్కువగా కోరుకునేవారు. కాని, బందా విషయంలో వేరుగా వుండేది. ఏ నాటకం వేసినా కనకలింగేశ్వరరావు ఉంటే చాలు- మంచి నటన, పద్యాలూ వుంటాయని జనం విరగబడేవారు. కురుపాం జమీందారు 'అభినవకృష్ణ' అన్న బిరుదును, జయంపురం మహారాజా 'నటశేఖర' బిరుదునూ బందాకు ప్రదానం చేశారు. తెలుగు టాకీ తొలి తరానికి చెందిన సినిమా నటుడు బందా కనక లింగేశ్వరరావు. సుప్రసిద్ధ రంగస్థల, సినిమా నటుడు, ఆకాశవాణి, నాటక ప్రయోక్త, నాట్యకళా పోషకుడు, కూచిపూడి కళాక్షేత్ర వ్యవస్థాపకుడు అయిన బందా కనకలింగేశ్వరరావు (జనవరి 20, 1907- డిసెంబరు 3, 1968 కృష్ణా జిల్లాలోని ఆటపాక గ్రామంలో జన్మించారు. ఆటపాకలో ప్రాథమిక విద్యాభ్యాసం, అనంతరం బందరు నోబుల్ కళాశాలలో చదివి, మద్రాసు లా కళాశాల నుండి 1932 లో బి.ఎల్. పట్టా పుచ్చుకున్నారు. 1934లో మొదట న్యాయవాదిగా పనిచేసి, తరువాతి కాలంలో తనకు సంతృప్తిని కలిగించే నాటక ప్రదర్శనమే వృత్తిగా చేసుకున్నారు. నాటకరంగంలో ప్రవేశించిన అనంతరం మొదట్లో కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది. అయితే అందివచ్చిన ప్రతిఒక్క పాత్రలో ఒదిగిపోతూ తన ప్రతిభను నిరూపించుకుంటూ దూసుకెళ్లారు. దర్శకులు ఏ పాత్ర ఇచ్చినా కాదనకుండా అందులో పూర్తి లీనమైపోయి తన ప్రతిభతో ముగ్ధుల్ని చేసేవారు. నాటకాలలో తనకు అత్యంత ఇష్టమైన బాహుకుడు, బిల్వ మంగళుడుతో పాటు, అనేక పాత్రలు పోషించారు. అయన ఏలూరులో 1938లో నాటక కళాశాలను స్థాపించి పలువురు నటులకు శిక్షణ ఇచ్చారు. ప్రభాత్ థియేటర్ అనే సంస్థను స్థాపించి నాటక ప్రయోక్తగా నూతన ప్రదర్శన రీతులను ప్రవేశపెట్టారు. 1937, ఫిబ్రవరి 5 విడుదలైన పి.పుల్లయ్య దర్శకత్వం వహించినతెలుగు చలనచిత్రంలో బందా... సారంగధరని పాత్ర పోషించారు. ఈ చిత్రంలో బందా కనకలింగేశ్వరరావు తో పాటు, అద్దంకి శ్రీరామమూర్తి, పులిపాటి వెంకటేశ్వర్లు, కొచ్చర్లకోట సత్యనారాయణ, శ్రీరంజని సీనియర్, కన్నాంబ, పి.శాంతకుమారి , బాలామణి తదితరులు నటించగా, ఆకుల నరసింహారావు సంగీతం అందించారు. తెలుగు సినిమా ప్రపంచంలో మొదటి తరం సినిమాలైన?బాలనాగమ్మ (1942) లో కార్యవర్ధి రాజూ

(బాలనాగమ్మ భర్త)గా, ద్రౌపదీ మాన సంరక్షణ (1936), పాడుకా పట్టభిషేకం (1945), సారంగధర 1937 తదితర సినిమాలలో నటించారు. కూచిపూడి నాట్యకళకు ఎనలేని సేవ చేశారు. ప్రభుత్వ సాయంతో కూచిపూడి గ్రామంలో సిద్ధేంద్ర కళాక్షేత్రం నెలకొల్పి నిర్వహించారు. కూచిపూడి నాట్య కళ గురించి ప్రముఖ పత్రికలలో వ్యాసాలు రాసి దాని ప్రాధాన్యాన్ని అందరికీ తెలియ జేశారు. 1956 లో ఆకాశవాణిలో నాటక ప్రయోక్తగా పనిచేసి వివిధ నాటకాలను, నాటికలను ప్రసారం చేశారు. నాయింట్లో కూడా ప్రవేశించినదే, గుక్కెడు నీళ్లు, పందిలి క్రింద, స్నేహ లతాదేవి తదితర కథలను భారతి, గృహలక్ష్మి, ప్రవాహ వాణి, విశాలాంధ్ర తదితర పత్రికలలో రాశారు. ఆటపాక గ్రామంలో ఒక శివాలయాన్ని, ఒక చెరువును తవ్వించడమే కాకుండా ఒక వేద పాఠశాలను కూడా స్థాపించారు. 1964లో కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం ఆయన 1964 లో "కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు"ను పొందారు. ఉత్తమ నటనకు "రాష్ట్రపతి అవార్డు" లభించింది. ఆయనకు ఏడుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆయన జన్మ శతాబ్ది ఉత్సవాలను హైదరాబాదులో 2006-07 సంవత్సరాలలో ఘనంగా నిర్వహించారు. బందా కనక లింగేశ్వరరావు 1968 డిసెంబర్ 3 న మరణించారు.

జనసేన గూటికి సుచరిత



గుంటూరు, జనవరి 19, పెన్ పవర్:
ఏపీలో రాజకీయాలు విచిత్రంగా మారుతున్నాయి.కూటమి అధికారంలోకి వచ్చి 19 నెలలు అవుతోంది. మరోవైపు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపడేందుకు చేయని ప్రయత్నం అంటూ లేదు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఆ పార్టీలో ఉన్న చాలామంది నేతలు కూటమి పార్టీల్లో చేరారు. అయితే ఇటీవల ఆ చేరికలు తగ్గుముఖం పట్టాయి. అయితే సంక్రాంతి తర్వాత చాలామంది వైసిపి నేతలు పార్టీకి గుడ్ బై చెబుతారని ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోని మహిళా నేతలకు ప్రాధాన్యత తగ్గినట్లు వార్తలు వస్తున్నాయి. అందుకే వారు పార్టీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు టాక్ నడుస్తోంది. ముఖ్యంగా గుంటూరు జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి పార్టీకి రాజీనామా చేస్తారని పొలిటికల్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీఆవిర్భావం నుంచి జగన్ వెంట అడుగులు వేస్తున్న చాలామంది నేతలు ఉన్నారు. అటువంటి వారిలో గుంటూరు జిల్లాకు చెందిన మేకతోటి సుచరిత ఒకరు. దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆమెకు ఎంతగానో ప్రోత్సాహం అందించారు. జడ్పిటిసి సభ్యురాలిగా అవకాశం ఇచ్చారు. 2009లో ఆమె తొలిసారిగా గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహంతోనే అసెంబ్లీలో అడుగు పెట్టారు. అందుకే ఆయన అకాల మరణంతో కుమారుడు జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. అయితే ఉప ఎన్నికల్లో మరోసారి విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా రెండోసారి పోటీ చేసి ఓడిపోయారు. 2019లో మూడోసారి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచేసరికి జగన్మోహన్ రెడ్డి తన మంత్రివర్గంలోకి తీసుకున్నారు. 2024 ఎన్నికల్లో నాలుగో సారి వైసిపి అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు మేకతోటి సుచరిత

కొంతకాలంగా పొలిటికల్ గా సైలెంట్ గా ఉన్నారు సుచరిత మొన్నటి ఎన్నికల్లో ప్రత్తిపాడు బదులు తాడికొండ నుంచి పోటీ చేశారు. అది ఎంత మాత్రం ఆమెకు అంగీకారం కాదు. ఎందుకంటే 2009 నుంచి ఆమె ప్రత్తిపాడు నుంచి పోటీ చేస్తూ వచ్చారు. 2019లో అదే నియోజకవర్గంలో నుంచి గెలిచేసరికి జగన్ మంత్రివర్గంలో హోం మంత్రి పదవి అందుకున్నారు. కానీ విస్తరణలో భాగంగా రెండునర ఏళ్ళకే మంత్రి పదవి పోగొట్టుకున్నారు. అయితే తనను మంత్రివర్గం నుంచి తొలగించడం పై అసంతృప్తికి గురయ్యారు. పార్టీకి దూరమవుతారని కూడా ప్రచారం నడిచింది. అయినా సరే పార్టీలో కొనసాగుతూ వచ్చారు.

కానీ జగన్మోహన్ రెడ్డి ఆమెను ప్రత్తిపాడు నుంచి తాడికొండ కు మార్చారు. అప్పట్లో కూడా ఆమె అసంతృప్తికి గురైనట్లు వార్తలు వచ్చాయి. అయితే గత 19 నెలల కాలంలో ఆమె యాక్టివ్ గా మారింది తక్కువ. అయితే వైసీపీలో ఉంటే తనకు రాజకీయ భవిష్యత్తు లేదని ఆమె భావిస్తున్నట్లు సమాచారం. అందుకే జనసేనలో చేరేందుకు ఆమె సిద్ధపడుతున్నట్లు ప్రచారం నడుస్తోంది. సంక్రాంతి తర్వాత ఆమె జనసేన లో చేరడం ఖాయమని టాక్ నడుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

కోట్ల ఫ్యామిలీ దూరమేనా

కర్నూలు, జనవరి 19 పెన్ పవర్:
టీడీపీ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి పార్టీ అధినాయకత్వంపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఆయన గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు. పార్టీ అధినాయకత్వాన్ని కలిసే ప్రయత్నం కూడా కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి చేయడం లేదట. దీంతో డోన్ నియోజకవర్గంలో మాత్రమే కాదు కర్నూలు జిల్లాలో కోట్ల మౌనంపై అనేక ఊహాగానాలు ఊపందుకుంటున్నాయి. మాజీ ముఖ్యమంత్రి కుమారుడు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎన్నికల ముందు వరకూ యాక్టివ్ గా తిరిగిన ఆయన ఎమ్మెల్యే అయిన తర్వాత మాత్రం పూర్తిగా నిరాశలో మునిగిపోయారు. కర్నూలు జిల్లాలో కోట్ల కుటుంబానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. అదే సమయంలో కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి కేంద్ర మంత్రిగా, పార్లమెంటు సభ్యుడిగా ఒక వెలుగు వెలిగారు.

..2024 ఎన్నికలకు ముందు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి తన కుటుంబంతో కలసి టీడీపీలో చేరారు. తన తండ్రి సుదీర్ఘకాలం కొనసాగిన కాంగ్రెస్ పార్టీని వదిలేసి ఆయన టీడీపీ కండువా కప్పుకున్నారు. రాష్ట్ర విభజనకు కారణమైన కాంగ్రెస్ కు రాష్ట్రంలో పుట్టగతులు లేవని భావించిన ఆయన ఆ నిర్ణయం తీసుకున్నారని అంటారు. వైసీపీలోకి వెళ్లడం ఇష్టంలేక టీడీపీలోకివచ్చారు. కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి రాకతో కర్నూలు జిల్లాలో టీడీపీకి అదనపు బలం చేకూరినట్లయింది. అయితే దే సమయంలో తనకు శత్రువుగా భావించే కేఈ కృష్ణమూర్తి కూడా రాజకీయంగా రిటైర్ అయ్యారు. కానీ కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి మాత్రం ఎమ్మెల్యే సీటును అయిష్టంగానే తీసుకున్నారు. గెలిచిన తర్వాత మంత్రి పదవి వస్తుందని ఆశిస్తే, తన రాజకీయ అనుభవమంత వయస్సు లేని టీజీ భరత్, బీసీ జనార్థన్ రెడ్డి మంత్రి కావడం ఆయనను కుదురునివ్వకుండా చేస్తుందంటున్నారు.వచ్చే ఎన్నికల నాటికి తాను కూడా రాజకీయంగా వైదొలగాలని కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి నిర్ణయించుకున్నట్లు సమాచారం. అవసరమైతే తన సతీమణిని రాజకీయాల్లో కొనసాగించాలని, తాను మాత్రం రాజకీయాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నట్లు ఆయన సన్నిహితుల వద్ద పదే పదే ప్రస్తావిస్తున్నారట. తాను ఇక ఏ ఎన్నికల్లో పోటీ చేయబోనని కుటుంబంలోని ముఖ్యులతో పాటు సన్నిహితులకు కూడా కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి చెబుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం డోన్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఉన్నా అక్కడికే పరిమితమయిన కోట్ల ఇక రానున్న ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేదంటున్నారు. రాజకీయాలు ఇక తనకు పనికి రావని కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి సన్నిహితుల వద్ద అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. మరి కోట్ల నిర్ణయం ఎలా ఉంటుందన్నది చూడాలి.

ఇచ్ఛాపురం కోసం మాస్టర్ ప్లాన్

శ్రీకాకుళం, జనవరి 19, పెన్ పవర్: వైసీపీ ఎన్ని రకాలుగా విశ్వ ప్రయత్నాలు చేస్తున్నా..ఇచ్ఛాపురంలో వైసీపీ జెండా ఎగరడం లేదు. అయితే నేతల గ్రూపుల గోలనే దీనికి కారణమంటూ చెప్పుకొస్తారు సిక్కోలు వైసీపీ లీడర్లు. ఇచ్ఛాపురం నుంచి బెందాళం అశోక్ టీడీపీ హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొందుతూ వస్తున్నారు.టీడీపీ ఆవిర్భావం తర్వాత ఇచ్ఛాపురం నియోజకవర్గం ఆ పార్టీకి కంచుకోటగా నిలుస్తోంది. అంతకుముందు కూడా కాంగ్రేసేతర అభ్యర్థులే ఎక్కువగా అక్కడ గెలుస్తూ వచ్చారు. వైసీపీ ఆవిర్భావం తర్వాత కాంగ్రెస్ ఓటు బ్యాంకు వైసీపీవైపు మళ్లింది. కానీ టీడీపీ టీడీపీ ఓటు బ్యాంకు మాత్రం ఆ పార్టీకే ఉంది.ఫ్యాన్ పార్టీ ఆవిర్భావం తర్వాత ఇచ్ఛాపురం నుంచి 2014లో వైసీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన నర్తు రామారావు ఓటమి చెందగా..2019లో పిరియా సాయిరాజ్‌ను పోటీకి దింపింది వైసీపీ. అతను కూడా ఓటమి చెందడంతో 2024 సార్వత్రిక ఎన్నికల ముందు సాయిరాజ్‌ను సమన్వయకర్తగా తప్పించి ఆ బాధ్యతలను ఆయన సతీమణి పిరియా విజయమ్మకు అప్పజెప్పారు. 2024 ఎన్నికల్లో విజయమ్మకి కూడా ఓటమి తప్పలేదు. దీంతో హ్యాట్రిక్ కొట్టారు బెందాళం అశోక్.ఈ సారి ఇచ్ఛాపురంలో ఎలాగైనా పాగా వేయాలని అధినేత జగన్ పట్టుదలతో ఉన్నారని చెప్పుకుంటున్నారు వైసీపీ నేతలు. వచ్చే ఎన్నికల్లో ఇచ్ఛాపురం నుంచే వైసీపీ విజయ ఢంకా మోగించాలని పార్టీ నేతలకు టార్గెట్ ఫిక్స్ చేశారట వైసీపీ పెద్దలు. దానికి అనుగుణంగానే గేమ్ ప్లాన్ మారుస్తున్నారట. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జనాభా పరంగా రెడ్డిక సామాజిక వర్గంతో పాటు యాదవ, కళింగ, అగ్నికుల క్షత్రియ వర్గాల ఓటర్లు ఎక్కువగా ఉంటున్నారు.
అయితే గత రెండుసార్లు..కళింగ సామాజిక వర్గానికి చెందిన పిరియా సాయిరాజ్ కుటుంబానికే ఎమ్మెల్యే టికెట్ కేటాయించారు జగన్. రెండో సామాజిక వర్గం అయిన యాదవ్‌కు ఎమ్మెల్సీని ఇచ్చారు. అయినప్పటికీ నేతల మధ్య పొసగడం లేదు. గ్రూపు రాజకీయాలు రోజు రోజుకు పెరుగుతూనే ఉన్నాయి..తప్ప తగ్గడం లేదు. దీంతో మరో కొత్త నేతకు అవకాశం ఇచ్చారంటున్నారు అక్కడ క్యాడర్. సీనియర్ నేతలను పక్కన పెట్టి..గత ప్రభుత్వ హయాంలో రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేసిన శ్యాంప్రసాద్ రెడ్డికి..ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారంటున్నారు. ఇచ్ఛాపురం వైసీపీ బాధ్యతలు శ్యాంప్రసాద్ రెడ్డికి ఇవ్వడం వెనుక పెద్ద స్కెచ్చే ఉందనే చర్చ జరగుతుంది. సిక్కోలు జిల్లాలో..ఎమ్మెల్యేగా ఉన్న బెందాళం అశోక్ కళింగ సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో గత రెండు సార్లు కూడా కళింగ సామాజిక వర్గానికి చెందిన పిరియా సాయిరాజ్ దంపతులను బరిలో దించింది. అది పెద్దగా వర్కౌట్ అవ్వలేదు.దీంతో నియోజకవర్గంలో అధిక జనాభా కలిగిన రెడ్డిక సామాజికవర్గంపై ఫోకస్ పెట్టిందట వైసీపీ. రెడ్డిక వర్గం డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉండటంతో..ఈ సారి వైసీపీ పెద్దల ప్లాన్ వర్కౌట్ అవుతుందనే అంచనాలున్నాయట. ఇప్పటికే యాదవ సామాజిక వర్గానికి చెందిన కీలక నేత నర్తు రామారావుకి ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టారు.దీంతో రెడ్డిక, కళింగ, యాదవ సామాజిక వర్గాలు తమకి కలిసి వస్తాయన్న లెక్కల్లో వేసుకుంటున్నారట ఫ్యాన్ పార్టీ లీడర్లు. అయితే గ్రూప్ రాజకీయాలకు పెట్టింది పేరుగా ఉన్న ఇచ్ఛాపురం వైసీపీలో శ్యాంప్రసాద్ రెడ్డి ఎలా నెగ్గుకు వస్తారనేది చర్చనీయాంశంగా మారింది. అందరినీ ఒక్కతాటిపైకి తీసుకొస్తే తప్ప విజయం అంత ఈజీ కాదని పొలిటికల్ వర్గాల్లో చర్చ నడుస్తుంది. మరి వైసీపీ కొత్త స్కెచ్ ఎంతవరకు సక్సెస్ అవుతందో చూడాలి మరి.

అణు శక్తి యుగంలో భారత్ ప్రస్థానం

హైదరాబాద్ పెన్ పవర్: 1957 భారతదేశ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం పొందింది. ఆ ఏడాది, భారతదేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురోగతి సాధిస్తూ, ప్రపంచ అణుశక్తి రంగంలో తన తొలి అడుగును పెట్టింది. ముంబై సమీపంలోని ట్రాంబేలో, అప్సర పేరుతో భారత దేశపు తొలి అణు రియాక్టర్‌ను ప్రారంభించడం ఈ ప్రయాణంలో అత్యంత కీలక ఘట్టంగా నిలిచింది.అప్సర రూపకల్పన, నిర్మాణంలో ప్రధానంగా భారత శాస్త్రవేత్తల కృషి ఉంది. అయితే, ఈ ప్రయత్నానికి బ్రిటన్ నుంచి కూడా సహకారం అందింది. ఇంధన సరఫరా: బ్రిటన్ నుండి అవసరమైన యురేనియం అందించ బడింది. సాంకేతిక సహాయం: కొన్ని మౌలిక సదుపాయాలకు మార్గదర్శకత అందించారు. అప్సరను ప్రధానంగా అణు శాస్త్రంలో పరిశోధన కోసం ఉపయోగించారు. ఇది భారత శాస్త్రవేత్తలకు న్యూట్రాన్ భౌతిక శాస్త్రం, రేడియేషన్ పై పరిశోధనలు చేయడానికి వేదికగా మారింది. మెడికల్ ఐసోటోప్స్ ఉత్పత్తి కోసం అప్సర ముఖ్యంగా ఉపయోగ పడింది. ఈ ఐసోటోప్స్ క్యాన్సర్ చికిత్స మరియు వైద్య పరీక్షలలో కీలక పాత్ర పోషించాయి. శాస్త్రవేత్తల శిక్షణ కోసం అప్సర ఒక జీవంత ప్రయోగశాలగా పనిచేసింది.అప్సర నిర్మాణం భారత శాస్త్రవేత్తల స్వదేశీ ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. భారత ప్రభుత్వం1954 జనవరి 3 న అణు పరిశోధన కోసం అటామిక్ ఎనర్జీ ఎస్టాబ్లిష్ మెంట్, ట్రాంబే అనే సంస్థను స్థాపించింది. జహంగీర్ భాభా మరణించాక బాభా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ గా పేరు పెట్ట బడింది. డాక్టర్ హోమీ జహంగీర్ భాభా, భారత అణుశక్తి రంగ పితామహుడు, దీనిని రూపొందించడంలో కీలక పాత్ర పోషించారు.1957లో అప్పటి భారత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అప్సర పేరు పెట్టి,జాతికి అంకితం చేశారు. 1957లో అప్సర ప్రారంభం, భారతదేశాన్ని అణు శక్తి కలిగిన దేశాల జాబితాలో చేర్చింది. దీనిద్వారా, శాంతిమయ వినియోగాల కోసం అణుశక్తిని ఉపయోగించడానికి భారత దేశం ప్రామాణికంగా ఎదిగింది. భారతదేశం ఎప్పుడూ అణుశక్తిని శాంతి ప్రయోజనాల కోసం మాత్రమే వినియోగిస్తామని ప్రపంచానికి స్పష్టం చేసింది. అప్సర దీనికి ప్రథమ ఉదాహరణ. 2009లో, అప్సర పాత రూపాన్ని నిలిపివేసి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అప్సర-యూ (ఒజూబజీతీజీ-ఒ) పేరిట రియాక్టర్‌ను పునర్నిర్మాణం చేశారు. అప్సర-యూ ప్రత్యేకతలు: ఇది మరింత శక్తివంతమైనది, తక్కువ ఇంధన వినియోగంతో ఎక్కువ ప్రయోజనాలను అందించగలదు.1957లో మొదలైన ఈ ప్రయాణం, భారతదేశం పలు అణు రియాక్టర్ల నిర్మాణం వైపు దారితీసింది. ధ్రువ, కామిని, చంద్ర వంటి రియాక్టర్లు తదుపరి దశల్లో స్థాపించ బడ్డాయి. 1957లో అప్సర రియాక్టర్ ప్రారంభం, భారతదేశ శాస్త్రసాంకేతిక రంగ చరిత్రలో ఒక ముఖ్య ఘట్టం. ఇది భారత దేశానికి అణు శక్తి స్వయం సమృద్ధి కల్పించి, ప్రపంచ స్థాయి పరిశోధనలో నడుపు పాత్ర పోషించేలా చేసింది. ఈ ప్రాజెక్ట్, శాస్త్రవేత్తల దీక్షకు, భారత అణు శక్తి ప్రయోగాల విజయం, సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది.

టీడీపీలో ఏం జరుగుతోంది...

విజయవాడ, జనవరి 19, పెన్ పవర్: ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావాలని చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారు. కానీ ఆయన శ్రమను ప్రజలు గుర్తిస్తున్నారు కానీ ఎమ్మెల్యేలు మాత్రం గుర్తించడం లేదు.ఎక్కువ మంది శాసనసభ్యులు తరచూ వివాదాల్లో చిక్కుకుంటున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పిగా మారారు. ఎమ్మెల్యేల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటూ హెచ్చరికలు చేస్తున్నప్పటికీ వారి వ్యవహార శైలిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యేలు నిజంగా దోపిడీకి దిగుతున్నారన్న విమర్శలు సొంత పార్టీ కార్యకర్తల నుంచే వినిపిస్తున్నాయి. గతంలో ప్రధాన మీడియా ద్వారా వచ్చే విమర్శలు.. ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా వస్తున్నాయి.ఇటీవల మంగళగిరి కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి అందిన నివేదిక మేరకు దాదాపు 48 మంది ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేదని, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ పాల్గొనడం లేదని స్పష్టం చేసింది. అయితే వారిని చంద్రబాబు హెచ్చరించినట్లుగా వార్తలు వచ్చినప్పటికీ ఎమ్మెల్యే పనితీరు మాత్రం గాడిన పడలేదన్నది వాస్తవం. ఎందుకంటే ప్రతి పనికీ పర్సంటేజీలు. ప్రతి కార్యక్రమంలో అవినీతి. సొంత పార్టీ నేతలను కూడా వారు వదలకుండా దోపిడీకి తెరతీస్తున్నారన్న విమర్శలున్నాయి. చంద్రబాబు చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్ల, లోకేశ్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఎమ్మెల్యేలు కొందరు నిర్భీతిగా తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ప్రచారం పార్టీలోనే జరుగుతుంది.తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని చిన్నిల మధ్య తలెత్తిన వివాదంలోనూ ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కొలికపూడి శ్రీనివాసరావు ఎంపీపై తీవ్రమైన ఆరోపణలు చేశారు. అయినా సరే ఆయనను పిలిచి మందలించిన సందర్భం లేదు. అలాగే అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్ ప్రసాద్ విషయంలో కానీ, ఉత్తరాంధ్ర జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేల పనితీరుపై అక్కడి కార్యకర్తలే నేరుగా ఆరోపణలు చేస్తున్నారు. అయినా పార్టీ నాయకత్వం పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఎమ్మెల్యేల పనితీరుతో పార్టీ బాగా డ్యామేజీ అయింది. ఇక రానున్న కాలంలో ఇలాంటి మెతక వైఖరిని అవలంబిస్తే మాత్రం ఖచ్చితంగా వచ్చే ఎన్నికల్లో టీడీపీ కి నష్టం తప్పదన్న సంకేతాలు ఆ పార్టీ కార్యకర్తల నుంచే వినిపిస్తున్నాయి.

జేసీ వర్సెస్ కేతిరెడ్డి...



అనంతపురం, జనవరి 19, పెన్ పవర్: ఎవ్వరికీ భయపడే ముచ్చటే లేదు. ఎట్లైతే గట్లాయె. ఏడికైతే గాడికాయే. బట్ వన్ కండీషన్. నీ ఫ్యామిలీ..నా ఫ్యామిలీనే తేల్చుకుందాం..అంటూ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డికి సవాల్ చేశారు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి. రాయలసీమ పౌరుషంపై జేసీ ప్రభాకర్‌రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించిన పెద్దారెడ్డి..డేట్ టైం ఫిక్స్ చెయ్ అంటూ..బాలయ్య సినిమాలోని పాపులర్ మాస్ డైలాగ్‌ను రిపీట్ చేశారు.దీంతో తాడిపత్రిలో మళ్లీ రాజకీయ వేడి రాజుకుంటుంది. అటు జేసీ ఫ్యామిలీ ఇటు కేతిరెడ్డి పెద్దారెడ్డి హైవోల్టేజ్ పొలిటికల్ ఫైట్‌కు దిగుతున్నారు. ఇదంతా రాయలసీమ పౌరుషం మీద డిబేట్ అంటున్నారు. నేను రెడీ అంటే నేను రెడీ అంటూ..మీసాలు మెలేస్తున్నారు. లేటెస్ట్‌గా రాయలసీమ పౌరుషంపై తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నానని కేతిరెడ్డి పెద్దారెడ్డి స్పష్టం చేశారు. అంతే కాదు ఎక్కడైనా ఎప్పుడైనా తాను చర్చకు రెడీ అంటూ బింగ్ సౌండ్ చేశారు పెద్దారెడ్డి.తాడిపత్రిని గత మూడు దశాబ్దాలుగా జేసీ ఫ్యామిలీ పాలిస్తే..తాను ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్నానని..రెండు పాలనలపై చర్చకు సిద్ధమంటూ ఛాలెంజ్ చేస్తున్నారు కేతిరెడ్డి. డేట్ టైం మీరే ఫిక్స్ చేయండి అని జేసీ ప్రభాకర్ రెడ్డికే చాన్స్ ఇచ్చారు. అంతేకాదు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. తాడిపత్రిలో అయినా లేక రాయలసీమ జిల్లాల్లో ఎక్కడైనా తాను చర్చకు రెడీగా ఉన్నాను అని ప్రతి సవాల్ చేశారు పెద్దారెడ్డి.జేసీ ఫ్యామిలీ పాలనలో మాజీ ఎమ్మెల్యేగా తనకే స్వేచ్ఛగా తిరిగే అవకాశం లేదని పెద్దారెడ్డి అంటున్నారు. తాను నియోజకవర్గంలోకి అడుగు పెట్టకుండా జేసీ ప్రభాకర్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని పాలిస్తున్నారని ఫైర్ అవుతున్నారు. అలాంటి జేసీ ప్రభాకర్‌రెడ్డి రాయలసీమ పౌరుషం అంటూ తనకు సవాల్ విసరడం మీద తాను పాజిటివ్‌గానే రియాక్ట్ అవుతున్నానని..బహిరంగ చర్చకు తాను ఎప్పుడూ సిద్ధమే అని కేతిరెడ్డి ప్రకటించారు.అయితే ఓపెన్ డిబేట్‌కు ఓ కండీషన్ పెట్టారు పెద్దారెడ్డి. బహిరంగ చర్చకు జేసీ కుటుంబం, తన కుటుంబం మాత్రమే హాజరు కావాలని పెద్దారెడ్డి షరతు పెట్టారు. రెండు కుటుంబాల సమక్షంలోనే ఎవరి పాలన ఎలా ఉందనేది తేల్చుకుందామని అంటున్నారు. తాను ఎవరికీ దేనికీ భయపడేవాడిని కానని అంటున్న పెద్దారెడ్డి..దేఖ్ లేంగే అంటూ సవాల్ విసిరారు.గత కొన్ని రోజులుగా తాడిపత్రి చాలా సెన్సిటివ్ ఏరియాగా మారిపోయింది. ఎన్నికల రిజల్ట్ తర్వాత..అక్కడ రాజకీయ వేడి ఇంకా రాజుకుంది. ఆ తర్వాత కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి రాకుండా పోలీసులు అడ్డుకోవడం..మరింత రచ్చకు దారితీసింది. ఈ క్రమంలోనే కోర్టుకెళ్లి ఆర్డర్స్ తెచ్చుకుని పోలీస్ బలగాల మధ్య పెద్దారెడ్డి తాడిపత్రిలోకి ఎంట్రీ ఇవ్వడం ఇంకా హాట్ టాపిక్ అయింది.ఇక అప్పటి నుంచి జేసీ ఎం పెద్దారెడ్డి అన్నట్లుగా..సినిమాలో క్లైమాక్స్ రేంజ్‌లో పాలిటిక్స్ హీటెక్కుతున్నాయి. ఇద్దరు నేతలు సవాళ్లు, ప్రతి సవాళ్లు చేసుకోవడంతో తాడిపత్రి ఫైట్ నెక్స్ట్ లెవల్‌కు చేరుకుంటుంది. పెద్దారెడ్డి కామెంట్స్‌పై జేసీ ఎలా రియాక్ట్ అవుతారో.? బిగ్ డిబేట్‌కు సిద్ధపడుతారో.? లేక డైలాగ్‌వార్‌కే పరిమితం అవుతారో చూడాలి మరి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

జానపద చిత్ర బ్రహ్మ బి.విఠలాచార్య

పాతతరం, కొత్తతరం తరం ఏదైనా తెలుగు సినిమా ప్రేక్షకులకు బి.విఠలాచార్య పేరు పరిచయం చేయాల్సిన అవసరం లేదంటే అతిశయోక్తి కాదేమో. నట సార్వభౌముడు నందమూరి, కత్తి వీరుడు కాంతారావు ను సినీ ప్రేక్షకుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయే రీతిలో సినిమాలు తీసి, వారికి మాస్ ఫాలోయింగ్ కల్పించింది విఠలాచార్య అనడంలో అతిశయోక్తి కి తావే లేదేమో. మాయలూ, మంత్రాలూ, ఇంద్ర మహేంద్ర జాలాలు, మానవాతీత శక్తులు, టక్కుటమార విద్యలూ, క్షుద్ర శక్తులు, తన చిత్రాలలో చూపించే సాటి రాని మేటి ప్రతిభా శాలి ఆయన. ఒక చిత్రానికి, మరో చిత్రానికి పోలిక లేకుండా, చిత్ర విచిత్ర వినూత్న ఆలోచనలను సాకారం చేసిన అపూర్వ సన్నివేశాల సృష్టికర్త ఆయన. అందుకే విఠలాచార్య జానపద చిత్ర బ్రహ్మ గా సుపరిచితుడు. ఆయన సినిమాల్లో నటీ నటులే కాకుండా జంతువులు, పక్షులు, అపరిచిత రూపాలు పాత్ర దారులై ఉండడం విశేషం. దర్శకత్వ ప్రతిభకు తోడు, నిర్మాతగా ప్రేక్షకులను ఆకర్షించే సెట్టింగులను రూపొందించడం ప్రత్యేకం. బి.విఠల ఆచార్య లేదా బి.విఠలాచార్య (జనవరి 20, 1920 – మే 28, 1999) 'జానపద బ్రహ్మ' అని పేరు పొందిన తెలుగు సినిమా దర్శకులు, నిర్మాత. తెలుగు, తమిళ, కన్నడ భాషలలో 70 చిత్రాలను రూపొందించిన ఆయన 1920 జనవరి 28 న కర్ణాటకలో ఉడిపిలో జన్మించారు. కొంతకాలం సర్కస్ కంపెనీలో జంతువుల ఆలనా పాలనా చూడడం చేత వాటిని తన చిత్రాలలో ఎలా వినియోగించు కోవాలో తర్ఫీదు పొందాడు. ఆయన ఎన్నో జానపద చిత్రాలకు అద్భుతమైన దర్శకత్వం వహించాడు. అప్పటి పరిమితమైన సాంకేతిక పరిజా&జనముతో ఆయన చూపించిన ప్రతిభ అసామాన్య మైనది. చాలా కొద్ది ఖర్చుతో ఆయన కనుల కింపైన జానపద కళా ఖండాలను రూపొందించాడు. 1942 లో చిత్రరంగ ప్రవేశము చేసిన ఆయన నిర్మాతగా డి.శంకర్ సింగ్ తో కలిసి దాదాపు 18 చిత్రాలను తమ మహాత్మా పిక్చర్స్ పతాకముపై నిర్మించారు. వీటిలో సాంఘిక చిత్రాలే అధికం. తొలిసారిగా తెలుగులో 1953లో షావుకారు జానకి ప్రధాన పాత్ర పోషించిన కన్యాదానం చిత్రానికి దర్శకత్వము వహించాడు. క్రమంగా తెలుగులో నిర్మాతగా, దర్శకునిగా కూడా రాణించి అనేక జానపద చిత్రాలను తీశాడు. అయన దర్శకత్వం వహించిన చిత్రాలలో 15 చిత్రాలు నందమూరి తారక రామారావు నటించినవే అందులో 5 చిత్రాలను విఠలాచార్యే స్వయంగా నిర్మించాడు. ఆయన చిత్రాలలో హేతుబద్ధతకు తావే లేదు. 'అదెందుకు, ఎలా జరిగింది?' అన్న ప్రశ్నలు ఉత్పన్నం కావు. ప్రేక్షకులను ఆహ్లాద పరచడమే ముఖ్యం. తెలుగు చందస్సుకు సంబంధించిన "యమాతారాజభానసలగం" అనే సూత్రాన్ని రాజనాల మాంత్రికుని తాంత్రిక మంత్రంగా పెట్టినా, ప్రేక్షకులు ఆనందించారు, ఆదరించారు. అందుకే ప్రజల నాడిని, వారు ఇష్టపడే అంశాలను దొరికి పుచ్చుకుని, ట్రిక్కులు చేయించడంలో అందె వేసిన చేయిగా ఖ్యాతిని గడించాడు. సినిమా నిర్మాణంలో 'పొదుపు'ను ఎలా చేయాలో, అతి తక్కువ ఖర్చుతో ఎలా సినిమా నిర్మించాలో ఆయనకు తెలిసినంత మరెవరికీ తెలియదేమో. అలా వ్యాపారాత్మక చిత్రాలు చేసి విజయం సాధించి, ఆ కళలో తనకు ఎవరూ సాటి రారని రుజువు చేసుకున్నాడు. ఎన్నెన్నో దృశ్యాలు...అన్నీ ఒకే ఒక సెట్లో ఇమిడి పోయేవి. సామాన్య జనానికీ, సినిమా చూట్టంలో లీనమైపోయే ప్రేక్షకులకు ఈ తేడాలు అక్కర్లేదని విఠలాచార్య విశ్వసించేవారు. అలాగే కాస్ట్యూమ్స్, ఆభరణాలూ, ప్రతి సినిమాకీ మార్చవలసిన అవసరం లేదు ముఖ్యపాత్రకి తప్ప అని నమ్మి చేసి చూపించాడు. 'నటీనటుల కాల్ షీట్లు గల్లంతైతే, వాళ్లని చిలకలుగానో, కోతులుగానో మార్చడం ఆయనకే చెల్లింది' అని ఒక సందర్భంలో కాంతారావు వివరించాడు. కన్యాదానం (1955), పెళ్ళి మీద పెళ్ళి (1959), కనకదుర్గ పూజా మహిమ (1960), బందిపోటు (1963), అగ్గి బరాటా (1966), చిక్కడు దొరకడు (1967), నిన్నే పెళ్ళాడుతా (1968) – ఈ చిత్రానికి కథ, చిత్రానువాదం, బి.విఠలాచార్య, దర్శకత్వం బి.వి.శ్రీనివాస్; భలే మొనగాడు (1968), ఆలీబాబా 40 దొంగలు (1970), లక్ష్మీ కటాక్షం (1970), విజయం మనదే (1970), రాజకోట రహస్యం (1971), జగన్మోహిని (1978), గంధర్వ కన్య (1979), మదన మంజరి (1980) తదితర చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించారు. విఠలాచార్య ఎంతో దక్షతా, బాధ్యతా గల నిర్మాత. నటీ నటులకు, టెక్నీషియన్లకు తాను ఇస్తానన్న మొత్తాన్ని విభజించి ప్రతినెలా ఒకటో తేదీకల్లా – చిన్నా, పెద్దా అందరికీ చెక్కులు అందించడం ఆయనకే చెల్లింది. టైముకి ముందుగానే షూటింగ్ పూర్తిచేసి, అనుకున్న తేదీకి సినిమా విడుదల చెయ్యడం ఆయనకే సాధ్యమైంది. అలాగే నటీనటులకి కాల్ షీట్స్ అడ్జస్ట్ చెయ్యడంలో కూడా ఆయన 'నంబర్‌వన్' అనిపించు కునేవాడు. ముందుగా చెబితే, ఒప్పుకున్న డేట్స్‌ని అటూ, ఇటూగా మార్చి చిన్న, పెద్ద నటీనులందిరికీ, సహాయపడేవాడు. వేషాలకోసం ఆఫీసులకి వెళ్తే విఠలాచార్య వచ్చిన ప్రతీ ఒక్కరినీ తన గదిలోకి పిలిచి, కూచోబెట్టి కాఫీ ఇచ్చి మాట్లాడి పంపించే వాడు. ప్రేక్షకుల హృదయాలలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న జానపద చిత్ర బ్రహ్మ 1999, మే 28 న 80 యేళ్ల వయసులో మద్రాసులోని కన్ను మూశారు.

పెంగ్విన్ పక్షి జాతి అంతరించనున్నదా!

హైదరాబాద్ పెన్ పవర్: చూపులకు అందంగా, నలుపు తెలుపుల సమ్మిళిత వర్ణాలతో బొద్దుగా, ముద్దుగా కనిపించే ఎగురలేని అమాయక పెంగ్విన్ జల పక్షుల సంఖ్య రోజు రోజుకు తరుగుతూ అంతరించే అంచున ఉన్నట్లు తాజా అధ్యయనాలు వెల్లడించడం ఒక జీవవైవిధ్య విఘాత హెచ్చరికగా భావించాలి. అన్ని రకాల జీవజాతుల మనుగడతోనే మానవాళి పర్యావరణ హిత ఉజ్వల భవిత ఆధారపడి ఉందని మనకు తెలుసు. పెంగ్విన్ అనబడే నీటిలో నివసించే పక్షులు అధికంగా దక్షిణ అర్ధగోళం(సదరన్ హెమిస్ఫియర్)లో సహజంగా కన్పిస్తాయి. పెంగ్విన్‌లలో దాదాపు 20 రకాల జాతులు ఉన్నాయి. వీటిలో అతి పెద్ద రకాలను 'ఎంపెరర్ పెంగ్విన్'లుగా, అతి చిన్న జాతి పెంగ్విన్లు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ తీరప్రాంతాల్లో కనిపిస్తాయి. వీటి సహజ నలుపు తెలుపు వర్ణాలు సముద్ర జలాల్లో వీటిని వేటాడే జీవుల నుంచి కనిపించకుండా (క్యామోఫ్లాజ్) ఉండడానికి దోహదపడతాయి. పక్షుల వర్గంలో ఉన్న పెంగ్విన్‌లు ఎగురలేనప్పటికీ అద్భుతంగా ఏకధాటిగా 60 మైళ్ల వరకు తమ రెక్కల సహాయంతో ఈదడం, 530 మీటర్ల తోతు వరకు డైవింగ్ చేయగలవు. వేగంగా ఈదగల 'జెండా పెంగ్విన్'లు గంటకు 35 కిమీ దూరం ప్రయాణం చేయగలవు. పెంగ్విన్ పక్షి జాతులను కాపాడుకోవడానికి సామాన్య జనాల్లో అవగాహన కల్పించడానికి ప్రతి ఏట 20 జనవరిన "పెంగ్విన్ అవగాహన దినం" పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. మానవ కదలికలు లేని ప్రదేశాల్లో స్వేచ్ఛగా జీవించగల పెంగ్విన్ పక్షుల మనుగడ కాలక్రమంలో ప్రశ్నార్థకంగా మారుతున్నది. పర్యావరణ కాలుష్యం, భూతాపం, ప్రతికూల వాతావరణ మార్పులు, అతిగా చేపలు పట్టడం, అవి నివసించే ప్రాంతాల్లో మానవ కదలికలు పెరగడం, మానవ అనవసర కదలికలతో పెంగ్విన్ పక్షుల ఉనికి ప్రమాదంలో పడుతున్నది. పర్యావరణ కాలుష్యాన్ని గుర్తించడానికి పెంగ్విన్ పక్షుల విచిత్ర ప్రవర్తనలు గమనించడం జరుగుతుంది. పెంగ్విన్ అవగాహన దినం–2025 వేదికగా పెంగ్విన్ పక్షుల గూర్చి వివరాలను తెలుసుకోవడం, వాటికి సంబంధించిన వీడియోలను చూడడం, విద్యాలయాల్లో ఈ అరుదైన, అందమైన పక్షుల గూర్చి పోటీలు నిర్వహించడం, సమీప జంతు ప్రదర్శనశాలలకు వెళ్లి పెంగ్విన్ పక్షులను చూసి అబ్బురపడడం, వాతావరణ ప్రతికూల మార్పుల దుష్ప్రభావాలను వివరించడంతో కొనసాగాలి. దశాబ్దాలుగా మానవ తప్పిదాలతో పెంగ్విన్‌ల సంఖ్య గణనీయంగా పడిపోతున్నది. ఈ విపరీత ప్రవర్తనలు ఇలాగే కొనసాగితే పెంగ్విన్‌లను ప్రత్యక్షంగా చూడడం మరిచి వీడియోలు, ఫోటోల్లో మాత్రమే చూసి తృప్తిపడే రోజులు రావద్దని, జీవ వైవిధ్య వ్యవస్థలను కాపాడడమే సురక్షిత మానవ మనుగడకు పునాది అని తెలుసుకుందాం, సౌందర్యరాశి అయిన పెంగ్విన్ పక్షులను అక్కున చేర్చుకుందాం.

స్పెయిన్‌లో ఘోర రైలు ప్రమాదం

హైదరాబాద్ పెన్ పవర్: స్పెయిన్‌లో ఘోర రైలు ప్రమాదం జరిగింది. దక్షిణ అండలూసియా ప్రాంతంలో రెండు హైస్పీడ్ రైళ్లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో 21మంది మరణించగా, 70మందికి పైగా గాయపడినట్లు సీనియర్ అధికారి తెలిపారు. ఆదివారం సాయంత్రం మలగా నుండి మాడ్రిడ్‌కు వెళుతున్న ఒక రైలు ఆడముజ్ సమీపంలో పట్టాలు తప్పి మరో ట్రాక్‌పైకి దూసుకువెళ్లింది. అదే సమయంలో ఎదురుగా వస్తున్న రైలు ఢీకొనడంతో ఘోర ప్రమాదం జరిగినట్లు స్పెయిన్‌కు చెందిన అదిఫ్ రైల్ నెట్‌వర్క్ ఆపరేటర్ ఎక్స్‌లో పేర్కొన్నారు. గాయపడిన వారిలో 30మంది పరిస్థితి విషమంగా ఉందని రవాణా మంత్రి ఆస్కార్ పుయెంటె మీడియాకి వివరించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. మలాగానుండి మాడ్రిడ్ వెళుతున్న రైలులో సుమారు 300మంది దాకా ప్రయాణికులు ఉన్నట్లు రైలు ఆపరేటర్ తెలిపారు. వందలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయారని అన్నారు. ఆడముజ్‌లో జరిగిన విషాదకరమైన రైలు ప్రమాదం దేశానికి తీవ్ర బాధ కలిగించే రోజని స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ పేర్కొన్నారు. ఈ సమయంలో దేశమంతా వారి పక్షాన ఉందని బాధితులకు తెలియజేస్తున్నానని అన్నారు. స్పెయిన్ యూరప్‌లోనే అతిపెద్ద హైస్పీడ్ రైలు నెట్‌వర్క్‌ను కలిగి వుంది. మాడ్రిడ్, బార్సిలోనా, సెవిల్లే, వాలెన్సియా మరియు మలాగాతో సహా ప్రధాన నగరాలను కలుపుతూ 3,000 కిలోమీటర్ల కంటే ఎక్కువ ప్రత్యేక ట్రాక్‌లను కలిగి వుంది.

ట్రంప్ సుంకాలపై ఘాటుగా స్పందించిన ఇయు

హైదరాబాద్ పెన్ పవర్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలపై యూరోపియన్ యూనియన్ దేశాలు శనివారం ఘాటుగా స్పందించాయి. 'ప్రమాదకరమైన దిగజారుడు మురికి' సూచిస్తున్నాయని హెచ్చరించాయి. "సుంకాలు అట్లాంటిక్ సంబంధాలను దెబ్బతీస్తాయి. ప్రమాదకరమైన దిగజారుడు పరిస్థితి'ని ఎదుర్కొనే ప్రమాదం ఉంది. యూరప్ ఐక్యంగా, సమన్వయంతో మరియు సార్వభౌమత్వాన్ని నిలబెట్టుకోవడానికి కట్టుబడి ఉంటుంది" అని యూరోపియన్ యూనియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్, ఇయు కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాలు ఎక్స్‌లో పేర్కొన్నారు. "సుంకాలు యూరప్ మరియు అమెరికాలను పేదలుగా మార్చే ప్రమాదం ఉంది. మన ఉమ్మడి శ్రేయస్సును దెబ్బతీస్తుంది. గ్రీన్‌ల్యాండ్ భద్రత ప్రమాదంలో ఉంటే, దాన్ని నాటో లోపల పరిష్కరించగలము" అని ఆమె పేర్కొన్నారు. సుంకాల ముప్పును చర్చించడానికి యూరోపియన్ యూనియన్‌లోని 27 దేశాల రాయబారులు ఆదివారం అత్యవసరంగా సమావేశం కానున్నారు.

షాపింగ్‌మాల్‌లో అగ్ని ప్రమాదం

హైదరాబాద్ పెన్ పవర్: పాకిస్తాన్‌లో షాపింగ్‌మాల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు మరణించగా, 12మంది గాయపడినట్లు సీనియర్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల ప్రకారం.. పాకిస్తాన్‌లోని దక్షిణ సింధ్ ప్రావిన్స్ రాజధాని కరాచీలోని గుల్‌ప్లాజాలో శనివారం రాత్రి ఈ ఘటన జరిగింది. మాల్‌లో దిగుమతి చేసుకున్న దుస్తులు, ప్లాస్టిక్ గృహోపకరణాలను నిల్వ చేసిన ప్రాంతంలో మంటలు చెలరేగాయి. దుస్తులు, ప్లాస్టిక్ వస్తువులు కారణంగా మంటలు వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ సిబ్బంది గుల్ ప్లాజాకు చేరుకుని, మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అగ్ని ప్రమాదానికి గల కారణం తెలియాల్సి వుంది. కరాచీ మరియు దేశంలోని చాలా నిర్మాణాల్లో అగ్నిమాపక వ్యవస్థలు లేవని, వీటివల్ల తరచుగా ప్రమాదాలు, ప్రాణనష్టం జరుగుతోందని అధికారులు ఆ ప్రకటనలో తెలిపారు.

బీజాపూర్ అడవుల్లో మళ్లీ ఎన్‌కౌంటర్

హైదరాబాద్ పెన్ పవర్: సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అడవుల్లో మళ్లీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో మరో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర యాదవ్, బస్తర్ రేంజ్‌లోని ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్‌రాజ్ పట్టిలింగం తెలిపిన వివరాల ప్రకారం.. బీజాపూర్ జాతీయ ఉద్యానవన ప్రాంతంలో మావోయిస్టు జాతీయ ఉద్యానవన కమిటీకి చెందిన డీవీసీఎం దిలీప్ బెడ్జా, ఇతర సాయుధ మావోయిస్టులు బస చేశారన్న సమాచారం ఆధారంగా డీఆర్‌జీ కోబ్రా, ఎస్‌టీఎఫ్ సంయుక్త బృందం బీజాపూర్ జిల్లా వాయువ్య ప్రాంతంలోని అటవీ కొండ ప్రాంతాల్లో శోధన ఆపరేషన్ ప్రారంభించింది. ఈ నెల 17న (శనివారం) ఉదయం నుంచి ఉమ్మడి బృందం, మావోయిస్టుల మధ్య అడపాదడపా కాల్పులు కొనసాగాయి. ఈ ఆపరేషన్‌లో శనివారం మధ్యాహ్నం నాటికి ఎన్‌కౌంటర్ స్థలం నుంచి ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత, మావోయిస్టులు భద్రతా దళాల మధ్య సాయంత్రం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందారు. మావోయిస్టులు భద్రతా దళాల మధ్య ఆదివారం సైతం ఎదురుకాల్పులు కొనసాగాయి. ఈ ఆపరేషన్‌లో మరో ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. బస్తర్ ప్రాంతంలో శాంతి, భద్రత ప్రజా సంక్షేమాన్ని నిర్ధారించడానికి డీ ఆర్జి కోబ్రా, స్థానిక పోలీసు దళాలు, కేంద్ర పారామిలిటరీ దళాల సిబ్బంది అత్యంత అంకితభావం వృత్తిపరమైన నిబద్ధతతో తమ విధులను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. శనివారం, ఆదివారం జరిగిన బీజాపూర్ సెర్చ్ ఆపరేషన్‌లో నలుగురు మహిళా కేడర్‌లతో సహా ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు.

సమాజాన్ని విషపూరితం చేస్తోంది

హైదరాబాద్ పెన్ పవర్: జర్నలిజం విలువలను నిలబెట్టడంలో, తప్పుడు సమాచారాన్ని తిప్పికొట్టడంలో శాస్త్రీయ, పరిశోధనాత్మక, డేటా ఆధారిత వైఖరి కీలకపాత్ర పోషిస్తుందని ప్రముఖ పాత్రికేయుడు, 'ది హిందూ' గ్రూప్ పబ్లిషింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎన్.రామ్ చెప్పారు. శనివారం చెన్నైలో జరిగిన 'ది హిందూ లిట్ ఫర్ లైఫ్ 2026' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వాస్తవాలను పరిశీలించడానికి, విశ్లేషించడానికి, సహేతుకమైన నిర్ణయానికి రావడానికి శాస్త్రీయ పద్ధతిని అవలంబించాలని సూచించారు. వేర్వేరు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక నేపథ్యాలు కలిగిన ప్రజలు ఈ సమాజంలో నివసిస్తున్నప్పటికీ సత్యానికి విలువ ఉంటుందన్నారు. వాస్తవాలను ధృవీకరించుకోవచ్చు? సవాలు చేయవచ్చు? పరిశోధించవచ్చు అని తెలిపారు. సోషల్ మీడియా నేడు అబద్ధాలను, ద్వేషాన్ని వ్యాపింపజేస్తూ సమాజాన్ని విషపూరితం చేస్తోందని రామ్ ఆవేదన వ్యక్తంచేశారు. కేవలం సామాజిక మాధ్యమాలే కాకుండా ప్రధాన స్రవంతి మీడియా కూడా ఇదే ధోరణితో ఉన్నదని చెప్పారు. పక్షపాత ధోరణులపై పోరాడే విషయాన్ని ప్రస్తావిస్తూ దేశంలో మీడియా యాజమాన్యంలో ఇప్పటికీ వైవిధ్యం కన్పిస్తోందని, పక్షపాతాన్ని సవాలు చేయడానికి డిజిటల్ వేదికలు అవకాశాన్ని కల్పిస్తున్నాయని తెలిపారు. రిపో ర్టర్స్ విఠౌట్ బోర్డర్స్ సంస్థ ప్రచురించిన ప్రపంచ పత్రికా స్వేచ్ఛ నివేదికలో మన దేశం పేలవమైన ర్యాంకులో ఉండడాన్ని ఆయన ప్రస్తావించారు. 'మోడీ ప్రభుత్వం పూర్తి అసహనంతో ఉంది. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ అలాగే ఉన్నాయి. అయినా ప్రతిఘటన ఉంది. మొత్తంగా చూస్తే దక్షిణాదిన పరిస్థితి మెరుగ్గా ఉంది. అక్కడ విమర్శలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గొంతెత్తే గళాలను అణచివేసే ప్రయత్నాలు తక్కువగానే జరుగుతున్నాయి' అని రామ్ తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని చాటిచెప్పడంలోనూ, మానవ హక్కులు, ప్రాథమిక హక్కులను పరి రక్షించడంలోనూ జర్నలిజం తన పాత్రను సమర్థవంతంగా పోషించాలని రామ్ ఉద్బోధించారు.

ప్రమాదంలో దేశ లౌకిక స్వరూపం

హైదరాబాద్ పెన్ పవర్: భారతదేశంలోని లౌకిక స్వరూపం ప్రమాదంలో పడింది. గతేడాది 2025లో మతపరంగా మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని విద్వేష ప్రసంగాలు, దాడులు మరింత తీవ్రమయ్యాయి. దేశవ్యాప్తంగా ముస్లిములు, క్రైస్తవులు బెదిరింపులు, విధ్వంసం, హత్యలు వంటి దారుణాలకు గురయ్యారు. ఈ ఘటనలు దేశంలో పెరుగుతున్న మత విద్వేషం, మతతత్వ శక్తుల విధ్వంసక సమీకరణను వెల్లడిస్తున్నాయని పౌర హక్కుల సంఘాలు, పరిశోధనా సంస్థలు హెచ్చరిస్తున్నాయి. సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ ఆర్గనైజ్డ్ హేట్ (సీఎస్ఓహెచ్) ప్రాజెక్టు అయిన ఇండియా హేట్ ల్యాబ్ (ఐహెచ్ఎల్) తాజా నివేదిక ప్రకారం 2025లో దేశవ్యాప్తంగా మతపరమైన మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని జరిగిన విద్వేష ప్రసంగాలు, దాడులు గణనీయంగా పెరిగాయి. గత ఏడాది దేశవ్యాప్తంగా ముస్లిములు, క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని 1,318 విద్వేషపూరిత ప్రసంగాలు జరిగాయి. 2024తో పోలిస్తే గతేడాదిలో 13 శాతం పెరుగుదల కనిపించింది. 2023తో పోలిస్తే ఈ పెరుగుదల ఏకంగా 97 శాతం ఉంది. ఈ సంఘటనలు 21 రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం, దేశరాజధాని న్యూఢిల్లీలో నమోదయ్యాయి. ఈ అన్ని కేసులను ఐక్యరాజ్యసమితి విద్వేషపూరిత ప్రసంగం నిర్వచనం ప్రకారం వర్గీకరించారు. వీటిల్లో మైనార్టీలపై కుట్రలు, హింసకు పిలుపులు, సామాజిక, ఆర్థిక బహిష్కరణలకు విజ్ఞప్తులు, ప్రార్థనా స్థలాలను స్వాధీనం చేసుకోవడం లేదా వాటిని ధ్వంసం చేయాలనే డిమాండ్లు, అమానవీయ భాష, రోహింగ్యా శరణార్థులపై దాడులు ఉన్నాయి. ఈ సంఘటనల్లో 98 శాతం (1,289) సంఘటనలు ముస్లిములను లక్ష్యంగా చేసుకుని జరిగాయి. ఇందులో 1,156 ఘటనలు నేరుగా, 133 సంఘటనలు క్రైస్తవులతోపాటు జరిగాయి. ఇవి గతేడాది కంటే 12 శాతం పెరిగాయి. క్రైస్తవులకు వ్యతిరేకంగా 162 విద్వేష పూరిత ప్రసంగ సంఘటనలు జరిగాయి. ఇవి అంతకుముందు ఏడాది 2024తో పోలిస్తే 41 శాతం పెరిగాయి.

ఢిల్లీలో ప్రమాదకర స్థాయిలో గాలినాణ్యతలు

హైదరాబాద్ పెన్ పవర్: దేశ రాజధాని ఢిల్లీని పొగమంచు కమ్మేసింది. అక్కడ గాలి నాణ్యతలు ప్రమాదకర స్థాయిలో నమోదయ్యాయి. సోమవారం ఢిల్లీలో గాలి నాణ్యతలు 418 స్థాయిల వద్ద నమోదయ్యాయి. దీంతో వీటి స్థాయిల్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సిపిసిబి) ప్రమాదకర స్థాయిలో వర్గీకరించింది. సిపిసిబి సమాచారం ప్రకారం.. ఢిల్లీలో కొన్ని ప్రాంతాల్లో ఎక్యూఐ స్థాయిలు ఈవిధంగా ఉన్నాయి. ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆఫీస్ వద్ద 434, రఫీమార్గ్ సమీపంలో 417, స్వామినారాయణ్ అక్షరధామం ఆలయం వద్ద 455 ఎక్యూఐ స్థాయిలు నమోదయ్యాయి. ఇక ఆనంద్ విహార్ : 462, అశోక్ విహార్ : 473, బవానా : 448, చాందినీ చౌక్ 454, ద్వారకా సెక్టార్ ? 8 : 427, ముండ్కా 467, నరేలా 437, పంజాబ్ బాగ్ : 434, ఆర్ కె పురం : 439, రోహిణి : 437, వాజీర్పూర్ :

472 స్థాయిలు వద్ద ఎక్యూఐ నమోదైంది. ప్రమాదకర స్థాయిలోనే ఎక్యూఐ నమోదైందని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. గాలి నాణ్యతలు పడిపోవడంతో.. ఢిల్లీవాసులు శ్వాసకోశ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఖమేనీ పాలనకు చరమగీతం పాడాలి

హైదరాబాద్ పెన్ పవర్: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఇరాన్ సుప్రీం నేత అయ తొల్లా అలీ ఖమేనీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఇరాన్‌లో దశాబ్దాల తరబడి కొనసాగుతున్న ఖమేనీ పాలనకు చరమగీతం పాడాలని ట్రంప్ పిలుపునిచ్చారు. మరోవైపు తమ దేశంలో హింసను రెచ్చగొట్టి వందలాది మంది మరణానికి ట్రంప్ కారకుడయ్యాడని ఖమేనీ ఆరోపించారు. 'ఇరాన్‌లో నూతన నాయకత్వం కోసం అన్వేషించాల్సిన సమయం ఆసన్నమైంది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇటీవల ఇరాన్‌లో జరి గిన నిరసనలు హింసాత్మకంగా మారడానికి ట్రంప్ కారకుడంటూ ఖమేనీ ఎక్స్ ఖాతా నుంచి వరుసగా వస్తున్న పోస్టులపై ఆయన స్పందించారు. ఖమేనీ పోస్టులపై ట్రంప్ స్పందిస్తూ ఇరాన్ నాయకత్వం భయాన్ని రేకెత్తించి, పెద్ద ఎత్తున హింసకు తెగబడి దేశాన్ని పాలిస్తోందని ఆరోపించారు. 'ఆయన చేసిన నేరమేమిటంటే దేశానికి నేతగా ఉంటూ విధ్వంసానికి పాల్పడ్డారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా హింసకు తెగబడ్డారు. నేను అమెరికాలో చేస్తున్న విధంగా దేశాన్ని సక్రమంగా నడపాలి. అంతేకానీ అధికారంలో కొనసాగేందుకు వేలాది మంది ప్రాణాలు తీయకూడదు' అని అన్నారు. నాయకత్వమంటే గౌరవంగా ఉండాలే తప్ప భయపెట్టో, ప్రజల ప్రాణాలు తీసో పాలన సాగించకూడదని హితవు పలికారు. పేలవమైన ఖమేనీ నాయకత్వం కారణంగా ప్రపంచంలో నివసించడానికి వీలులేని అత్యంత దారుణమైన దేశంగా ఇరాన్ మారిపోయిందని ట్రంప్ అన్నారు.

ఇరాన్ ఆందోళనల్లో 5,000కు చేరిన మృతుల సంఖ్య

హైదరాబాద్ పెన్ పవర్: దేశవ్యాప్తంగా చేపడుతున్న హింసాత్మక ఆందోళనలతో మృతుల సంఖ్య 5,000కు చేరిందని ఇరాన్ అధికారి ఒకరు ఆదివారం తెలిపారు. మృతుల్లో సుమారు 500మంది భద్రతా సిబ్బంది కూడా ఉన్నారని అన్నారు. అమాయక ఇరానియన్లు మరణించడానికి, ఉగ్రవాదులు మరియు సాయుధ అల్లర్లు కారణమని అన్నారు. వాయువ్య ఇరాన్‌లోని ఇరానియన్ కుర్దిష్ ప్రాంతాల్లో జరిగిన అత్యంత తీవ్రమైన ఘర్షణలు అత్యధిక మరణాలకు కారణమయ్యాయని అన్నారు. ఈ ప్రాంతంలో కుర్దిష్ వేర్పాటువాదులు హింసాత్మక అల్లర్లను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఇజ్రాయిల్ మరియు విదేశాల్లో ఉన్న సాయుధ సమూహాలు ఆందోళన చేపడుతున్న వారికి ఆయుధాలు సమకూరుస్తున్నాయని మండిపడ్డారు.

గ్వాటెమాలా జైళ్లలో గార్డుల్ని బందీలుగా చేసుకున్న ఖైదీలు

హైదరాబాద్ పెన్ పవర్: కారాగారాల్లోని ఖైదీలు 46 మంది జైలు గార్డుల్ని బందీలుగా చేసుకున్న పరిణామం గ్వాటెమాలాలో చోటుచేసుకుంది. ఖైదులో ఉన్న గ్యాంగ్‌లీడర్ల హక్కుల్లో కోత విధించాలన్న నిర్ణయంతో ఖైదీలు ఈ తరహా దుశ్చర్యకు దిగారు. ఒక పథకం ప్రకారం ఆటంకాలు కల్పించి మూడు జైళ్లలోని ఖైదీలు దీనికి పాల్పడ్డారు. వారి డిమాండ్లను ఆమోదించేది లేదని అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి మార్కో ఆంటోనియో విల్లెడ స్పష్టంచేశారు. వందలమంది పోలీసులు ఒక కారాగారంలో ప్రవేశించి గార్డులకు విముక్తి కల్పించారు. ఆ ప్రాంగణాన్ని తిరిగి నియంత్రణలోకి తీసుకువచ్చారు. ఆ తర్వాత గ్వాటెమాలాలో పోలీసులపై సాయుధుల దాడులు మొదలయ్యాయి. కనీసం పదిచోట్ల ఇలాంటి దాడులు జరిగాయని, ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని అధికారులు తెలిపారు.

బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యాపారి హత్య

హైదరాబాద్ పెన్ పవర్: బంగ్లాదేశ్‌లో మరో హిందూ వ్యాపారి హత్య జరిగింది. అరటిపళ్ల విషయంలో వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఓ కుటుంబంలోని ముగ్గురు ఈ దారుణానికి ఒడిగట్టారు. లిటన్ చంద్ర ఘోష్(55) అనే వ్యాపారికి గాజిపుర్ జిల్లాలోని కలిగంజ్ ప్రాంతంలో బైశాఖి స్వీట్‌మీట్ అనే హోటల్ ఉంది. అదే ప్రాంతానికి చెందిన మాసుమ్ మియా(28) అనే వ్యక్తికి చెందిన అరటి తోటలోని కొన్ని గెలలు అదృశ్యమయ్యాయి. వీటిని మాసుమ్, అతడి తండ్రి స్వపన్ మియా(55), తల్లి మజేదా ఖాతున్(45)లు లిటన్ హోటల్‌లో గుర్తించారు. ఈ విషయమై వీరి మధ్య జరిగిన గొడవలో లిటన్‌ను నిందితులు తీవ్రంగా కొట్టి, కిందకు నెట్టేశారు. దీంతో లిటన్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. హత్యతో సంబంధమున్న ముగ్గురిని పోలీసులు అరెస్టుచేశారు. బంగ్లాదేశ్‌లో ఇటీవల హిందువులపై జరుగుతున్న వరుస దాడులతో ఈ హత్యకు సంబంధముందా లేదా అన్నది తెలియరాలేదు.

సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళుతున్న వెండి!

హైదరాబాద్ పెన్ పవర్: వెండి ధరలు దూసుకెళుతున్నాయి. పెట్టుబడిదారుల ఆసక్తిని ఆకర్షిస్తూ ఈ తెల్లని లోహం సరికొత్త రికార్డులను తాకుతోంది. ఈ జనవరి నెలలోనే ఇప్పటివరకు 22 శాతం మేర వెండి ధర పెరిగింది. ప్రధాన పెట్టుబడి సాధనాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోంది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 3 లక్షల మైలురాయికి అత్యంత చేరువలో ఉంది.గత శుక్రవారం ఎంసీఎక్స్‌లో కిలో వెండి ధర రూ. 2,87,762 వద్ద ముగిసింది. గత ఏడాది ఏప్రిల్ లో రూ. 95,917గా ఉన్న ధర, అప్పటి నుంచి దాదాపు 200 శాతం పెరగడం గమనార్హం. సాధారణంగా మల్టీబ్యాగర్ స్టాక్స్ లో కనిపించే ఈ తరహా రాబడి, కమోడిటీలో నమోదు కావడం విశేషం. గత వారమే కిలో వెండి రూ. 2,92,960 వద్ద సరికొత్త రికార్డును సృష్టించింది.వెండి ధరకు ఇంతటి డిమాండ్ రావడానికి పలు అంతర్జాతీయ అంశాలు దోహదం చేస్తున్నాయి. గత మూడేళ్లుగా పెద్ద ఎత్తున బంగారాన్ని కొనుగోలు చేసిన ప్రపంచ కేంద్ర బ్యాంకులు, ఇప్పుడు తమ నిల్వల్లోకి వెండిని కూడా చేర్చుకుంటున్నట్లు వస్తున్న నివేదికలు ధరలకు మరింత ఊతమిస్తున్నాయి. దీనికి తోడు, మార్కెట్లో భౌతిక వెండి నిల్వలు తగ్గడం కూడా ధరల పెరుగుదలకు మరో కారణంగా నిలుస్తోంది. నిజానికి, 2025 ప్రారంభంలో వెండిపై పెట్టుబడిదారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. గత ఏడాది చివరి నాటికి వెండి ధర రూ. 1,10,000 చేరుకుంటుందని విశ్లేషకులు అంచనా వేయగా, ఆ మార్కును చాలా ముందే దాటేసింది. ఆ తర్వాత కూడా ఆగకుండా రూ.2,54,000 స్థాయిని తాకి, అంచనాలను తలకిందులు చేసింది. ప్రస్తుత ముగింపు ధర ప్రకారం చూస్తే? రూ.3 లక్షల మైలురాయిని దాటడానికి వెండికి కేవలం 4.2 శాతం పెరుగుదల మాత్రమే అవసరం. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారుల దఅష్టి ఇప్పుడు పూర్తిగా వెండిపైనే కేంద్రీకృతమై ఉంది.

5 త్రైమాసికాల గరిష్ఠానికి సీఐఐ వ్యాపార విశ్వాస సూచీ

హైదరాబాద్ పెన్ పవర్: వరుసగా మూడో త్రైమాసికంలో (అక్టోబరు–డిసెంబరు)నూ సీఐఐ వ్యాపార విశ్వాస సూచీ (బీసీఐ) పెరిగిందని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలిపింది. గిరాకీ, లాభదాయకత, పెట్టుబడి పరిస్థితుల్లో ఉన్న ఆశావాదం కారణంగా బీసీఐ 66.5కు చేరిందని, ఇది 5 త్రైమాసికాల గరిష్ఠ స్థాయి అని పేర్కొంది. దేశీయంగా లభిస్తున్న గిరాకీ కీలకమైన చోదక శక్తిగా ఉందని.. మూడింట రెండొంతుల సంస్థలు 2025–26 జులై–సెప్టెంబరులో అధిక డిమాండ్‌ను నివేదించాయని సీఐఐ వెల్లడించింది. మూడో త్రైమాసికంలో మరింత వృద్ధి లభించిందని 72% సంస్థలు పేర్కొన్నాయి. జీఎస్టీ రేట్లు తగ్గించడం, పండగ వినియోగం పెరగడం.. గిరాకీ వృద్ధికి దోహదపడతాయని తెలిపింది. దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్య, పెద్ద సంస్థలతో పాటు అన్ని పరిశ్రమల రంగాల అభిప్రాయాలను సేకరించి, ఈ అభిప్రాయానికి సీఐఐ వచ్చింది. తయారీ, సేవల్లో నిమగ్నమైన ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని 175 సంస్థల నిర్వాహకుల వద్ద 2025 డిసెంబరు తొలి – మూడో వారం మధ్య అభిప్రాయాలు సేకరించారు. కొత్త పెట్టుబడులు, కొత్త ఉద్యోగ నియామకాలపైనా ఆశావాదం బలంగా ఉన్నట్లు తేలింది. ప్రస్తుత త్రైమాసికంలో రెపోరేటును రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మరింత తగ్గిస్తుందని 69% సంస్థలు ఆశిస్తున్నాయి. దేశ వృద్ధిరేటును ఉపకరించేలా రాబోయే బడ్జెట్‌లో సంస్కరణల వేగం కొనసాగుతుందని సీఐఐ విశ్వాసం వ్యక్తం చేసింది. సెప్టెంబరు 22 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్టీ కోతల వల్ల విక్రయాలకు ఊతం లభించింది. రాబోయే త్రైమాసికాల్లో తమ విక్రయాలు 5 – 20% పెరుగుతాయని 56.3% సంస్థలు ఆశాభావంతో ఉన్నాయి. సాహసోపేత సంస్కరణల చొరవతో, మన దేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా స్థిరపడిందని సర్వే తేల్చింది.

అరుదైన ఘనతను సాధించిన అదానీ సోలార్

హైదరాబాద్ పెన్ పవర్: దేశీయ అదానీ సోలార్ సంస్థ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ప్రపంచ క్లీన్ ఎనర్జీ ఉత్పత్తిలో భారత్ స్థానాన్ని మెరుగుపరుస్తూ, ప్రముఖ వుడ్ మెకెంజీ ర్యాకింగ్స్?లో అదానీ సోలార్‌కు చోటు దక్కింది. వుడ్ మెకెంజీ గ్లోబల్ సోలార్ మాడ్యూల్ తయారీ ర్యాంకింగ్‌లో స్థానం సంపాదించిన ఏకైక భారతీయ కంపెనీ అదానీ సోలార్ నిలిచింది. అదానీ న్యూ ఇండస్ట్రీస్‌కు చెందిన అదానీ సోలార్‌కు అంతర్జాతీయంగా 8వ ర్యాంకు లభించడమే కాకుండా, గ్రేడ్ ఏ రేటింగ్ లభించింది. నాణ్యత, ఆర్థిక బలం, పనితీరు, విశ్వసనీయత వంటి అంశాల ఆధారంగా కంపెనీకి ఈ గౌరవడం దక్కింది. ఈ జాబితాలో చైనా కంపెనీలు ఇప్పటికీ అగ్రస్థానాల్లో ఆధిపత్యం చెలాయిస్తున్నప్పటికీ, అదానీ సోలార్ ఉనికి భారత్‌ను ప్రపంచవ్యాప్తంగా మరింత పోటీకి నిలబెట్టింది.గతేడాది మొదటి ఆరునెలలకు సంబంధించి వుడ్ మెకెంజీ తన తాజా నివేదికను విడుదల చేసింది. ఇది సోలార్ ప్యానెల్ కంపెనీలకు సంబంధించిన షిప్‌మెంట్‌లు, బ్యాంకింగ్, పనితీరును తనిఖీ చేస్తుంది. దాదాపు 38 కంపెనీలను సమీక్షించి వుడ్ మెకెంజీ తన నివేదికను రూపొందించింది. ఇందులో జేఏ సోలార్ 91.7 పాయింట్లు, ట్రినాసోలార్ 91.6 పాయింట్లతో సంయుక్తంగా టాప్ ర్యాంకులో నిలిచాయి. అదానీ సోలార్ 81 పాయింట్లను సాధించింది. అలాగే, గ్రేడ్ ఏ రేటింగ్ ద్వారా కంపెనీ అత్యున్నత పనితీరు, పారదర్శకత ప్రమాణాలను సూచిస్తుంది. కాగా, 2025 నాటికి అదానీ సోలార్ దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో 15,000 మెగావాట్ల కంటే ఎక్కువ సౌర మాడ్యూళ్లను రవాణా చేసింది. ఇందులో 10,000 మెగావాట్లు దేశీయంగా, మిగిలిన 5,000 మెగావాట్లు విదేశాలకు ఎగుమతి చేసింది. ఇదే సమయంలో కంపెనీ 8,000 కంటే ఎక్కువ ప్రత్యక్ష ఉద్యోగాలు, భారీగా పరోక్ష ఉద్యోగాలను సృష్టించింది.

రాజకీయ చదరంగంలో మీడియా

హైదరాబాద్ పెన్ పవర్: పరిపాలన విభాగంలో అత్యున్నతస్థాయి ఐఏఎస్ మహిళా అధికారులను గురించి ప్రధాన న్యూస్ చానల్స్, యూట్యూబ్ న్యూస్ లలో అభ్యంతర, అసత్య వార్తలు, కథనాలు ప్రసారం కావడం సభ్యసమాజాన్నిగ్భ్రాంతికి గురిచేసింది.ప్రసారమైన కథనాలు పూర్తిగా మహిళా ఐఏఎస్ ల గౌరవ మర్యాదలకు, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించేవి. ఈ వార్తలు వారిని మానసిక క్షోభకు గురిచేసి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేవిగా ఉన్నాయి. ఊహాజనిత అంశాల ఆధారంగా ఉన్నతాధికారులపై కథనాలు ప్రసారం చేయడం లైవ్ చానల్స్ శాడిజానికి పరాకాష్ట. మంత్రులతో అక్రమ సంబంధాలను అంటగడుతూ మహిళా ఐఏఎస్ పట్ల నీచమైన వివాదస్పద కథనాన్ని ఒక ప్రముఖ చానెల్, మరి కొన్ని ఇతర చానళ్ళు ప్రసారం చేశాయి. వీటి ప్రసారాలకు ముందు వార్తలలోని వాస్తవాలేమిటోనని బేరీజు వేసుకోకపోవడం శోచనీయం. జర్నలిస్ట్ వృత్తి తర్కంతో పరిశీలించకపోవడం బాధాకరం. అధికారులకు అక్రమసంబంధాలు అంటగట్టే ముందు వారు భవిష్యత్తులో ఎదుర్కునే అవమానాలు, జరగబోయే పరిణామాలను మానవతా కోణంలోనైనా ఆలోచించాల్సింది. ఏదో ఒక అంశానికి ఇష్టమైన రంగు పులిమి ప్రసారం చేయడం దురదృష్టకరం. రాజకీయ చదరంగంలో మీడియా, అధికారులు ఇరుక్కోవడం విచారకరం.

అసలు విషయం పక్కన పెడితే మహిళల వ్యక్తిగత హననానికి కారణమైన వార్తలు ప్రసారం చేయడం సిగ్గుచేటు. గతంలో సిఎంఓలో పని చేసిన స్మిత సబర్వాల్ మీద అవుట్‌లుక్ పత్రిక ఇలానే అభ్యంతరకర కార్టూన్‌ను ప్రచురించింది. అది తన వ్యక్తిగత హక్కులకు భంగం కలిగించేదిగా ఉందని ఆమె అవమాన భారంతో పరువునష్టం దావా వేశారు. ఇలాంటి పిచ్చివార్తలు, కథనాల ప్రసారానికి చానల్స్‌కి ఉన్న హక్కులేమిటో?. ఈ కథనాలతో ఉన్నత స్థాయి మహిళాధికారులకు మీడియా ఇచ్చే గౌరవం ఇదేనా అన్పించక మానదు. యూట్యూబ్ చానల్స్ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. వీటితో సమాజానికి మేలుకంటే కీడే ఎక్కువ. చానల్స్ వ్యూస్ పెరగడం కోసం తప్పుడు వార్తలను లేదా పుకారులను ప్రసారం చేయడానికి వెనకడుగు వేయడం లేదు. యూట్యూబ్ చానల్స్‌తో వ్యూవర్స్ గందరగోళానికి లోనవుతున్నారు. నిజం మరుగున పడుతోంది. మెయిన్ స్ట్రీమ్ చానళ్ళ కంటే వీటి హడావిడి అంతా ఇంతాకాదు. ప్రస్తుత మహిళా అధికారిపై తప్పుడు వార్తల ప్రసారంలో యూట్యూబ్ చానల్స్ ఒకదానితో ఒకటి పోటీ పడి ప్రచారం చేశాయి. రాజకీయ వికృత క్రీడలో చాలా యూట్యూబ్ చానల్స్ పావులు. రాజకీయ లబ్ధిదారుల కోసం అబద్ధాలను వండి వారించడంలో ఇవి దిట్ట. ఇలాంటి చానల్స్ ను ప్రశ్నించే వ్యవస్థలు లేకపోవడం. పత్రికా స్వేచ్ఛ పేరుతో వాటిని ఎవరు ఏమీ చేయలేకపోవడం వలన టి.ఆర్.పి రేట్లు, వ్యూస్, లైక్ ల ఆరాటంతో యూట్యూబ్ చానల్స్ ఇష్టారీతిన చెలరేగిపోతున్నాయి. చానల్స్ పైన, తప్పుడు వార్త కథనాలపై ఒకేసారి మార్పు తీసుకురావడం సాధ్యంకాదు. కాబట్టి చట్టం పరిధిలోనే తప్పుడు ప్రసారాల, ప్రచార చానల్లను తరుచుగా ప్రశ్నించాలి. ఇదే వారిని సరిదిద్దే మార్గం. తప్పుచేసిన చానల్స్‌ను విచారించాలి. తప్పు చేస్తే శిక్షించాలి. అప్పుడే అసత్య వార్తలను ప్రసారంచేస్తే కేసులు, విచారణలను ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం వారిలో కలుగుతుంది. భవిష్యత్తులో ఇలాంటి తప్పుడు ప్రసారాలు, అసత్య కథనాలను అడ్డుకోవాలంటే ప్రభుత్వం సమాచార సాంకేతిక చట్టం–2000 లలోని అవసరమైన సెక్షన్లను వాడుకోవాలి. విచారణలో ప్రసారం చేసిన వార్తల్లో ఎలాంటి వాస్తవికత లేదని తేలితే సెక్షన్ 79(3)(ఏ) ప్రకారం కంటెంట్ ను తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉంది. ప్రసార వార్తలు హేయమైనవైతే యూట్యూబ్ ఛానల్లనే మూసివేసే అధికారం ప్రభుత్వానికి కలదు. వార్తల ప్రసార స్వేచ్ఛా యూట్యూబ్ చానళ్ళకు ఉంది, కాని అవి వ్యక్తిగత నిందలకు, గౌరవ, మర్యాదలకు భంగం కలిగించేవై ఉండకూడదు. ప్రస్తుత వివాద విచారణలో సిట్ దూకుడుగా వ్యవహరిస్తూ సంబంధిత చానెల్‌కు చెందిన ముగ్గురు జర్నలిస్టులను అరెస్టు చేశారు. అయితే ఈ మొత్తం వ్యవహారంలో యాజమాన్యాలను వదిలేసి కేవలం జర్నలిస్టుల మీద చర్యలు తీసుకోవడం అసలైన దోషులకు వెన్నుకాయడమే. ఈ ఉదంతం వెనుక రాజకీయ కుట్ర కోణం దాగి ఉందని జర్నలిస్టు సంఘాలు, ప్రధాన పార్టీలు తీవ్రంగా ఆరోపిస్తున్నాయి. జర్నలిస్టుల అరెస్టులను ఖండిస్తున్నాయి. ప్రజాస్వామ్య మనుగడకు నాలుగో స్తంభంగా పిలువబడే పత్రికలపై, జర్నలిస్టులపై ప్రభుత్వ చర్యలు గర్హనీయం. సమాజం మొత్తాన్ని అత్యంత ప్రభావితం చేసే ఇలాంటి ఉదంతాలను ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించి భవిష్యత్తుకు ఆదర్శంగా నిలపాలి.

20 ఏళ్ల తర్వాత పట్టణ సహకార బ్యాంకులకు లైసెన్స్ ఇవ్వనున్న ఆర్‌బీఐ

హైదరాబాద్ పెన్ పవర్: 20 ఏళ్లకు పైగా విరామం తర్వాత, పట్టణ సహకార బ్యాంకుల (యూసీబీలు)కు లైసెన్సుల జారీని తిరిగి ప్రారంభించాలని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ప్రతిపాదించింది.కొత్త యూసీబీలు ఆర్థికంగా విఫలమవడంతో 2004లో లైసెన్సుల జారీని నిలిపివేశారు. ప్రస్తుతం వీటిని కనీసం రూ. 300 కోట్ల మూలధనంతో సహా కఠినమైన నిబంధనలతో కొత్త లైసెన్సులను మళ్లీ అనుమతించాలని భావిస్తోంది. దీనికి సంబంధించి తాజాగా ఆర్‌బీఐ చర్చాపత్రాన్ని విడుదల చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి 13లోగా అభిప్రాయాలను తెలియజేయాలని ప్రజలను, వాటాదారులను కోరింది. గత కొన్ని సంవత్సరాలుగా ఆర్‌బీఐ బలహీనంగా ఉన్న యూసీబీలను విలీనం చేయడం లేదా పనితీరు సరిగా లేని బ్యాంకులను మూసివేయడం ద్వారా వాటి సంఖ్యను తగ్గించింది. అయినప్పటికీ, అనేక యూసీబీలు ఇప్పటికీ బలహీన పనితీరుతో కొనసాగుతున్నాయి. కొన్ని ఆర్‌బీఐ ఆంక్షల పరిధిలో ఉన్నాయి. గతంలో జరిగిన చిన్న యూసీబీలే ఎక్కువగా నష్టాలను చూశాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని పెద్ద, మెరుగైన నిర్వహణ కలిగిన సహకార బ్యాంకులకు మాత్రమే లైసెన్సులను అనుమతించే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి యూసీబీలు సాధారణంగా మెరుగైన నిర్వహణ, సుదీర్ఘ అనుభవం, తక్కువ రిస్క్ కలిగి ఉంటాయి. ఈ నేపథ్యంలో కొత్త లైసెన్సుల కోసం ఆర్‌బీఐ కఠినమైన షరతులను సూచించింది. ఒక యూసీబీ కనీసం 10 ఏళ్లుగా పనిచేస్తూ ఉండాలి. గత 5 ఏళ్ల మంచి ఆర్థిక రికార్డును కలిగి ఉండాలి. రూ. 300 కోట్ల మూలధనం, కనీసం 12 శాతం మూలధన సమృద్ధి నిష్పత్తి, 3 శాతం కంటే తక్కువ మొండి బకాయిలు ఉండాలి. కాగా, 2025, మార్చి నాటికి, దేశంలో 1,457 యూసీబీలు ఉన్నాయి. వాటి మొత్తం ఆస్తుల విలువ రూ. 7.38 లక్షల కోట్లు, రూ. 5.84 లక్షల కోట్ల విలువైన డిపాజిట్లు ఉన్నాయి.

టెక్ రంగంలో ఈ ఏడాది 1.25 లక్షల ఉద్యోగాలు

హైదరాబాద్ పెన్ పవర్: ఈ ఏడాది దేశీయ టెక్ రంగంలో భారీ నియామకాలు జరగనున్నాయి. 2026లో దాదాపు 1,25,000 కొత్త ఉద్యోగాలకు అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డేటా, సైబర్ సెక్యూరిటీ ఉద్యోగాలను అత్యధిక గిరాకీ ఉంటుందని హెచ్ఆర్ సొల్యూషన్స్ సంస్థ అడెక్కొ ఇండియా నివేదిక తాజా ప్రకటనలో వెల్లడించింది. ఈ ఉద్యోగాలు ప్రయోగాత్మక దశ నుంచి ప్రధాన అవసరాల దశకు చేరాయని నివేదిక అభిప్రాయపడింది. ఫలితంగా ఈ ఉద్యోగాలకు గిరాకీ కూడా 51 శాతం పెరిగింది. దీనివల్ల ఈ ఏడాది ఉద్యోగాలు 12–15 శాతం పెరుగుతాయని అంచనా. దాదాపు 40 శాతం దిగ్గజ సంస్థలు ఇప్పటికే రోజువారీ పనిలో జనరేటివ్ ఏఐని ఉపయోగిస్తున్నాయి. 2023, 2024లలో నెమ్మదించిన తర్వాత 2025లో ఐటీ, ఐటీ సేవల రంగంలో నియామకాలు రికవరీ అవుతున్నాయని

అడెక్కొ ఇండియా డైరెక్టర్ సంకేత్ చెంగప్ప అన్నారు. కంపెనీలు ఇప్పుడు మళ్ళీ నియామక ప్రక్రియను మొదలుపెట్టాయి. ముఖ్యంగా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా, ఆధునిక ప్లాట్‌ఫామ్‌లకు సంబంధించిన నైపుణ్యాల కోసం ఉద్యోగులను తీసుకుంటున్నాయి. కొత్త గ్రాడ్యుయేట్ల నియామకం కూడా పెరిగింది. దీనర్థం ఐటీ రంగం నెమ్మదిగా కోలుకుంటోందని, 2026లో మరింత బలంగా పుంజుకోగలదని నివెదిక తెలిపింది. భారతీయ ఐటీ కంపెనీల్లో అగ్రశ్రేణి కంపెనీలు ఫ్రెషర్లు, స్కిల్స్ ఉన్న నిపుణులను తీసుకోవడం కొనసాగిస్తామని చెప్పాయి. ఇటీవల డిసెంబర్ త్రైమాసికంలో ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ 5,043 మంది ఉద్యోగులను, విప్రో 6,529 మంది ఉద్యోగులను చేర్చుకుంది. కంపెనీలు ఉద్యోగులకు ఏఐ, భవిష్యత్తు సాంకేతికతలలో శిక్షణ కోసం భారీగా ఖర్చు చేస్తున్నాయి. 2,17,000 మంది ఉద్యోగులు ఇప్పుడు అధునాతన ఏఐ స్కిల్స్ కలిగి ఉన్నారని, ఇది గతేడాది కంటే మూడు రెట్లు ఎక్కువ అని టీసీఎస్ వెల్లడించింది. ఏఐ కొత్త ఉద్యోగాలను సృష్టిస్తోందని, ఏఐపై ఎక్కువ దృష్టి పెట్టడానికి కంపెనీ తన జాబ్ స్ట్రక్చర్‌నే మారుస్తున్నట్టు పేర్కొంది.

ఇప్పుడు సమయం ఆసన్నమైంది

హైదరాబాద్ పెన్ పవర్: గ్రీన్‌ల్యాండ్ నుండి 'రష్యా ముప్పు'ను దూరం చేయడానికి డెన్మార్క్ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, కానీ ఇప్పుడు సమయం ఆసన్నమైందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదివారం పేర్కొన్నారు. గ్రీన్‌ల్యాండ్‌పై రష్యా ముప్పును దూరం చేయాలి అని నాటో 20 ఏళ్లుగా డెన్మార్క్‌ను హెచ్చరిస్తోందని, కానీ డెన్మార్క్ ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ట్రంప్ తన సోషల్‌మీడియా వెబ్‌సైట్ ట్రూత్‌లో ఒక పోస్ట్‌లో తెలిపారు. ఇప్పుడు సమయం ఆసన్నమైందని, చర్యలు తీసుకుంటామని అన్నారు. అయితే ట్రంప్ బెదిరింపులను డెన్మార్క్, గ్రీన్‌ల్యాండ్‌లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. గ్రీన్‌ల్యాండ్ అమ్మకానికి లేదని, అమెరికాలో భాగం కావాలనుకోవడం లేదని స్పష్టం చేశాయి. మరోవైపు గ్రీన్‌ల్యాండ్ స్వాధీనానికి మద్దతు ఇవ్వని యూరోపియన్ యూనియన్ దేశాలపై ట్రంప్ 10శాతం సుంకాలు విధించారు. దీంతో అమెరికాలో గతంలో కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాన్ని ఆమోదించేందుకు యూరోపియన్ పార్లమెంట్ తిరస్కరించింది. జీరో–టారిఫ్ ఒప్పందం ముందుకు తీసుకువెళ్లడం సాధ్యపడదని, ప్రతిచర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉంటామని పార్లమెంట్ సభ్యులు హెచ్చరించారు.

ఖర్జూరం, బాదం ఆరోగ్యానికి ఏది మంచింది?

హైదరాబాద్ పెన్ పవర్: చలికాలంలో ఆహారంపై మనం ప్రత్యేక శ్రద్ధ చూపడం చాలా అవసరం. ఎందుకంటే ఈ సీజన్‌లో మన శరీరంలో రోగనిరోధక శక్తి చాలా వరకు తగ్గిపోతుంది. తద్వారా మనం త్వరగా జబ్బుల భారీన పడుతాం ఇలా జరగకూడదంటే.. ఈ సీజన్‌లో మనం శరీరానికి శక్తినిచ్చే, వెచ్చగా ఉంచే, మొత్తం ఆరోగ్యాన్ని కాపాడే ఆహారాలు తీసుకోవడం ముఖ్యం. ఈ విషయంలో, ఖర్జూరాలు, బాదం వంటి డ్రై ఫ్రూట్స్ చాలా ఆరోగ్యకరమైనవని నిపుణులు చెబుతున్నారు. ఖర్జూరం, బాధం రెండు మన ఆరోగ్యానికి మేలు చేసేవే.. వీటిలో ఉండే పోషకాలు మన మొత్తం శరీరానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయి. మొదట ఖర్జూర వల్ల కలిగే ప్రయోజనాల గురించి చూసుకుంటే. వీటిలొ గ్లూకోజ్, ఫ్రక్టోజ్ వంటి సహజ చక్కెరలు ఉంటాయి. శీతాకాలంలో వీటిని తినడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. ఇది జలుబుతో పోరాడటానికి సహాయపడుతుంది. డేలీ 2-3 ఖర్జూరాలు తినడం వల్ల అలసట తగ్గుటమే కాకుండా శరీరం చురుగ్గా ఉంటుంది. ఖర్జూరాలలో ఇనుము కూడా పుష్కలంగా ఉంటుంది, ఇది శీతాకాలపు బలహీనత, హిమోగ్లోబిన్ లోపాన్ని నివారిస్తుంది. అలాగే ఇది శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అయితే, ఖర్జూరాలను మితంగా తీసుకోవాలి. వాటిలో చక్కెర అధికంగా ఉంటుంది, కాబట్టి మధుమేహ వ్యాధిగ్రస్తులు, బరువును నియంత్రించుకోవాలనుకునే వారు వాటిని అధికంగా తినకూడదు. బాదం తినడం వల్ల కూడా మన శరీరానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఇవి ఖర్జురాలా తక్షణ శక్తిని ఇవ్వవు.. కానీ స్లోగా శరీరంలో ఎనర్జీ లెవెల్స్‌ను పెంచుతాయి. వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్, ఫైబర్ ఉంటాయి, ఇవి శీతాకాలంలో శరీరాన్ని బలంగా, వెచ్చగా ఉంచడంలో సహాయపడతాయి. బాదంలో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది, ఇది చల్లని వాతావరణంలో పొడి చర్మాన్ని నివారించడంలో సహాయపడుతుంది. అలాగే రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అలాగే బాదం జ్ఞాపకశక్తిని పెంచుతుంది. అంతేకాదు బాదం కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంతో పాటు గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలొ కూడా సహాయపడుతుంది. ఖర్జూరం లబ బాదం: చలికాలంలో ఈ రెండూ ఆరోగ్యకరమైనవే. ఒక వేళ ఈ సీజన్‌లో మీరు తరచూ బలహీనంగా, చలిగా లేదా అలసిపోయినట్లు అనిపిస్తే, మీకు ఖర్జూరం ఉత్తమమైనది. ఎందుకంటే అవి తక్షణ శక్తిని, వెచ్చదనాన్ని అందిస్తాయి. అయితే, మీరు దీర్ఘకాలిక బలం, రోగనిరోధక శక్తి, మొత్తం ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకుంటే బాదం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది.

పచ్చి బఠానీలు.. పసుపు బఠానీలు ఏవి ఆరోగ్యానికి మంచివి?

హైదరాబాద్ పెన్ పవర్: పచ్చి, పసుపు బఠానీలను అనేక రకాల వంటకాలలో ఉపయోగిస్తారు. ఇప్పుడు, చాలా సార్లు ప్రజలకు ఏ బఠానీలు ఆరోగ్యానికి ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటాయో అర్థం కాదు. మీరు వాటిని కొనుగోలు చేస్తుంటే, మంచి నాణ్యమైన బఠానీలను మాత్రమే కొనుగోలు చేసి ఇంటికి తీసుకురండి.పచ్చి లేదా పసుపు బఠానీలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలున్నాయి. అయితే, శీతాకాలంలోనే ఎక్కువగా పచ్చి బఠానీలను మార్కెట్లో అమ్ముతారు. ఆ తర్వాత, మీరు ఏడాది పొడవునా ఎండబెట్టిన బఠానీలను మాత్రమే తినవచ్చు. పచ్చి బఠానీలను ఎండబెట్టిన తర్వాత, వాటిని పసుపు బఠానీల పేరుతో మార్కెట్‌లో కూడా అమ్ముతారు. ఎండబెట్టిన తర్వాత, పచ్చి బఠానీలు పసుపు రంగులోకి మారుతాయి. కానీ, కొన్నిసార్లు ఎండిన పచ్చి బఠానీలు కూడా మార్కెట్లో లభిస్తాయి. ఇది వేరే రకమైన బఠానీలు. ఎండబెట్టిన తర్వాత కూడా ఈ బఠానీలు పచ్చగా ఉంటాయి. రెండు రకాల పోషక విలువలు కూడా దాదాపు ఒకే విధంగా ఉంటాయి. అయితే, రెండు బఠానీలను అనేక రకాల వంటకాలలో ఉపయోగిస్తారు. ఇప్పుడు, చాలా సార్లు ప్రజలకు ఏ బఠానీలు ఆరోగ్యానికి ఎక్కువ ప్రయోజనకరంగా ఉంటాయో అర్థం కాదు. మీరు వాటిని కొనుగోలు చేస్తుంటే, మంచి నాణ్యమైన బఠానీలను మాత్రమే కొనుగోలు చేయాలి. వంట కోసం మీరు పచ్చి బఠానీలు లేదా పసుపు బఠానీలను ఉపయోగించవచ్చు. అయితే, వాటి రుచిలో స్వల్ప తేడా ఉంటుంది. పచ్చి బఠానీలు తక్కువ స్టార్చ్ కలిగి ఉంటాయి, పసుపు బఠానీల కంటే తియ్యగా ఉంటాయి. పసుపు బఠానీలు మట్టి, వగరు రుచిని కలిగి ఉంటాయి. అవి పచ్చి బఠానీల కంటే తేలికపాటివి, తక్కువ ఘాటుగా ఉంటాయి. మీ ఆహారంలో బలమైన బఠానీ రుచి ఉండకూడదనుకుంటే.. పసుపు బఠానీలు ఉత్తమం. రెండు రకాల ఎండిన బఠానీలు వండడానికి దాదాపు ఒకే సమయం పడుతుంది. ఆకుపచ్చ, పసుపు బఠానీలు రెండింటిలోనూ ప్రోటీన్, ఫైబర్, విటమిన్ బి, మెగ్నీషియం, ఇనుము మంచి మొత్తంలో ఉంటాయి. ఈ బఠానీలు కాల్షియం, జింక్, నియాసిన్, విటమిన్ ఇ, ఫోలేట్, పొటాషియం కోసం మీ రోజువారీ అవసరాలను తీర్చగలవు. బరువు తగ్గడానికి బఠానీలు ఒక అద్భుతమైన ఎంపిక. అవి జీర్ణక్రియకు సహాయపడతాయి. అవి ఆకలిని నియంత్రించడానికి, జీవక్రియను పెంచడానికి మంచివి. ఈ చిన్న బఠానీలు శక్తినిచ్చే పోషకాలను కలిగి ఉంటాయి. బఠానీలు వాపును తగ్గిస్తాయి, రక్తహీనతను నివారిస్తాయి, రక్తపోటును నియంత్రిస్తాయి. రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. బఠానీలు తినడం వల్ల ఆరోగ్యకరమైన గుండెను నిర్వహించడానికి సహాయపడుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. పసుపు బఠానీలను ప్రోటీన్ పౌడర్‌లో ఉపయోగిస్తారు. రెండూ ఆరోగ్యానికి మంచివిగా భావిస్తారు, కానీ పసుపు బఠానీలు పచ్చి బఠానీల కంటే కొంచెం ఖరీదైనవి.

అవిసె గింజల పొడి ప్రయోజనాలు

హైదరాబాద్ పెన్ పవర్: కొన్ని గింజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇప్పుడున్న రోజుల్లో రకరకాల అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. అయితే అవిసె గింజల పొడితో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని చెబుతన్నారు నిపుణులు. అవిసె గింజలు ఒమేగా-3 కొవ్వులు, ఫైబర్, లిగ్నన్‌లను కలిగి ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. విత్తనాలను రుబ్బుకోవడం వల్ల బయటి పొర విచ్ఛిన్నమవుతుంది. తద్వారా శరీరం పోషకాలను బాగా గ్రహించగలుగుతుంది.

ప్రతిరోజూ 1 నుండి 2 టీస్పూన్లు తీసుకోవడం జీర్ణక్రియ, గుండె ఆరోగ్యం, రక్తంలో చక్కెర నియంత్రణకు సహాయపడుతుంది. గ్రౌండ్ ఫ్లాక్స్ సీడ్ లోని ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. రోజుకు 30 గ్రాములు తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లు తగ్గుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. లిగ్నన్లు మంటను తగ్గిస్తాయి. రక్త నాళాలలో ఫలకం ఏర్పడకుండా నిరోధిస్తాయి. అవిసె గింజల్లోని ఫైబర్ కార్బోహైడ్రేట్ల జీర్ణక్రియను నెమ్మదిస్తుంది. రక్తంలో చక్కెరలో ఆకస్మిక హెచ్చుతగ్గులను నివారిస్తుంది. ప్రతిరోజూ రెండు టేబుల్ స్పూన్లు తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుందని పరిశోధనలో తేలింది. లిగ్నన్లు ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి.గ్రౌండ్ ఫ్లాక్స్ సీడ్‌లోని ఫైబర్ మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. అలాగే గట్ బాక్టీరియాను సమతుల్యం చేస్తుంది. ఇది ఉబ్బరం, ఎఖాతో సంబంధం ఉన్న నొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. రోజువారీ వినియోగం ప్రేగు కదలికలను సులభతరం చేయడానికి, పెద్దప్రేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. గ్రౌండ్ ఫ్లాక్స్ సీడ్ ఆకలి హార్మోన్లను తగ్గిస్తుంది. ఇది అతిగా తినకుండా నిరోధించడానికి సహాయపడుతుంది. రోజువారీ వినియోగం కేలరీల తీసుకోవడం తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. దీని కొవ్వు, ప్రోటీన్, ఫైబర్ రక్తంలో చక్కెరను స్థిరీకరించడానికి సహాయపడతాయి. అవిసె గింజల్లోని లిగ్నన్లు హార్మోన్లను సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. మొటిమలు, పొడి చర్మాన్ని తగ్గిస్తాయి. ఒమేగా-3లు చర్మాన్ని లోపలి నుండి హైడ్రేట్ చేస్తాయి. క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చర్మం వృద్ధాప్యం, ఫ్రీ రాడికల్స్ ప్రభావాలను తగ్గిస్తుంది. పరిశోధన ప్రకారం.. అవిసె గింజలలోని లిగ్నన్లు అదనపు ఈస్ట్రోజెన్‌తో బంధించి రొమ్ము, ప్రోస్టేట్ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఫైబర్ శరీరం నుండి విషాన్ని బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఇది క్యాన్సర్‌కు నివారణ కానప్పటికీ, ఇది ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అవిసె గింజల్లోని ఫైటోఈస్ట్రోజెన్లు ఎముక సాంద్రతను కాపాడుకోవడానికి సహాయపడతాయి. అవిసె గింజల్లోని ఖనిజాలు విటమిన్ డి ప్రభావాలను పెంచుతాయి. అవిసె గింజలను తీసుకోవడం వల్ల ఎముక ఖనిజ సాంద్రత పెరుగుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయి.

ఖాళీ కడుపుతో బొప్పాయి తింటున్నారా?

హైదరాబాద్ పెన్ పవర్: ఉదయం ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. ఇది జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది, పేగులను శుభ్రపరుస్తుంది. బొప్పాయిలోని ఫైబర్ బరువును నియంత్రిస్తూ, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరీకరిస్తుంది. విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. చర్మాన్ని మెరుగుపరుస్తుంది. గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది. రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనాన్ని పొందవచ్చు. ఉదయం మీ పేగులు సరిగ్గా శుభ్రం కాకపోతే, మీరు బొప్పాయిని క్రమం తప్పకుండా తినవచ్చు. ఇది పేగులలో పేరుకుపోయిన మురికిని శుభ్రపరుస్తుంది. తరచుగా జీర్ణ సమస్యలు ఉన్నవారికి ఉదయం బొప్పాయి తినడం సహజ నివారణ. మీరు వేగంగా బరువు పెరుగుతున్నట్లయితే, ఈరోజు నుండి మీ ఆహారంలో బొప్పాయిని చేర్చుకోండి. ఇందులో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ కడుపు నిండిన అనుభూతిని ఇస్తుంది. ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఫైబర్ ఆహారాన్ని నెమ్మదిగా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది. జీవక్రియను కూడా పెంచుతుంది. విటమిన్ సి ఉండటం వల్ల బొప్పాయి రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఇది జలుబు, దగ్గు, ఇతర ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యాన్ని పెంచుతుంది. బొప్పాయి చర్మానికి కూడా మేలు చేస్తుంది. ఇందులో ఉండే విటమిన్లు ఎ, సి, ఇ, బీటా కెరోటిన్ చర్మాన్ని ప్రకాశవంతంగా, యవ్వనంగా ఉంచుతాయి. ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల చర్మం తేమను నిర్వహిస్తుంది. మొటిమలు, మచ్చలు తగ్గుతాయి. బొప్పాయితో చేసిన ఫేస్ ప్యాక్‌ను చర్మంపై అప్లై చేయడం వల్ల అనేక సమస్యలను నివారించవచ్చు. చర్మం మృదువుగా మారుతుంది. టానింగ్, ముడతలు తొలగిపోతాయి. ఇది జుట్టుకు పోషణను అందిస్తుంది. కాబట్టి ఇది జుట్టుకు కూడా ప్రయోజనకరంగా ఉంటుంది. బొప్పాయి గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో కూడా ప్రసిద్ధి చెందింది. ఇందులో పొటాషియం, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రిస్తాయి. ఇది రక్తపోటును సమతుల్యంగా ఉంచుతుంది. ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అల్పాహారానికి ముందు ఖాళీ కడుపుతో ఒక గిన్నె తాజా బొప్పాయి తినడం అనేక విధాలుగా ప్రయోజనకరంగా ఉంటుంది. దీన్ని మీ దినచర్యలో చేర్చుకోవడం ద్వారా, మీరు ఆరోగ్యకరమైన జీవితాన్ని ఆస్వాదించవచ్చు.

రోజూ నిమ్మకాయ నీళ్లు తాగడం ఆరోగ్యానికి మంచిదేనా..?

హైదరాబాద్ పెన్ పవర్: నిమ్మకాయ.. మన వంటింట్లో సులభంగా దొరికే అద్భుత ఔషధం. విటమిన్-సి, పొటాషియం, ఫ్లేవనాయిడ్లకు నిలయమైన నిమ్మరసాన్ని రోజూ తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని అందరికీ తెలిసిందే. అయితే దీనిని ఎంతకాలం తాగాలి..? ఎప్పుడు తాగితే మంచిది..? ఆయుర్వేదం ఏం చెబుతోంది? జీర్ణక్రియకు - బరువు తగ్గడం: యలో ఉండే ఆమ్ల రసం వాత, కఫ దోషాలను తొలగిస్తుందని ఆయుర్వేదం చెబుతోంది. ఇది జీర్ణశక్తిని పెంచడమే కాకుండా శరీరంలోని విషతుల్యాలను బయటకు పంపుతుంది. ముఖ్యంగా ఊబకాయం తగ్గాలనుకునే వారు 15 నుండి 21 రోజుల పాటు నిరంతరం నిమ్మరసం తీసుకోవడం వల్ల జీవక్రియ మెరుగుపడి మంచి ఫలితాలు కనిపిస్తాయి.నెల రోజులు తాగితే: సాధారణ ఆరోగ్య ప్రయోజనాల కోసం 20-30 రోజుల పాటు నిరంతరం నిమ్మరసం తీసుకోవచ్చు. అయితే ఆయుర్వేద నిపుణుల ప్రకారం.. ఒక నెల పాటు వరుసగా నిమ్మరసం తాగిన తర్వాత, కనీసం ఒక వారం పాటు విరామం ఇవ్వడం మంచిది. ఇలా చేయడం వల్ల శరీరం సహజ సమతుల్యతను కాపాడుకుంటుంది. రోజూ ఎంత తాగాలి? ఎలా తాగాలి?: శాస్త్రీయ కోణంలో చూస్తే నిమ్మరసం చాలా ఆరోగ్యకరమైన డ్రింక్. కానీ దీనిని పరిమితంగా తీసుకోవడమే క్షేమకరం. రోజుకు ఒక గ్లాసు నీటిలో సగం నిమ్మకాయను పిండుకుని తాగడం ఉత్తమం. గోరువెచ్చని నీటిని తీసుకుని, అందులో నిమ్మరసం కలిపి తాగాలి. రుచి కోసం కొద్దిగా తేనె కూడా కలుపుకోవచ్చు. ఉదయం ఖాళీ కడుపుతో లేదా భోజనానికి 30 నిమిషాల ముందు తీసుకోవడం వల్ల ఎక్కువ ప్రయోజనాలు లభిస్తాయి. ప్రయోజనాలు అనేకం: ఇందులోని యాంటీఆక్సిడెంట్లు ఇమ్యూనిటీని పెంచుతాయి. చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. శరీరంలో నీటి లోపాన్ని నివారిస్తుంది.

బ్రోకలీ లేదా క్యాబేజీ బరువు తగ్గడానికి ఏది మంచిది?

హైదరాబాద్ పెన్ పవర్: ఈ మధ్యకాలంలో చాలా మంది వెయిట్ లాస్ అవ్వాలని, ఫిట్‌గా కనిపించాలని అనుకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేక డైట్స్ ఫాలో అవుతున్నారు. డైట్ చేసే సందర్భంలో ఆరోగ్యకరమైన ఆహారాలను ఎంచుకోవడం చాలా ముఖ్యం. అలాంటప్పుడు బ్రోకలీ, క్యాబేజీ వంటి క్రూసిఫెరస్ కూరగాయలు మన ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడుతాయి. వీటిలో మన శరీరానికి కావలసిన ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. చాలా మంది బ్రోకలీ అనే సరపేట్‌గా కూరగాయాల్లో ఒకటి అనుకుంటారు. కానీ బ్రోకలీ కూడా క్యాబేజీ కుటుంబానికి చెందిన ఆకుపచ్చ క్రూసిఫెరస్ కూరగాయ. జూఆం (యునైటెడ్ స్టేట్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్) డేటా ప్రకారం, 100 గ్రాముల బ్రోకలీలో సుమారు 34 కేలరీలు, సుమారు 89 గ్రాముల నీరు, 2.8 గ్రాముల ప్రోటీన్, చాలా తక్కువ కొవ్వు, 2.6 గ్రాముల ఫైబర్ మరియు 1.7 గ్రాముల సహజ చక్కెర ఉంటాయి. ఇంకా, బ్రోకలీ విటమిన్ సి, విటమిన్ కె ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తి పెంచడంతో పాటు ఎముకల ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉంటాయి. బ్రోకలీలో విటమిన్లు, ఖనిజాలు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో గ్లూకోసినోలేట్స్, సల్ఫోరాఫేన్ వంటి నిర్దిష్ట సల్ఫర్ సమ్మేళనాలు కూడా ఉన్నాయి, ఇవి శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. బ్రోకలీలోని ఫైబర్, ముఖ్యంగా కరిగే ఫైబర్, కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇంకా, ఫైబర్ కార్బోహైడ్రేట్‌లను నెమ్మదిగా జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. ఇది రక్తంలో చక్కెర, ఇన్సులిన్ స్థాయిలను నియంత్రిస్తుంది. ఇది డయాబెటిస్, మెటబాలిక్ సిండ్రోమ్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. క్యాబేజీలో పోషకాలు : క్యాబేజీ బ్రాసికా కుటుంబానికి చెందినది, ఇందులో బ్రోకలీ, కాలీఫ్లవర్, కాలే వంటి కూరగాయలు ఉంటాయి. జూఆం డేటా ప్రకారం, 100 గ్రాముల క్యాబేజీలో దాదాపు 25 కేలరీలు, దాదాపు 92 గ్రాముల నీరు, 1.2 గ్రాముల ప్రోటీన్, చాలా తక్కువ కొవ్వు, 2.5 గ్రాముల ఫైబర్ , 3.2 గ్రాముల సహజ చక్కెర ఉంటాయి. క్యాబేజీ విటమిన్ సి, విటమిన్ కె లకు కూడా మంచి మూలం, ఇవి రోగనిరోధక శక్తి, ఎముకల ఆరోగ్యానికి ప్రయోజనకరంగా భావిస్తారు. బ్రోకలీ లేదా క్యాబేజీలో ఏది మంచిది?: పోషకాల పరంగా చూసుకుంటే క్యాబేజీ కంటే బ్రోకలీని ఎక్కువ పోషకాలు ఉంటాయి. అంటే ఇందులో ఎక్కువ యాంటీఆక్సిడెంట్లు, వ్యాధి-రక్షణ సమ్మేళనాలు ఉంటాయి. క్యాబేజీలో కూడా పోషకాలు పుష్కలంగా ఉంటాయి. కానీ బ్రోకలి కన్నా తక్కువగా ఉంటాయి. అయితే దీన్ని రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం సులభం. బ్రోకలీ, క్యాబేజీ రెండూ ఆరోగ్యకరమైనవి. మీకు ఏది సరైనదనేది.. మీ అవసరాలు, జీవనశైలిపై ఆధారపడి ఉంటుంది. మీకు ఎక్కవ పోషకాలు కావాలంటే బ్రోకలీ మీకు మంచిది. అయితే, క్యాబేజీని రోజువారీ భోజనాలకు ఆరోగ్యకరమైన ఎంపికగా భావిస్తారు.

భారత కంపెనీలకు పోటీతత్వమే కీలకం

హైదరాబాద్ పెన్ పవర్: అయిదు రోజుల పాటు దావోస్ జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశాలకు భారత్ నుంచి వ్యాపార ప్రముఖులు హాజరు కానున్నారు. కంపెనీలకు ఖర్చు, స్థాయి, సామర్థ్యాల్లో పోటీతత్వాన్ని తీసుకురావడమే కీలకంగా మారిందని కన్సల్టెన్సీ సంస్థ బీసీజీ ఇండియా అధిపతి రాహుల్ జైన్ తెలిపారు. 2030 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలిచే అవకాశం ఉందన్నారు. డబ్ల్యూఈఎఫ్ సమావేశాల్లో భారత్‌కు సంబంధించి ఇది కీలకమైన చర్చనీయాంశం కానుంది. '2028 నాటికే ఈ మైలురాయిని చేరుకోవడానికి వృద్ధిని మరింత వేగవంతం చేయొచ్చా అనేది ముఖ్యమైన ప్రశ్న. ఇందుకోసం ప్రస్తుతం జీడీపీలో 15-17 శాతంగా ఉన్న తయారీ రంగాన్ని, 20% లేదా అంతకంటే ఎక్కువకు తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఇదే జరిగితే ఈ లక్ష్యాన్ని సాధించడం ఎప్పుడూ అనే ప్రస్తావన ఉండదు' అని జైన్ పేర్కొన్నారు. శుద్ధ ఇంధనం, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు వంటి వర్ధమాన రంగాల్లో పెట్టుబడులతో భారత్‌లో కొత్త వృద్ధి అవకాశాలు సృష్టించొచ్చని జైన్ వెల్లడించారు. ఎలక్ట్రానిక్స్, వాహన విడిభాగాలు, పునరుత్పాదక ఇంధన, హార్డ్‌వేర్, డేటా కేంద్రాలు, సెమీకండక్టర్ వ్యవస్థలను విస్తరించడం ద్వారా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో భారత్ మరింత చొచ్చుకువెళ్లొచ్చని అంచనా వేశారు.

పొట్టి ఫార్మాట్‌పై ఫోకస్: ఇండియా, న్యూజిలాండ్ టీ20 సిరీస్.. షెడ్యూల్, స్క్వాడ్ వివరాలు ఇవే!

హైదరాబాద్ పెన్ పవర్: న్యూజిలాండ్ పై వన్డే ఫార్మాట్‌లో ఇండియా స్వదేశంలో తొలిసారి సిరీస్ ఓడిపోయింది. డారిల్ మిచెల్ (131 బాల్స్‌లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 137) , గ్లెన్ ఫిలిప్స్ (88 బాల్స్‌లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 106) అద్భుత సెంచరీలకు తోడు బౌలర్లు రాణించడంతో హోల్కర్ స్టేడియంలో ఆదివారం (జనవరి 18) జరిగిన మూడో వన్డేలో కివీస్ 41 రన్స్ తేడాతో ఇండియాను ఓడించింది. ఫలితంగా సిరీస్‌ను 21తో సొంతం చేసుకుంది. తొలి వన్డేలో ఇండియా గెలిస్తే.. రెండు మూడు వన్డేల్లో న్యూజిలాండ్ జయభేరి మోగించింది. వన్డే సిరీస్ ముగియడంతో ఇప్పుడు ఫ్యాన్స్ అందరూ టీ20 సిరీస్ చూడాలని ఆతృత్తగా కనిపిస్తున్నారు. 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ లో భాగంగా ఇండియా, న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి టీ20 బుధవారం (జనవరి 21) జరగనుంది. వరల్డ్ కప్ ముందు ఇరు జట్లకు ఇదే ఇరు జట్లకు చివరి సిరీస్. జనవరి 21 నుంచి జనవరి 31 వరకు ఐదు మ్యాచ్ ల టీ20 సిరీస్ జరగనుంది. ఇండియాకు సూర్య కుమార్ యాదవ్ కెప్టెన్సీ చేయనున్నాడు. మరోవైపు న్యూజిలాండ్ జట్టును మిచెల్ సాంట్నర్ లీడ్ చేయనున్నాడు. ఇండియాపై సిరీస్ గెలుచుకున్న కివీస్ ఆత్మవిశ్వాసంతో కనిపిస్తోంది. మరోవైపు టీ20 ల్లో తిరుగులేకుండా దూసుకెళ్తున్న టీమిండియా సిరీస్ నెగ్గుతామనే ధీమాగా కనిపిస్తోంది. ఈ సిరీస్ షెడ్యూల్, రెండు జట్ల స్క్వాడ్ వివరాలు ఇప్పుడు చూద్దాం..

ఇండియా, న్యూజిలాండ్ టీ20 షెడ్యూల్:

బుధవారం (జనవరి 21): తొలి టీ20: విదర్భ క్రికెట్ అసోసియేషన్ స్టేడియం, నాగ్‌పూర్

శుక్రవారం (జనవరి 23): రెండో టీ20: షహీద్ వీర్ నారాయణ్ సింగ్ అంతర్జాతీయ స్టేడియం, రాయ్‌పూర్

ఆదివారం (జనవరి 25): మూడో టీ20: బర్సపారా క్రికెట్ స్టేడియం, గౌహతి

బుధవారం (జనవరి 28): నాలుగో టీ 20:వైఎస్ రాజశేఖర రెడ్డి ACA`VDCA క్రికెట్ స్టేడియం, విశాఖపట్నం

శనివారం (జనవరి 31): ఐదో టీ20: గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం, తిరువనంతపురం

ఇండియా స్క్వాడ్:

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్ (తొలి మూడు టీ20లు), హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ (వైస్ కెప్టెన్), రింకు సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, రవి బిష్ణోయ్, ఇషాన్ కిషాన్

న్యూజిలాండ్ స్క్వాడ్:

మిచెల్ సాంట్నర్ (కెప్టెన్), మైఖేల్ బ్రేస్‌వెల్, మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, జాకబ్ డఫీ, జాక్ ఫౌల్క్స్, మాట్ హెన్రీ, కైల్ జామిసన్, బెవాన్ జాకబ్స్, డారిల్ మిచెల్, జేమ్స్ నీషమ్, గ్లెన్ ఫిలిప్స్, రాచిన్ రవీంద్ర, టిమ్ రాబిన్సన్, ఇష్ సోధి

ఆరు నెలలు ఆగాల్సిందే: రోహిత్, కోహ్లీ కనిపించేది అప్పుడే.. టీమిండియా నెక్స్ట్ వన్డే షెడ్యూల్ ఇదే

హైదరాబాద్ పెన్ పవర్: టీమిండియా స్టార్ ప్లేయర్స్ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ మళ్ళీ ఎప్పుడు అంతర్జాతీయ క్రికెట్ లో కనిపిస్తారో అని ఫ్యాన్స్ ఎదురు చూపులు చూస్తున్నారు. రోకో జోడీ సూపర్ ఫామ్ లో ఉండడంతో వీరి ఆటను చూడడానికి ఫ్యాన్స్ తెగ ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం వీరిద్దరూ ఒకటే ఫార్మాట్ ఆడడంతో వన్డే షెడ్యూల్ పై ఎదురు చూడాల్సిన పరిస్థితి. తాజాగా న్యూజిలాండ్ తో జరిగిన సిరీస్ ను ఇండియా 1-2 తేడాతో ఓడిపోయింది. ఆదివారం (జనవరి 18) ఇండోర్ వేదికగా హోల్కర్ క్రికెట్ స్టేడియంలో ముగిసిన ఈ మ్యాచ్ లో 41 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. కివీస్ తో సిరీస్ ముగిశాక ఇండియా తర్వాత వన్డే షెడ్యూల్ ఏంటో ఫ్యాన్స్ తెలుసుకోవడానికి ఆసక్తిగా ఉన్నారు. ఇండియా తర్వాత వన్డే షెడ్యూల్ జూలై లో ఇంగ్లాండ్ తో ఆడాల్సి ఉంది. భారత క్రికెట్ జట్టు 2026లో వైట్-బాల్ సిరీస్ కోసం ఇంగ్లాండ్‌లో టూర్ కు వెళ్లనుంది. ఇందులో భాగంగా మొత్తం 8 మ్యాచ్ లు ఆడనుంది. మొదట 5 టీ20 మ్యాచ్ లు ఆ తర్వాత 3 వన్డేలు జరగనున్నాయి. జూలై 14 నుంచి 19 మధ్య వన్డే సిరీస్ జరుగుతుంది. మూడు వన్డేలు బర్మింగ్‌హామ్, కార్డిఫ్, లండన్‌లో జరుగుతాయి. జూలై 4, జూలై 7, జూలై 9, జూలై 11 న వరుసగా రెండు, మూడు, నాలుగు, ఐదు టీ 20 మ్యాచ్ లు జరుగుతాయి. మాంచెస్టర్, నాటింగ్ హోమ్, బ్రిస్టల్, సౌతాంప్టన్ వేదికలుగా ఈ మ్యాచ్ లు జరుగుతాయి.

ప్రస్తుతం ఇండియా న్యూజిలాండ్ తో 5 మ్యాచ్ ల టీ20 సిరీస్ ఆడడానికి సిద్ధంగా ఉంది. ఆ తర్వాత ఫిబ్రవరి లో టీ20 వరల్డ్ కప్ జరుగుతుంది. మార్చ్ నుంచి మే వరకు ఐపీఎల్ లో ప్లేయర్స్ బిజీ కానున్నారు. ఐపీఎల్ తర్వాత 2026 జూన్ లో ఆఫ్ఘనిస్తాన్‌తో మూడు వన్డే మ్యాచ్ ల సిరీస్ ఉన్నట్టు చర్చలు నడుస్తున్నాయి. అయితే వీటి గురించి ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. జూలై లో ఇంగ్లాండ్ తో ఇండియా తమ తదుపరి సిరీస్ ఆడడం ఖాయంగా మారింది. అంటే కోహ్లీ, రోహిత్ ను చూడడానికి మరో 6 నెలల పాటు ఆగాల్సిందే.

ఇటీవలే న్యూజిలాండ్ తో ముగిసిన వన్డే సిరీస్ లో రోహిత్ శర్మ పెద్దగా ఆకట్టులేకపోయాడు. మూడు మ్యాచ్ ల్లో వరుసగా 26, 24, 11 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అదే సమయంలో కోహ్లీ మాత్రం అద్భుతంగా రాణించాడు. సిరీస్ తొలి మ్యాచ్ లో కోహ్లీ 91 బంతుల్లో 93 పరుగులు చేశాడు. రెండో మ్యాచ్‌లో 29 బంతుల్లో 23 పరుగులకు ఔటయ్యాడు. ఆదివారం (జనవరి 18) ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో జరిగిన చివరి వన్డేలో 108 బంతుల్లో 124 పరుగులు చేశాడు. ఓవరాల్ గా మూడు మ్యాచ్ ల్లో 80 యావరేజ్ తో 240 పరుగులు చేశాడు.

ఇండియా, ఇంగ్లాండ్ 2026 వన్డే, టీ20 షెడ్యూల్:

జూలై 14: మొదటి వన్డే - ఎడ్జ్‌బాస్టన్, బర్మింగ్‌హామ్, సాయంత్రం 5:30

జూలై 16: రెండవ వన్డే - సోఫియా గార్డెన్స్, కార్డిఫ్, సాయంత్రం 5:30

జూలై 19: మూడవ వన్డే - లార్డ్స్, లండన్, మధ్యాహ్నం 3:30

టీ20 సిరీస్ షెడ్యూల్:

జూలై 1: మొదటి టీ20 బ్యాంక్స్ హోమ్స్ రివర్‌సైడ్, దర్హామ్, రాత్రి 11 గంటలకు

జూలై 4: 2వ టీ20 - ఎమిరేట్స్ ఓల్డ్ ట్రాఫోర్డ్, మాంచెస్టర్, రాత్రి 7 గంటలకు

జూలై 7: 3వ టీ20 ట్రెంట్ బ్రిడ్జ్, నాటింగ్‌హామ్, రాత్రి 11 గంటలకు

జూలై 9: 4వ టీ20 - సీట్ యునిక్ స్టేడియం, బ్రిస్టల్, రాత్రి 11 గంటలు

జూలై 11: 5వ టీ20 యుటిలిటా బౌల్, సౌతాంప్టన్, రాత్రి 11 గంటలు

ఇండియా, ఆస్ట్రేలియా కాదు.. వరల్డ్ కప్ గెలిచేది ఆ జట్టే: దిగ్గజ క్రికెటర్ జోస్యం

హైదరాబాద్ పెన్ పవర్: 2026 టీ20 వరల్డ్ కప్ ను భారత్, శ్రీలంకలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. 2026 ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది. టోర్నమెంట్ లో భాగంగా తొలి మ్యాచ్ ఫిబ్రవరి 7న పాకిస్తాన్- నెదర్లాండ్ మధ్య జరుగుతుంది. వరల్డ్ కప్ కు కేవలం 20 రోజుల సమయం మాత్రమే ఉంది. ఇప్పటికే టీమిండియాతో పాటు దాదాపు అన్ని జట్లు వరల్డ్ కప్ కు తమ స్క్వాడ్ ను ప్రకటించేశాయి. వరల్డ్ కప్ చరిత్రలో తొలిసారి 20 జట్లు పోటీ పడుతుండడంతో ఈ మెగా టోర్నీకి భారీ హైప్ నెలకొంది. ఇండియా, ఆస్ట్రేలియా జట్లు ఈ మెగా టోర్నీలో ఫేవరేట్ గా బరిలోకి దిగుతున్నాయి. 2026 టీ20 వరల్డ్ కప్ ఇండియా లేదా ఆస్ట్రేలియా లేదా ఇంగ్లాండ్ గెలుచుకుంటుందని భావిస్తుంటే ఇంగ్లాండ్ దిగ్గజ క్రికెటర్ మైకేల్ వాన్ జోస్యం ప్రస్తుతం వైరల్ అవుతోంది. టీ20 వరల్డ్ కప్ ముందు మైకేల్ వాన్ మాట్లాడుతూ వరల్డ్ కప్ గెలిచే జట్టును చెప్పి కొంచెం ఆశ్చర్యానికి గురి చేశాడు. తాజాగా టీమిండియాకు షాక్ ఇచ్చి వన్డే సిరీస్ ను 2-1 తేడాతో గెలుచుకున్న న్యూజిలాండ్ జట్టు వరల్డ్ కప్ గెలవగలదని వాన్ అభిప్రాయపడ్డాడు. వాన్ ఎక్స్ లో ఇలా రాసుకొచ్చాడు. “న్యూజిలాండ్ టీ20 వరల్డ్ కప్ గెలవొచ్చు. ఆ జట్టులో ఎప్పుడూ బలమైన ప్లేయర్స్ ఉంటారు. ఈ సారి వరల్డ్ కప్ కొడుతుంది“. అని వాన్ తన అభిప్రాయాన్ని తెలిపాడు. ఈ సారి ఈ మెగా టోర్నీలో 20 జట్లు తలపడనున్నాయి. భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్, యూఏఈ, ఒమన్, వెస్టిండీస్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, నమీబియా, జింబాబ్వే, ఐర్లాండ్, ఇంగ్లాండ్, నెదర్లాండ్స్, ఇటలీ, నేపాల్, పాకిస్థాన్ జట్లు టోర్నమెంట్ లో భాగం కానున్నాయి. భారత్‌లో జరిగే మ్యాచ్ లు 5 స్టేడియాల్లో జరుగుతాయి. అహ్మదాబాద్, దిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబయి స్టేడియాలు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఇక శ్రీలంక లో 3 వేదికల్లో నిర్వహించనున్నారు. ప్రారంభ, ఫైనల్ మ్యాచ్‌లు అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో నిర్వహించనున్నారు.

మహిరా శర్మ: యూత్‌ఫుల్ ఆకర్షణ, పెరుగుతున్న స్టార్‌డమ్

100 కోట్లు.. బాలయ్య, నాగ్ నెక్స్ట్ ప్లాన్స్ తో సాధ్యమేనా?



టాలీవుడ్ సీనియర్ హీరోలు నందమూరి బాలకృష్ణ, కింగ్ నాగార్జున ఇప్పుడు తమ అప్ కమింగ్ మూవీస్ తో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. రీసెంట్ గా అఖండ 2: తాండవం మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన బాలయ్య.. ఇప్పుడు డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో వర్క్ చేస్తున్నారు. ఇప్పటికే వారి కాంబోలో వీరసింహారెడ్డి సినిమా రాగా.. ఇప్పుడు మరోసారి కలిసి సినిమా చేస్తున్నారు.పీరియాడిక్ బ్యాక్ డ్రాప్ తో రూపొందుతున్న ఆ సినిమాలో బాలయ్య డ్యూయల్ రోల్ పోషిస్తున్నారు. రెండు పాత్రలకు సంబంధించిన లుక్స్ ఇప్పటికే రిలీజ్ అయ్యి.. మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. సినిమాపై ఆడియన్స్ తోపాటు అభిమానుల్లో సూపర్ బజ్ క్రియేట్ చేశాయి. 2026 దసరాకు ఆ సినిమాతో బాలయ్య ప్రేక్షకుల ముందుకు రానున్నారని టాక్ వినిపిస్తోంది.అదే సమయంలో నాగార్జున ప్రస్తుతం తన 100వ సినిమా చేస్తున్నారు. చివరగా శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన కూలీ మూవీతో థియేటర్స్ లో సందడి చేసిన ఆయన.. ఇప్పుడు రా కార్తీక్ దర్శకత్వంలో కింగ్ 100 చేస్తున్నారు. యాక్షన్ ఫ్యామిలీ డ్రామాగా సినిమా ఉండనుందని తెలుస్తోంది. నాగ్ కెరీర్ లో ల్యాండ్ మార్క్ మూవీ కావడంతో అంతా భారీ అంచనాలు పెట్టుకున్నారు.అయితే ఇప్పుడు బాలయ్య, నాగ్ షూటింగ్స్ లో పాల్గొంటుండగా.. సోషల్ మీడియాలో కొత్త చర్చ మొదలైంది. వారిద్దరూ రూ.100 కోట్ల షేర్ మార్క్ ఎప్పుడు అందుకుంటారోనని అంతా మాట్లాడుకుంటున్నారు. ఇప్పటికే కెరీర్ లో కొన్ని వందల సినిమాలు చేసిన వారు.. రూ.100 కోట్ల షేర్ ను ఏ మూవీతో కూడా సాధించలేదు. కానీ టాలీవుడ్ కు చెందిన అనేక మంది హీరోలు ఆ ఘనత అందుకున్నారు.సీనియర్ హీరోల్లో చిరంజీవి, వెంకటేష్ తోపాటు ప్రభాస్, ఎన్టీఆర్, మహేష్ బాబు, రామ్ చరణ్, అల్లు అర్జున్, పవన్ కళ్యాణ్ సహా పలువురు రూ.100 కోట్ల షేర్ ను ఆయా చిత్రాలతో ఇప్పటికే సాధించారు. అందుకే ఇప్పుడు బాలకృష్ణ, నాగార్జున వంతు మాత్రమే మిగిలింది. దీంతో తమ అప్ కమింగ్ మూవీస్ తో వారిద్దరూ ఆ మార్క్ ను అందుకోవాలని అంతా కోరుకుంటున్నారు.నిజానికి బాలయ్య.. అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి వంటి సినిమాలతో రూ.100 కోట్ల షేర్ దగ్గరకు వెళ్లి ఆగిపోయారు. నాగార్జున కూడా సేమ్ అంతే. ఆయన నటించిన సోగ్గాడే చిన్నినాయనా, బంగార్రాజు వంటి సినిమాలు రూ.70 కోట్ల షేర్ వరకు రాబట్టాయి. అందుకే ఇప్పుడు అప్ కమింగ్ మూవీలతో రూ.100 కోట్ల షేర్ మార్క్ ను నాగ్, బాలయ్య అందుకుంటారో లేదో అన్నది వేచి చూడాలి.

నుపుర్ సనన్ ఆమె హల్దీ వేడుకలో పసుపు రంగులో మెరుస్తుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965